జనవరి
2016

117

సంపుటి : 10 సంచిక : 8 వెల రు. 10/-

## ఈ సంచికలో........

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న సంఘ పరివార్
ఆర్థిక సామాజిక రంగాల్లో వర్గ పోరాటం
పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలపై ఒక విశ్లేషణ
సామ్రాజ్యవాద ప్రయోజనాలకు పెద్దపీట
భారతదేశ సమ్మిళిత సంస్కృతిని దెబ్బతీస్తున్న హిందూత్వవాదులు
మహా నగరాల్లో ధనికులకు అవసరమౌతున్న మురికివాడల నివాసులు
మానవాభివృద్ధిపై మరోమారు దృష్టి సారించిన 'నోబెల్'
ఒయన్‌జిసి గ్యాస్‌ను దోచేస్తున్న రిలయన్స్
కార్యకర్తలు నిరంతరం ఆందోళన ప్రచారం నిర్వహించాలి
త్యాగధనుడు కామ్రేడ్ డివిఎస్

స్ఫూర్తి

# త్యాగధనుడు కామ్రేడ్ డివిఎస్


**నండూరి ప్రసాదరావు**

**ఉ**క్కులాంటి శరీరం, ఎప్పుడూ జబ్బున పడని ఆరోగ్యం, రోజుకు 16 గంటలు పని చేసినా అలసట లేని జవసత్వం. అలాంటి మనిషిని ఒకపక్క టిబి, రెండో పక్క క్యాన్సర్, రెండూ మహమ్మారి రోగాలే పట్టుకుని మూలుగలు పీల్చేశాయి. సంవత్సరం నుంచీ డాక్టర్లు చేసిన ప్రయత్నం ఒక ఎత్తు అయితే, డివిఎస్ స్వయంగా సంవత్సరాలుగా కూడబెట్టుకొని వచ్చిన ఆరోగ్యంతో ఈ రోగాల నెదుర్కొని చేసిన పోరాటం మరొక ఎత్తు. అయినా రోగాలే జయించాయి. అతను ఓడిపోయాడు. కాని ఓటమిని ధీరుడుగా తలవంచి అంగీకరించలేదు. అసలతని జీవితమే అంత.

గత 30–35 సంవత్సరాల పార్టీ ఉద్యమ చరిత్రలో వందల వేల మంది కామ్రేడ్స్ దేశం కోసం, ప్రజల కోసం, పార్టీ కోసం సేవ చేస్తూ చనిపోయారు. వారిలో కసాయి ప్రభుత్వ జైళ్ల లోనే గుళ్ళకు బలి అయిన వారున్నారు. హతాస్మరణాలకు గురయినవారు న్నారు. జైళ్లలోనే చనిపోయినవారున్నారు. జబ్బుచేసి కాలం చేసిన వారున్నారు. వారంతా ప్రజారంగాల్లో ప్రజల మధ్య పనిచేస్తూ వచ్చినవారు.

కాని కామ్రేడ్ డివిఎస్ ప్రధానంగా ఆఫీసు కార్యకర్త. కేవలం కార్యకర్త మాత్రమే కాదు, పార్టీ కార్యాలయ ఆర్గనైజర్. ఆఫీసుల్లో పని చేయగలిగిన అనుభవంకల కార్యకర్తలు కావల్సినంత మందిలేని పరిస్థితుల్లోనే పార్టీ సంస్థను ఏర్పాటుచేసి, బాలారిష్టాలను తట్టుకొని ఆ సంస్థకు స్వరూపం ఇస్తున్న తరుణంలోనే ఈ వ్యాధికి గురయ్యారు. కాస్త తగ్గిందోలేదో మళ్లా కార్యాలయంలో హాజరు, అదివరకు మధ్యాహ్నం పూట ఇంటికి భోజనానికి వెళ్లేవారు. ఇపుడు అది కూడా మానేశాడు. భోజనం ఇంటివద్ద నుంచి తెప్పించుకొని ఆఫీసులోనే మకాం పెట్టేశాడు. ఇంతలోనే అతని స్వతంత్రాన్ని ప్రభుత్వం హరించివేసింది. ఇపుడు అతని ప్రాణాన్నే హరించివేసింది.

ఇంగ్లీషులో ఒక సామెత వుంది. మావాడికి అన్ని విద్యలూ వచ్చుగాని ఒక్కదాంట్లోనూ నేర్పరితనం లేదనేది ఆ సామెత. కామ్రేడ్ డివిఎస్ తన జీవితంలో తన ఆచరణ ద్వారా ఈ సామెతకు విలువ లేకుండా చేశాడు. సిసలైన కమ్యూనిస్టులకు చేయలేని పని అంటూ ఏదీ



లేదు. పార్టీ ఇచ్చిన ప్రతీ బాధ్యతను నిర్వహించడంలో ఆయా విద్యలను నేర్చుకోవటమేకాదు: వాటన్నిటిలోనూ సెభాష్ అనేంత నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని సంపాదించాడు.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్గా, విశాలాంధ్ర భవన నిర్మాణ బాధ్యుడిగా, ప్రెస్ మేనేజర్గా, సంపాదకుడిగా అన్నిటిలోనూ పనిచేశాడు. పై పనులన్నీ ఒక దానికొకటి సంబంధంలేని పనులు. ఒక్కొక్క పనిలో ఒక్కో రకమైన అనుభవం, నేర్పరితనం కావాలి. ఆ పనులన్నీ చేస్తూనే, అనుభవాన్ని సంతరించుకొన్నాడు. నైపుణ్యాన్ని సంపాదించాడు.

**కార్యసాధకుడు**

అతను చదివిన బిఎ పుస్తకంలో ఒక ప్రచురణాలయం ఎలా నిర్వహించాలో లేదు. ఆ ప్రచురణాలయాన్ని నిర్వహించినపుడు భవన నిర్మాణం ఎలా సాగించాలో నేర్చుకోవటానికి అవకాశాలు లేవు. భవన నిర్మాణానికి, ఒక ప్రెస్ను నడిపించడానికి సంబంధంలేదు. ఈ పనులన్నింటికీ పత్రికా సంపాదకత్వానికి ఉత్తర, దక్షిణ ధృవాలకున్నంత దూరం. ఒకదానికొకటి పొంతనలేదు. ఈ పనులన్నీ పార్టీ ఇచ్చిన బాధ్యతలను ఎలా నిర్వహించటమో, కాదు కాదు – ఎలా విజయవంతంగా నిర్వహించటమో మాత్రమే తెలుసునుగాని చేతకాదని, అదేదో టెక్నికల్ పని అని, అంత భారం తాను నిర్వహించలేననే భీరువుకాదు. అదే కమ్యూనిస్టుల లోని ప్రత్యేక లక్షణం. అలాంటి శక్తిని, పట్టుదలను, దీక్షను సంతరించుకోవడం అందరు కమ్యూనిస్టులూ అంత సులువుగా సాధించలేని పని. కాని కామ్రేడ్ డివిఎస్ సాధించాడు. అందుకనే అతన్ని మనం సంస్మరించుకొంటున్నాం.

వాస్తవంగా చెప్పాలంటే విశాలాంధ్ర ప్రచురణాలయం రాష్ట్రంలోనే కాదు, మొత్తం దక్షిణ భారతంలోనే ఒక ప్రధాన సంస్థగా గుర్తింపు సంపాదించుకోగలిగిందంటే, స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్లో అచ్చు వేయించుకోవటమంటే పనితనాన్ని కోరే వారే అక్కడకు వెళ్తారనే పేరు సంపాదించుకోగలిగిందంటే దానికి పునాదులు వేసిన ముఖ్యుల్లో కామ్రేడ్ డివిఎస్ ఒకరు.

ఈ సంస్థలన్నీ నిర్వహించటంలో బయట అనేక వ్యాపార సంస్థలతో, బ్యాంకులతో, అధికారులతో సంబంధాలు ఏర్పరచుకోవటం అత్యవసరమైంది. వ్యాపార సంస్థల నిర్వహణ కమ్యూనిస్టుపార్టీకి అదే మొదటి అనుభవమైనా, కామ్రేడ్ డివిఎస్ ఆ బాధ్యతను ఎంతో నేర్పుతో నిర్వహించారు.

పార్టీలో వచ్చిన బేధాభిప్రాయాలను అవకాశంగా తీసుకొని డాంగేయులు విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున నడిచే సంస్థలను తమ జేబు సంస్థలుగా చేసుకొని కామ్రేడ్ డివిఎస్ తదితరులు బయటకు వెళ్లటంకన్నా మరో మార్గం లేకుండా చేశారు. నాయకత్వం చెప్పినంత మాత్రాన దానిలో నిజానిజాలతో పని లేకుండా ఒక తలనెరిసిన సోదరుడు గంగిరెద్దులా తలూపి కామ్రేడ్ డివిఎస్ డబ్బు తిన్నాడన్న ఆరోపణ చేశాడు. అలా చేసినందుకు ప్రతిఫలంగా ఆయనకు ఆయన పనిచేసే విభాగంలో పట్టం కట్టారు. ఇదిచూచి, ఆయనకన్నా ఎంతో కాలం ముందునుంచి ఆ విభాగంలో పనిచేస్తూ వారి రాజకీయాలనే అనుసరిస్తున్న మిత్రుడు విసుగుచెంది సంస్థను విడిచిపెట్టి వెళ్లిపోయాడు. కామ్రేడ్ డివిఎస్ అతని మిత్రులు వదలి వెళ్లిన తర్వాత ఆ సంస్థలో ఏమి జరుగుతున్నదీ తెలుసుకోవటానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

ఈ సంస్థల నిర్మాణం, నిర్వహణలో 10–12 సంవత్సరాలపాటు సంపాదించిన అనుభవంతో జనశక్తి వారపత్రికను స్థాపించడంలో కామ్రేడ్ డివిఎస్ ప్రధాన పాత్ర పోషించాడు. జనశక్తి ద్వైవారపత్రికగా మారినపుడు ఇతర పనులతోపాటు సంపాదకవర్గంలో కూడా చేరి పనిచేస్తూ పార్టీ విధానాన్ని ముఖ్యంగా ఆర్థిక సమస్యలకు అన్వయిస్తూ అనేక వ్యాసాలు రాశాడు. కామ్రేడ్ డివిఎస్ 20 సంవత్సరాల పాటు పార్టీలో పనిచేశాడు. కాని ఆ 20 సంవత్సరాల్లో అతను 40 సంవత్సరాలు చేయగలిగినంత పనిచేశారు. అతని పార్టీ చైతన్యానికి

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. త్యాగధనుడు కామ్రేడ్ డివిఎస్
నందూరి ప్రసాదరావు ..... 2

2. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న సంఘ పరివార్
సీతారాం ఏచూరి .......... 4

5. ఆర్థిక సామాజిక రంగాలలో వర్గ పోరాటం
ఎస్. వీరయ్య ............ 10

9. పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలపై ఒక విశ్లేషణ
బి. తులసీదాస్............ 12

4. పారిస్ నుండి నైరోబి వరకు... సామ్రాజ్యవాద ప్రయోజనాలకు పెద్దపీట
ఎస్. వెంకట్రావు ........ 14

3. భారతదేశ సమ్మిళిత సంస్కృతిని దెబ్బతీస్తున్న హిందూత్వవాదులు
ఇర్ఫాన్ హబీబ్........... 18

7. మహా నగరాల్లో ధనికులకు అవసరమౌతున్న మురికివాడల నివాసులు
సిద్దేశ్వర్ శుక్లా ........... 23

8. మానవాభివృద్ధిపై మరోమారు దృష్టి సారించిన 'నోబెల్'
కొండూరు వీరయ్య...... 27

6. ఒయన్‌జిసి గ్యాస్‌ను దోచేస్తున్న రిలయన్స్
పరంజయ్ గుహ థాకుర్తా . 30

10. కార్యకర్తలు నిరంతరం ఆందోళన ప్రచారం నిర్వహించాలి
బి.వి. రాఘవులు .......... 34



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
visit cpi(m) site at : cpim.org


# ఇస్లామోఫోబియా

అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ తరపున పోటీ చేస్తున్న డొనాల్డ్ ట్రంప్ తమ దేశంలోకి ముస్లింల వలసలను అడ్డుకోవాలని ఇచ్చిన పిలుపు పశ్చిమ దేశాల్లో ఇస్లామోఫోబియా ఏ దశకు చేరుకుందో తెలియజేస్తోంది. ఇస్లామోఫోబియా అంటే ఇస్లాం మతాన్ని ఉగ్రవాదంతో సమానంగా చూసే ఒకరకమైన మతతత్వ ధోరణి. మన దేశంలో బిజెపీ-ఆర్ఎస్ఎస్‌లు ఈ పనిచేస్తుంటే పశ్చిమ దేశాల్లో ఫాసిస్టు పార్టీలు, మితవాత పార్టీలు ఇటువంటి ప్రచారానికి పూనుకున్నాయి. ప్రపంచంలోని ఉగ్రవాద దాడుల్లో వాస్తవంగా ఇస్లామ్ మతంతో సంబంధమున్నవి చాలా తక్కువ. ఉదాహరణకు మన దేశంలో ఉగ్రవాద దాడులూ, మరణాలలో ఇస్లామ్ మతాన్ని ఆచరించేవారి ద్వారా జరిగేవి కేవలం 2 శాతం మాత్రమేనని ఇటీవల సామాజికవేత్తలు అంచనా కట్టారు. నక్సలైట్లు, ఈశాన్య రాష్ట్రాల్లోని ఉగ్రవాదులు, హిందూత్వ ఉగ్రవాదులు చేస్తున్న దాడులతో పోలిస్తే ఇవి చాలా తక్కువ. అయినా దేశంలో ఉగ్రవాదం అంటే ఇస్లామిక్ ఉగ్రవాదం అనే ప్రచారం జరిగిపోతోంది. దాంతో ప్రజల్లో ఇస్లామోఫోబియా వ్యాపిస్తోంది. టివి, సినిమా, వార్తాపత్రికా కథనాలు, సంఘపరివార్ ప్రచారం అటువంటి వాతావరణం సృష్టించడానికి ప్రధాన కారణం.

2001లో న్యూయార్క్ నగరంలోని ప్రపంచ వాణిజ్య కేంద్రం భవనాలను ఉగ్రవాదులు కూల్చివేసినప్పటినుండి సామ్రాజ్యవాద ప్రచార సాధనాలు ఒక పద్ధతి ప్రకారం ప్రజల్లో ఇస్లామోఫోబియా సృష్టిస్తూ వచ్చాయి. ఉగ్రవాదంపై పోరు పేరుతో అమెరికా ప్రపంచంలోని ఏ దేశం మీదనైనా దాడిచేయడానికి లైసెన్సు పొందేందుకు దీన్ని ఉపయోగించుకుంటోంది. ఇరాక్‌పై దాడి చేయడానికి సద్దాం హుస్సేన్‌ను భయంకరమైన తీవ్రవాదిలాగా ప్రచారం చేసింది. లిబియాను చేజిక్కించుకోడానికి దాని పాలకుడు కల్నల్ గడాఫీని ప్రజాకంటకుడిగా చిత్రించింది. సిరియాపై పట్టుకోసం దాని అధ్యక్షుడు అస్సాద్‌ను నిరంకుశుడిగా ప్రచారం చేస్తోంది. అంతకు ముందు బిన్ లాడెన్ ఎక్కడున్నా పట్టుకుంటామన్న పేరుతో ఆఫ్ఘనిస్థాన్‌మీద దాడిచేసింది. అమెరికా సామ్రాజ్యవాదుల నాయకత్వంలో సాగుతున్న ఈ దురాక్రమణ దాడులు, పాలస్తీనాపై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ... ఇవన్నీ ప్రపంచంలో ఇస్లామ్ ఉగ్రవాదానికి ప్రోత్సాహమిస్తున్నాయి. నిన్నటివరకు లౌకిక రాజ్యాలుగా ఉన్న ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, సిరియాలు ఉగ్రవాద క్షేత్రాలుగా మారిపోయాయి. సామ్రాజ్యవాదులు ఒకవైపు ఉగ్రవాదులకు ఆయుధాలు, డబ్బు సరఫరాతో సహా అన్ని విధాలా మద్దతిస్తూనే మరోవైపు ఆ ఉగ్రవాదాన్ని చూపించి పశ్చిమ దేశాల్లో మతతత్వాన్ని, ఫాసిస్టు పోకడలను రెచ్చగొడుతున్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో రెండు సార్లు జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడులు వంటివాటిని అవి తమ ప్రచారానికి ఉపయోగించుకుంటున్నాయి.

వాస్తవానికి సామ్రాజ్యవాదానికి ఉగ్రవాదం వ్యతిరేకం కాదు. శ్రామిక ప్రజలను చీల్చడానికీ, దేశాలపై దురాక్రమణ చేయడానికీ అది సామ్రాజ్యవాదానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయపడుతుంది. అలాగే ఉగ్రవాదానికి సామ్రాజ్యవాదం వ్యతిరేకం కాదు. దాన్ని సృష్టించి, నడిపించేది సామ్రాజ్యవాదమే. మరో మాటలో చెప్పాలంటే సామ్రాజ్యవాద దురాక్రమణదారీ విధానాల విషఫలమే ఉగ్రవాదం. రెండవ ప్రపంచ యుద్ధానంతరం సోవియట్ యూనియన్, కమ్యూనిస్టు బూచిని చూపించి తన దురాక్రమణదారీ దోపిడీ విధానాలను సమర్ధించుకున్న సామ్రాజ్యవాదానికి సోవియట్ పతనానంతరం మరో బూచి కావాల్సి వచ్చింది. అలా దానికి లభించిందే ఇస్లామిక్ ఉగ్రవాదం- ఇస్లామోఫోబియా. నాడు సోవియట్ బూచిలాగే నేడు ఇస్లామోఫోబియా సామ్రాజ్యవాదుల చేతుల్లో పనిముట్టుగా ఉపయోగపడుతోంది. కనుక అగ్రవాదానికీ, ఉగ్రవాదానికీ మధ్య ఉన్న సంబంధాన్ని వివరించడం ద్వారా ఈ ఫోబియాను ఓడించడం సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల ప్రధాన కర్తవ్యంగా మారింది.


### చందా వివరాలు

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

### చిరునామా

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న సంఘ పరివార్

**సీతారాం ఏచూరి**



రచయిత సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి

***నవంబర్ 26 తేదీని రాజ్యాంగ సంస్థాపక దినోత్సవంగా పరిగణిస్తూ, డా. బి.ఆర్ అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకొని ఆ మహనీయునికి అంజలి ఘటిస్తూ, పార్లమెంటు శీతాకాల సమావేశం రెండు రోజుల ప్రత్యేక సిట్టింగ్‌తో మొదలైంది. నవంబర్ 26,1949 న భారత రాజ్యాంగసభచే స్వంతం చేసుకోబడ్డ భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోనికి వచ్చింది. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రీ సీతారామ్ ఏచూరి అంబేద్కర్ ఊహించిన రాజ్యాంగ స్వప్నాన్ని, వర్తమానంలో దాని ప్రాధాన్యతను వివరిస్తూ రాజ్యసభలో నవంబర్ 27 న చేసిన ప్రసంగం సంక్షిప్త భాగాన్ని అందిస్తున్నాము.***

సార్, నాకిచ్చిన ఈ అవకాశానికి ధన్యవాదాలు.

అంబేద్కర్ 125వ జయంతి పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి అర్థమైనదని, తద్వారా దళితుల సంరక్షణలో మేము భావిస్తున్న నూతనమైన ముఖ్య చట్టాల అమలు వీలౌతుందని ఈ సమావేశం ప్రకటించక పూర్వమే మా పార్టీ డిమాండ్ చేసింది. ప్రస్తుత మున్న పరిస్థితుల్ని శరద్ యాదవ్ జీ విపులంగా వివరించారు. నేను వాటిని తిరిగి ప్రస్తావించటం లేదు. కాని దళితులపై జరుగుతున్న దాడులను తక్షణం అరికట్టాలి. ఈ ప్రభుత్వం అధికారం లోనికి వచ్చినప్పటికి నుండి (2014) దళితులపై దాడులు 19 శాతం పెరిగాయని ప్రభుత్వ గణాంకాలే తెలియజేస్తున్నాయి. 2015 లో ఫరీదాబాద్, అహమ్మద్‌నగర్‌లలో దళితులపై దాడులు ఎలా జరిగాయో చూశాం.

ఇక్కడున్న ప్రధానాంశం దళితుల సంరక్షణ చట్టాల్ని తక్షణం బలోపేతం చేయటం, నూతన చట్టాల్ని ప్రవేశ పెట్టటం కోసం మేము 10 ప్రతిపాదనలు చేశాం. ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకున్న మార్పుల నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో, విద్యారంగంలో రిజర్వేషన్లు కోరుతున్నాము. కనీసం ఈ అంశాలపై చర్చ జరిగి, చట్టాల్ని ఆమోదించాలి. షెడ్యూల్ట్ కులాలు, హెడ్యూల్డ్ తెగల సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని, వృత్తి, ఉన్నత విద్యా సంస్థలలో రిజర్వేషన్లను విస్తరించాలని, అంటరానితనం నిర్మూలనకు జాతీయ మిషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాము. పార్లమెంట్‌లోని పారిశుధ్య కార్మికుల స్థితిగతుల్ని శరద్‌జీ ఇప్పటికే వివరించారు. వీటన్నింటి పరిష్కారానికి తక్షణం కొత్త చట్టాలు చేయాల్సిన అవసరముందని మేము భావిస్తున్నాము. డా. అంబేద్కర్ కలలుగన్న సామాజిక న్యాయం వాటి మూలంగానే దళితులకు చేకూరుతుంది.

దానికి బదులు ప్రస్తుత ప్రభుత్వం రాజ్యంగంపై తమ విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తూ ముందుకు వచ్చింది. విశ్వాసాన్ని పునరుద్ఘటించాల్సిన ప్రశ్న ఎక్కడుంది? మీరూ, నేనూ అందరం రాజ్యాంగంపై ప్రమాణం చేస్తేనే ఇక్కడ ( పార్లమెంటులో) ఉన్నాం. విశ్వాసాన్ని పునరుద్ఘాటించే ఈ నాటకమేమిటి? రాజ్యాంగమే లేకపోతే మీరిక్కడ ఉండరు కదా? ఈ రోజున్న ప్రభుత్వంఈ అంశాన్ని తెలుసుకోవాలి. ఈ సభా నాయకులు ఇప్పుడిక్కడ లేరు. ఆయన కూడా తెలుసుకోవాలి. ఏమంటే, రాజ్యాంగంపై మన విశ్వాసాన్ని ఇదివరలోనే ధృవపరిచాం కాబట్టే మనం ఇక్కడ, ఇలా (పార్లమెంట్ సభ్యులుగా) ఉండగలిగాం. అటువంటప్పుడు “మేము పునరుద్ఘాటిస్తున్నాం” అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అసలీ “రాజ్యాంగదినం” ఏమిటి సార్?

చరిత్రను చదవండి. 1949, నవంబర్ 26వ తేదీన రాజ్యంగ సభ అధ్యక్షులు మన రాజ్యాంగంపై సంతకం చేశారు. అది ఓటింగ్ ద్వారా ఆమోదించబడింది. రాజ్యాంగ ముసాయిదా అంగీకరింపబడింది. “1950 జనవరి 26న మన దేశం “రిపబ్లిక్” అయినప్పటి నుండే ఈ ముసాయిదా రాజ్యంగమై, చట్టమౌతుందని” ముసాయిదాలో ఉన్నట్లు మీరే చెప్పారు. మా ప్రశ్నకు ఈ ప్రభుత్వం సమాధానం చెపుతుందా? ఈ సభా నాయకులు, గౌరవనీయులైన లాయర్ (అరుణ్ జెట్లీ) గారు మాకు సమాధానం చెప్పాలని కోరుతున్నాను. నవంబర్ 26, 1949 నుండి జనవరి 1950 వరకు భారతదేశం ఏ రాజ్యాంగం ప్రకారం పరిపాలించబడింది? రాజ్యాంగ ముసాయిదా ఆమోదించిన తరువాత రెండు నెలల కాలం లండన్ హౌస్‌ఆఫ్ కామన్స్‌లో బ్రిటీష్ ప్రధాని క్లెమెంట్ అట్లీచే ప్రతిపాదింపబడ్డ భారత స్వాతంత్ర్య చట్టం 1947 ప్రకారం భారతదేశం పరిపాలింపబడింది. అప్పుడు మన రాజ్యాంగ పరిస్థితి ఏమిటి? ఆ రెండు నెలల కాలం మనం బ్రిటీష్ రాజ్యాంగం కింద ఉన్నాం. మనం ఈ రాజ్యాంగాన్ని1950, జనవరి 26 న ఆమోదించి, చట్టరూపం కల్పించుకున్నాము. 65 సంవత్సరాల తరువాత ఇప్పుడు మీరు రాజ్యాంగ సంస్థాపక దినం అని కొత్త అంశం లేవనెత్తుతున్నారు. నాకు వివరించి చెప్పండి సార్. మీరు ఈ కుర్చీలో కూర్చున్నారు. మీరు గొప్ప విజ్ఞానవంతులు కావచ్చు. నాకు వివరించి చెప్పండి. మనం ఈ రాజ్యాంగాన్ని జనవరి 26న చట్టంగా ఆమోదించుకొని, రిపబ్లిక్‌గా రూపొందామని అంబేద్కరే చెప్పారు. మరి ఈ నవంబర్ 26 సంగతేమిటి? రాజ్యంగ సభ ముసాయిదాను అంగీకరించిన రోజు అది. ఆ రోజుకు అది ఇంకా భారత రాజ్యాంగం కాలేదు. అది మన చట్టంకాదు. జనవరి 26, 1950న అది మన చట్టం అయ్యింది. రాజ్యాంగ సంస్థాపక దినం నాడు లాయర్లు ఈ రకంగా మాట్లాడుతున్నారు. ఏదో ఒక ఈవెంట్ జరుపుకోవడానికి మీకొక రోజు కావాలి. రాజ్యాంగ సభ మళ్ళీ 1950,

జనవరి 24, 25న సమావేశమైంది. జనగణ మన మన జాతీయ గీతంగా జనవరి 24న ఆమోదింపబడింది. జనవరి 25న రాజ్యాంగ సభ సభ్యులందరు రాజ్యాంగంపై సంతకం చేశారు. రాజ్యాంగంలోని 395 క్లాజులలోని 15 క్లాజులు మాత్రమే1949 నవంబరు 26 నుండి అమలులోకి వచ్చాయి. జనవరి 26, 1950న భారత రాజ్యాంగం మొత్తం అమలు లోనికి వచ్చింది.

మన ముందున్న ఈ కొత్త ఐటం ఏమిటి సార్!......... (అడ్డుతగులుతున్నారు)........ మీరు దీన్ని ఐటంసాంగ్‌గానో మరేదైనా పేరుతో పిలువ వచ్చు. భారత రాజ్యాంగంలో ఇది కొత్త అంశమే. పాలక పార్టీ సీనియర్ సభ్యులు ప్రధానమంత్రిని ధార్మిక పురుషుడనో లేదా అధార్మిక పురుషుడనో వర్ణిస్తున్నారు. ఏమనాలో ఆ పార్టీ వారే నిర్ణయించుకోవాలి. కాని ఆయన (ప్రధాన మంత్రి) గొప్ప ఈవెంట్ నిర్వాహకుడు. ఒక ఈవెంట్ తర్వాత మరొకటి. ముందు లండన్, తర్వాత మలేసియా, ఆ తర్వాత ఆసియా, తర్వాత రాజ్యాంగ దినం, రేపు అది పారిస్ అవుతుంది. నేను యువకుడిగా ఉన్నప్పుడు "పారిస్ కె ఏక్ రంగీన్ షాం ( పారిస్ లో ఒక రమ్యమైన సాయంకాలం)" అనే పాత సినిమాని చూపేవారు. రేపటి నుండి నిర్వహింపబడే ఈవెంట్ నుండి ఈవెంట్ కు...... ఏమిటిది? మనం ఏం చూస్తున్నాం! జరుగుతున్న ఇటువంటి అసంబద్ధమైన సంఘటనలతో పార్లమెంట్ హుందాతనం దెబ్బతినటం విచారకరంగా ఉంది. నవంబర్ 26కి కారకులైన డా. అంబేద్కర్, ఆ ప్రక్రియలో పాల్గొన్న అందరిపై మనకు అత్యంత గౌరవం ఉంది. రాజ్యాంగ సభ తన పనిని జవహర్ లాల్ నెహ్రూ ప్రతిపాదించిన 'లక్ష్యాల తీర్మానం' తో మొదలు పెట్టిందన్న విషయం ఈ ప్రభుత్వానికి తెలుసా? రాజ్యాంగ సభ నిర్వహించిన 11 సమావేశాలలో 6 సమావేశాలు లక్ష్యాల తీర్మానం కోసం కేటాయింపబడ్డాయి కాని ఈ ముసాయిదాకు కాదన్న అంశం ప్రభుత్వానికి తెలుసా?? రాజ్యాంగ సభలో జరిగిన చర్చలలో అధిక భాగం జవహర్ లాల్ నెహ్రూ ప్రతిపాదించిన లక్ష్యాల పైనే జరిగింది. ఇది జరిగిన చరిత్ర. విజేతలెప్పుడూ చరిత్రను లిఖిస్తారు. కాని ఇక్కడ విజేతలు గత చరిత్రను వక్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ చరిత్రను మనం వారసత్వంగా పొందాం. గౌరవనీయులైన ఈ సభా నాయకుల వలె నేనూ స్వాతంత్ర్యం తర్వాత పుట్టాను. మనందరికీ ఇది వారసత్వంగా సంక్రమించిన చరిత్ర. ఇదీ మనకు వంశ పారంపర్యంగా వచ్చిన ఆస్తి లాంటిది. మీరు పాత చరిత్రను మార్చి మాకు కొత్త చరిత్ర చెప్పలేరు. అయితే ఎందుకు ఈ రాజ్యాంగ దినోత్సవం జరపటం? వాళ్లకు జాతీయోద్యమంలో లేని పాత్రను ఈ విధంగా చొప్పించాలనుకుంటున్నారు. వాళ్ళంతట వాళ్ళే ఎలా చొప్పించుకుంటారో తెలుసుకోదలచాను.

> **"నవంబర్ 19వ తేదీన గెజెట్ నోటిఫికేషన్ జారీ అయితే, నవం బర్ 26వ తేదీన రాజ్యాంగ దినం పాటించ మని మానవ వనరుల మంత్రిత్వ శాఖ నవం బర్ 10న అన్ని పాఠశాలలకు సర్క్యులర్ ఎలా జారీ చేయకలుగుతుంది? ఏం జరుగుతున్నది? భారత రాజకీయాలలో సంచలనాలా? నేను చెప్పగలిగింది ఈవెంట్లు మాత్రమే."**

ఈ ఉత్తర్వుల్ని ఎలా ఇచ్చారు? ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా జరపాలని నిర్ణయించినట్లు తెలియ చేస్తున్న ప్రభుత్వ గెజెట్ నోటిఫికేషన్ ఇది. మీరు కోరితే దాన్ని మీ బల్లపై ఉంచగలను. అది నవంబర్ 19న జారీ చేసిన ఇండియన్ గెజెట్ లో ప్రచురించిన నోటిఫికేషన్. దాన్ని సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ జారీ చేసింది. సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం నిర్వహించాల్సిన జాతీయ దినాన్ని నిర్ణయించగలదా??

గౌరవనీయ మంత్రిగారు వస్తున్నట్లు నేను గమనించాను. గౌరవనీయ మానవ వనరుల మంత్రి గారు, మంత్రి కాకపూర్వం, నాకు మంచి మిత్రురాలు. మంత్రి అయిన తర్వాత ఆమె తీరిక లేకుండా ఉన్నారు. ఆమెకు అనేక గురుతర బాధ్యతలు ఉన్నాయి. నవంబర్ 19వ తేదీన గెజెట్ నోటిఫికేషన్ జారీ అయితే, నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ దినం పాటించమని మానవ వనరుల మంత్రిత్వ శాఖ నవంబర్ 10న అన్ని పాఠశాలలకు సర్క్యులర్ ఎలా జారీ చేయకలుగుతుంది? ఏం జరుగుతున్నది? భారత రాజకీయాలలో సంచలనాలా? నేను చెప్పగలిగింది ఈవెంట్లు మాత్రమే. మీకు ఈవెంట్ నిర్వహణ విభాగం ఉంది. మీకు ఏ పాత్రాలేని జాతీయోద్యమంలో మీరు చొరబడాలని చూస్తున్నారు. గతంలో ప్రస్తావింపబడి, భవిష్యత్‌లో జరిగే చర్చలలో ప్రస్తావించబోయే ఒక వాస్తవాన్ని రికార్డ్స్‌లో ఉంచదలచుకున్నాను. అది జాతీయోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర గురించి.

వివరణలనిచ్చే నెపంతో శ్రీ నక్వి, (పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి) తన స్వంత భాష్యాలు ఇవ్వకూడదు. రాజ్యాంగ దినాన్ని పాటించే విషయంలో, మేము ఎప్పుడూ డా. బి.ఆర్ అంబేద్కర్ పట్ల అంచచలమైన గౌరవ మర్యాదలు కలిగి ఉన్నాము. మీరు ఈ కొత్త ఈవెంట్ కోసం ఎందుకు వేటాడాల్సి వచ్చిందో మీకు తెలియ చెయ్యాలి. మీకు అభ్యంతరాలేమి లేవు, కాని మీరు ప్రస్తావించిన విషయాల సందర్భం చెప్తున్నాను. స్వాతంత్ర్యోద్యమంలో మీ పాత్ర ఏమీ లేదని మేం చెప్పదలిచాము. ఈ రకంగా మీ అంతట మీరే అందులో చొరబడాలని ప్రయత్నిస్తున్నారు.

మీరు శ్యాం ప్రసాద్ ముఖర్జీని ప్రస్తావించారు. అనేక ప్రశ్నలు లేవనెత్తారు. వాటికి సమాధానం చెప్తాను. ఇక్కడ మీరు కమ్యూనిస్టుల గతం గూర్చి అడిగారు. మీ పాత్ర గూర్చి, కమ్యూనిస్టుల పాత్ర గూర్చి రెండు ఉటంకింపులను చదువుతాను...... (అడ్డుచెప్తున్నారు)...... 1942 క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా బ్రిటీష్ బాంబే హోమ్ డిపార్ట్‌మెంట్ పరిశీలన ఇలా ఉంది, "సంఘ్ ఎల్లప్పుడూ చట్టానికి లోబడే ఉంది. ప్రత్యేకించి 1942 ఆగస్ట్‌లో పెల్లుబికిన అలజడులలో పాల్గొనకుండా దూరంగా ఉంది (అరుపులు)..... బ్రిటీష్ ప్రభుత్వం దగ్గర ఉన్న రికార్డ్ ఇది".

ఇప్పుడే తరుణ్ (తరుణ్ విజయ్) కమ్యూనిస్టులపై ఒక ఆరోపణ చేశారు. క్విట్ ఇండియా ఉద్యమం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని 1992 లో పార్లమెంట్ సెంట్రల్ హాల్ నందు ఒక ప్రత్యేక సమావేశం నిర్వహింప బడింది. ఆ సమావేశంలో అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్‌శర్మ భారత కమ్యూనిస్టుల గూర్చి చెప్పిన అంశాలు ఇప్పటికే పార్లమెంట్ రికార్డులలో ఉన్నాయి. వాటిని నేను ఉటంకిస్తున్నాను. కాన్పూర్, జంషెడ్పూర్, అహ్మదాబాద్‌లలో తీవ్రస్థాయి సమ్మెల అనంతరం డిల్లీ ప్రభుత్వం 1942 సెప్టెంబర్ 5వ తేదీన లండన్ లోని సెక్రటరీ ఆఫ్ స్టేట్ కు వ్రాసిన నివేదికలో

**“ గాంధీజీ హత్యా నంతరం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై విధించిన నిషేధాన్ని తొలగించాలనే అభ్యర్ధనపై సర్దార్ పటేల్ పెట్టిన షరతుల నేపథ్యంలో ఇది జరిగింది. ‘ఆర్. ఎస్.ఎస్ రాజకీయాల్లో పాల్గొనకూడదు’ అన్నది ఒక షరతు. అప్పుడు మీకొక రాజకీయ శాఖ అవసరమైంది. ఆశాఖే జనసంఘ్. ”**



పార్లమెంటులో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి

భారత కమ్యూనిస్టు పార్టీ గూర్చి ఇలా పేర్కొన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ అత్యధిక సభ్యుల ప్రవర్తన, ఎల్లప్పుడూ స్పష్టంగా బ్రిటిష్ వ్యతిరేక విప్లవశీలతతో నిండి ఉంది” ఇండియన్ పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో భారత రాష్ట్రపతి చెప్పిన అంశం ఇది.

ఇప్పటికైనా నిరాధారమైన ఆరోపణలను కట్టిపెట్టండి.

‘చొరబడ్డారు’ అన్న నా మాటకు మీకు అనేక అభ్యంతరాలు ఉన్నాయి. శ్యాం ప్రసాద్ ముఖర్జీ గార్ని నేను ప్రస్తావించాను. ఆయన మంచి మనిషి. నెహ్రూ గారి మంత్రివర్గంలో ఉండేవారు. కాని ఆయన ఆ పదవిని వదిలేసారు. ఆయన కొత్త రాజకీయ పార్టీ పెట్టాలని చూస్తున్నారు. ఇదంతా మీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రికార్డులలో ఉందో లేదో చెప్పండి. మీ సర్ సంఘ్ చాలక్ గోల్వాల్కర్ నూతన రాజకీయ పార్టీని ఏర్పాటు చేయమని నలుగురు స్వయం సేవకులను ముఖర్జీ దగ్గరకు పంపారు. వాళ్ళెవరు? ఈ సమాచారం మీ రికార్డులలో ఉన్నదే నాస్వంతం కాదు. ఆ నలుగురు దీనదయాళ్ ఉపాధ్యాయజీ, అటల్ బిహార్ వాజ్‌పాయ్‌జీ, ఎల్.కె అద్వానిజీ, ఎస్.ఎస్. భండారిజీ. ఈ నలుగురిని నూతన పార్టీ ఏర్పాటుకు పంపించారు. గాంధీజీ హత్యానంతరం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై విధించిన నిషేధాన్ని తొలగించాలనే అభ్యర్ధనపై సర్దార్ పటేల్ పెట్టిన షరతుల నేపథ్యంలో ఇది జరిగింది. ‘ఆర్. ఎస్.ఎస్ రాజకీయాల్లో పాల్గొనకూడదు’ అన్నది ఒక షరతు. అప్పుడు మీకొక రాజకీయ శాఖ అవసరమైంది. ఆశాఖే జనసంఘ్. దాని అవతారమే ప్రస్తుతమున్న భారతీయ జనతా పార్టీ.

మన సభా నాయకులు ఇక్కడ చాలా చెప్పారు. కొన్ని భాగాల్ని చదివారు. ఆయన రాజ్యాంగంలోని ఆర్టికల్ 44ను చదివారు. ఆ ఆర్టికల్ ఇలా చెప్తుంది. “దేశ పౌరులకు ఉమ్మడి పౌర స్మృతి అందించడానికి ప్రభుత్వం కృషి చేయాలి”. దీనితో పాటు వ్యవసాయం, పశు సంవర్ధక సంఘం అంశం పై కూడా ఆ ఆర్టికల్ ఉటంకించింది. అవి ప్రభుత్వ విధానం యొక్క ఆదేశిక సూత్రాలేకాని, పరిష్కార సాధ్యాలు, అమలు సాధ్యాలు కావని, ఇక్కడ ఉటంకించని అనేక ఇతర అశాలు కూడా ఆదేశిక సూత్రాలలో ఉన్నాయని నేను అన్నాను. ఆదేశిక సూత్రాలలో ఉన్న ఒక అంశం – బలహీన వర్గాల ప్రజల విద్య, ఆర్థిక ప్రయోజనాల ఉన్నతికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసికోవాలి. బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పింది కూడా అదే. దాన్నే ఆర్టికల్ 46 అంటారు. ప్రజల జీవన ప్రమాణాలు, పౌష్టికాహార ప్రమాణాలు పెంచటంలో ప్రభుత్వం శ్రద్ధ వహించాలని ఆర్టికల్ 47 చెప్తుంది. ఈ నేపథ్యంలో మన దేశంలో అత్యధిక శిశువులు పౌష్టికాహార లోపంతో ఉంటే మనకు సిగ్గుగా లేదా? ప్రపంచంలోనే అత్యధిక గిడసబారిన (స్టంటెడ్) శిశువులు మన దేశంలోనే ఉంటుంటే మనం సిగ్గు పడమా? ఇది రాజ్యాంగ ఆదేశిక సూత్రం – ఆర్టికల్ 47. వాటిలో ( ఆదేశిక సూత్రాలలో) మీరు కొన్నింటినే ఎంచుకుంటుంటే మీ వాస్తవ ఉద్దేశ్యాలను అనుమానించాల్సి వస్తుంది. సార్, మీ చేతిలోని రాజ్యాంగం కాపీని చూడండి. తప్పని సరిగా అమలు చేయాల్సిన ప్రాథమిక విధులలో ఆర్టికల్ 51ఎ ఇలా చెప్తుంది” ఉమ్మడి సంస్కృతి అనే మన సంపన్న వారసత్వాన్ని ప్రతి పౌరుడు గౌరవించాలి, పరిరక్షించాలి.” మనం పరిరక్షిస్తుంది ఆ ఉమ్మడి సంస్కృతినేనా సార్ ? “శాస్త్రీయ దృక్పథాన్ని, మానవత్వాన్ని, పరిశోధన, సంస్కరణ స్ఫూర్తిని పెంచాలని ఆర్టికల్ 51ఎ (హెచ్) చెప్తుంది. వినాయకుడిని ప్లాస్టిక్ సర్జరీ సృష్టి గాను, కర్ణుడిని స్టంట్ మరియు టెస్ట్‌ట్యూబ్ బేబి టెక్నాలజీ సృష్టి గాను వర్ణించటం వింటున్నాము. దీన్ని శాస్త్రీయ దృక్పథం అంటారా? ఈ మాటల్ని స్వయానా గౌరవనీయులైన ప్రధాన మంత్రి గారే చెప్తున్నారు. ఏమి జరుగుతున్నది? ఏమి అమలు చేస్తున్నారు? మీరు వేటిని అమలు చేస్తారు, వేటిని అమలు చేయరు? మీరు కేవలం ఛాందస హిందూత్వ అజెండాను మాత్రమే పునరుద్ధరిస్తున్నారు. గో సంరక్షణను అమలు చేస్తున్నారు. అప్పుడు పౌరసమాజంలో పౌరులందరి స్వేచ్ఛలో సమానత్వం ఏమవుతుంది? ఆయన (సభా నాయకులు) ఆర్టికల్ 3ని ఉటంకించారు. వీటినన్నింటిని ఆర్టికల్ 29, 39 వ్యతిరేకిస్తాయని అన్నారు. ఆర్టికల్ 15 ఇలా చెప్తుంది.” మతం, జాతి, కులం, లింగం, జన్మస్థలం కారణంగా, లేదా వీటన్నింటిలో ఏ ఒక్క కారణంగా నైనా ప్రభుత్వం ఏ పౌరుడి పట్ల వివక్ష చూపకూడదు.” ఆర్టికల్ 15 ప్రాథమిక హక్కులకు సంబంధించినది. ఆర్టికల్ 29, 30 ఒక దానికొకటి పరస్పర విరుద్ధంగా ఉన్నాయని ఆయన చెప్తున్నారు. ప్రతి హక్కూ సహేతుకమైన ఆంక్షలతోనే ఉంటుందని ఏ లాయరుకైనా తెలుసు. సహేతుకమైన ఆంక్షలు లేకుండా ఏ హక్కూ ఉండజాలదు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 29, 30లలో

ఆర్టికల్ 15 ద్వారా చేకూరే సహేతుకమైన ఆంక్షలను వివరించిన చోటే మైనారిటీలకు వాళ్ళ మతపరమైన హక్కులు ఇవ్వబడ్డాయి. ఇక్కడ మైనారిటీలంటే కేవలం మతపరమైన మైనారిటీలే కాదు. బాషా పరమైన మైనారిటీలు కూడా. దీన్నే వాళ్ళు వైరుధ్యం అంటున్నారు. దీన్ని తీసివేయాలని కోరుకోము. ఈ రాజ్యాంగాన్ని, ఈ వైరుధ్యాన్ని గూర్చి అంబేద్కర్ ఇప్పుడుంటే ఏం చెప్పేవారు? "సహనాన్ని పెంచటమే ప్రతి పౌరుడి విధి, అసహనాన్ని పెంచే ఏ వ్యక్తి ప్రత్యేక అభిప్రాయమైనా విధి కాదు" అని సంక్షిప్తంగా చెప్పేవారు.

> **"ఆయన దేశ భక్తుడు. కాని ఆయన హిందూ మతాన్ని వదిలి బౌద్ధాన్ని స్వీకరించాడు, మీకు గుర్తుండి ఉంటుంది. అది ఎందుకు జరిగిందో కూడా మీకు తెలిసే ఉంటుంది. అక్కడే అసహనం అనే సమస్య ఉత్పన్నమైంది. ఇవన్నీ చరిత్రకు సంబంధించిన విషయాలు."**

ఈ నాటి పరిస్థితులకు అనువర్తించాల్సిన ప్రాతిపదిక అదే. లౌకికవాదం అనే పదం రాజ్యాంగంలోకి ఎక్కించబడిందని, అనేక సమస్యలకు అదే కారణమని మన గౌరవనీయ దేశ వ్యవహారాల మంత్రి చెప్పినట్లు పత్రికలలో చదివాను. మన నటుడు అమీర్‌ఖాన్‌పై కూడా ఆయన నిందారోపణలు ఎక్కు పెట్టినట్లుంది. "అంబేద్కర్ భారత దేశాన్ని వదిలి పెట్టి వెళ్లలేదని, ఆయన ఇక్కడే ఉండి పోరాడాడని" ఆయన (దేశ వ్యవహారాల మంత్రి) అన్నారు. అమీర్‌ఖాన్ అన్నది కూడా అదే. తాను వెళ్లి పోతానని అమీర్‌ఖాన్ చెప్పలేదు. ఆయన ఇక్కడే ఉండి పోరాడుతున్నందుకు ఆనందంగా ఉంది. వీటన్నింటిని వామపక్షాలే ముందుకు తోస్తున్నాయని మీరు వాళ్ళను నిందిస్తున్నారు. వాళ్ళందరిని మాతో కలిపినందుకు ధన్యవాదాలు. మా తెగ పెరుగుతున్నది. అదే మీరు చేస్తున్నది..... (ఆక్షేపణలు).... కాని గుర్తుంచుకోండి. అంబేద్కర్ దేశాన్ని విడిచి వెళ్ళలేదు. ఆయన దేశ భక్తుడు. కాని ఆయన హిందూ మతాన్ని వదిలి బౌద్ధాన్ని స్వీకరించాడు, మీకు గుర్తుండి ఉంటుంది. అది ఎందుకు జరిగిందో కూడా మీకు తెలిసే ఉంటుంది. అక్కడే అసహనం అనే సమస్య ఉత్పన్నమైంది. ఇవన్నీ చరిత్రకు సంబంధించిన విషయాలు. వాటిని మీరు చెరప లేరు. మీకు అసహమనే సమస్య కావలసివస్తే మన సభా నాయకులు ఉటంకించిన, డా. అంబేద్కర్ నవంబర్ 25 తేదీన చేసిన ప్రసంగాన్ని మళ్ళీ వినండి. ఆయన అన్నారు. "చరిత్ర మళ్ళీ పునరావృత మౌతుంది. మళ్ళీ మన స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకుంటాము"...... గౌరవనీయులైన మన సభానాయకులు అంతవరకే ఉటంకించారు. మిగతాది ఆయన ( సభానాయకులు) చెప్పలేదు. ఆయన (డా. అంబేద్కర్) ఏమి చెప్పారు? నేనే డా. అంబేద్కర్ ప్రసంగం నుండి ఉటంకిస్తున్నాను. "చరిత్ర మళ్ళీ పునరావృతమౌతుందా?" అంటే మనం స్వాతంత్ర్యాన్ని మరొకసారి పోగొట్టుకుంటామా? "భారతీయులు మత విశ్వాసానికతీతంగా దేశాన్ని ఉంచుతారో, లేదా దేశానికతీతంగా మత విశ్వాసాన్ని ఉంచుతారో నాకు తెలియదు."


సభా నాయకులు చెప్పినట్లు డా. అంబేద్కర్ ఈ రోజు ఇక్కడ ఉండి ఉంటే ఏం చెప్పి ఉండేవారు? "భారతీయులు దేశంకన్నా మత విశ్వాసాన్ని ఉన్నతంగా ఉంచటానికి వత్తిడి చేయబడ్డారు" అని ఆయనే చెప్పేవారు. భారత దేశంలో అదే అసహనం ఈ రోజు రాజ్యమేలుతున్నది. అంబేద్కర్ పైప్రసంగాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నారు. " కాని ఇది మటుకు ఖాయం. పార్టీలు మత విశ్వాసాన్ని మన దేశానికతీతంగా ఉంచితే మన స్వాతంత్ర్యం రెండవసారి ప్రమాదంలో పడుతుంది. దాన్ని శాశ్వతంగా పోగొట్టుకుంటామేమో. ఈ ప్రమాదాన్ని మనం కృతనిశ్చయంతో ఎదుర్కోవాలి. మన స్వాతంత్రాన్ని కాపాడుకోవటానికి చివరి రక్తపు బొట్టు వరకు ధారపోయటానికి దృఢచిత్తులమై ఉండాలి."

నేను ఈ రోజు అసహనానికి వ్యతిరేకంగా గళమెత్తినప్పుడు డా. అంబేద్కర్ ఏమి చేయాలని కోరారో అదే చేస్తున్నాను. డా.అంబేద్కర్ చెప్పింది తప్పని సరిగా చేయాలని ఎవరైనా కోరితే, ఈ రకమైన అసహనానికి వ్యతిరేకంగా నిలబడటానికి డా. అంబేద్కర్ కోరింది ఖచ్చితంగా చేస్తాం.

తర్వాత సామాజిక న్యాయం సమస్య ఉంది. డా. అంబేద్కర్ ప్రసంగంలో అతి ముఖ్యమైన అంశం విస్మరించ బడింది. ఈ అంశాన్ని సభలో అనేక సార్లు ప్రస్తావించాను. కాని మళ్ళీ ప్రస్తావించకుండా ఉండలేక పోతున్నాను. ఇప్పుడు ఆ అంశాన్ని పూర్తిగా చెప్పదలచాను. ఆయన ప్రసంగం ఇలా సాగింది. "26 జనవరి, 1950 తేదీన మనం వైరుధ్యాలతో కూడిన జీవితంలోకి అడుగు పెడుతున్నాము. రాజకీయాలలో మనం సమానత్వాన్ని అంగీకరిస్తాం. కానీ మన ఆర్థిక, సామాజిక జీవితాలలో అసమానత్వం కొనసాగుతూనే ఉంటుంది. రాజకీయాలలో 'ఒక మనిషి, ఒక ఓటు, ఒక విలువ అనే సూత్రాల్ని గుర్తిస్తాం. కాని మన సామాజిక, ఆర్థిక జీవనంలో అసమానత్వం కొనసాగుతుంటుంది. మన సామాజిక, ఆర్థిక వ్యవస్థల దృష్ట్యా 'ఒక ఓటు, ఒక విలువ' అనే సూత్రాన్ని తిరస్కరిస్తుంటాం. ఈ తిరస్కరణ భావాన్ని దీర్ఘకాలం కొనసాగనిస్తే, మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిన వాళ్ళమౌతాం. ఈ వైరుధ్యాన్ని అతి త్వరగా తొలగించవలసి ఉంది. లేకపోతే ఈ అసమానత్వంతో బాధపడుతూ జీవితాల్ని భరించలేని వాళ్ళు, ఎన్నో ప్రయాసల కోర్చి నిర్మించిన ఈ రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థను బద్దలు కొట్టడానికి వెనుకాడరు". ఇది డా. అంబేద్కర్ ఆనాడు చేసిన ప్రసంగం. మరి ఈనాటి పరిస్థితి చూస్తే మనదేశ స్థూల దేశీయోత్పత్తి మొత్తంలో సగం విలువ కలిగిన సంపదతో వందమంది శతకోటీశ్వరులు తులతూగుతున్నారు. తాజా జనాభా లెక్కలను చూస్తే మన దేశంలోని 90 శాతం కుటుంబాలు నెలకు కేవలం రూ. 10,000 లోపు ఆదాయం కలిగి వున్నాయి. ఈ వైరుధ్యాన్ని మీరు తొలగించ దలచారా లేదా మరింత పెంచదలిచారా ? ఈ వైరుధ్యం లోని అంతరాల్ని పూడ్చడం కోసం మనం చర్చిస్తున్నామా ? లేదు. దానికి బదులు ప్రతి విదేశీ పర్యటనలో విదేశీ పెట్టుబడికి రాయితీలు ఇచ్చుకుంటూపోతున్నారు. 15 నూతన రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్ని అనుమతించారు. మన దేశీయ వాణిజ్య పంటల రంగాలలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్ని అనుమతిస్తున్నారు.

వ్యవసాయ విపత్తు పెరుగుతున్నది. రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ స్వంత గణాంకాల ప్రకారం మీ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ ఈ నెలలో 6 శాతం నుండి 3 శాతానికి పడిపోయింది. తయారీ రంగం 6 శాతం నుండి 2.4 శాతానికి పతనమైంది. పారిశ్రామిక ఉత్పత్తి తగ్గుముఖం పడుతున్నది. వ్యవసాయిక దుస్థితి తీవ్రమౌతున్నది. ప్రజలు

**"మనకు స్వాతంత్ర్యాన్నిచ్చి, రాజ్యాం గాన్ని ఇచ్చిన డా. అంబేద్కర్, ఆ తరం నాయకు లైన గాంధీ, నెహ్రూ, అబ్దుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్‌లకు న్యాయం చేస్తున్నామా?వాళ్ళు మనల్ని ఏమి చేయమని ప్రభోధించారు... అవి మనం చేస్తున్నామా??"**



రాజ్యాంగసభ సమావేశంలో ప్రసంగిస్తున్న బి.ఆర్. అంబేద్కర్

శివుడికి చేసే ప్రార్థనలలో హర్ హర్ మహాదేవ్ కు బదులు అర్ హర్ మహాదేవ్ అని స్తుతిస్తున్నారు. దీని ద్వారా కనీసం ఆర్ దాల్ (కంది పప్పు) పొందగలమని ఆశపడుతున్నారు. కంది పప్పు కిలో రూ.200ల ధర ఉండి, కోడి మాంసం కంటే ఖరీదయింది. ఇక నుండి ఘర్‌కీ ముర్గీ దాల్ బరాబర్ కాదు, ఘర్ కీ దాల్ ముర్గీ బరా బర్ (ఇంటి కోడి పప్పుకి సరి కాదు. పప్పే ఇంటి కోడికి సరి) అవుతున్నది. ఇక రాజ్యంగ దినోత్సవ అర్థం ఏమిటి?

డా. అంబేద్కర్ కలలుగన్న సామాజిక న్యాయంలో మన స్థానం ఎక్కడ? షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజానీకం పై జరుగుతున్న అత్యాచారాలు, రిజర్వేషన్ల స్థితిగతులపై వివరించి ఉన్నాను. పెరుగుతున్న అసమానతల కారణంగా ప్రజల బ్రతుకులు దిగజారిపోతున్నాయి. ఈ వైరుధ్యం ఏమిటి? వాస్తవాన్ని చూడండి. డా. అంబేద్కర్ కు మనం నిజమైన నివాళిని అర్పిస్తున్నామా? ఆధునిక భారతదేశం "సామాజిక న్యాయ" స్వప్నాన్ని పండించే తీరు ఇదేనా? రాజకీయ పార్టీలుగా మర్చిపోండి. నేను ఏ పార్టీ, మీరు ఏ పార్టీ అనే విషయం మర్చి పోండి. భారతీయులుగా ఈ అంశాల్ని మాట్లాడు తున్నప్పుడు మనకు మనం నిజాయితీగా ఉన్నామా? మనకు స్వాతంత్ర్యాన్నిచ్చి, రాజ్యాం గాన్ని ఇచ్చిన డా. అంబేద్కర్, ఆ తరం నాయకు లైన గాంధీ, నెహ్రూ, అబ్దుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్‌లకు న్యాయం చేస్తున్నామా?వాళ్ళు మనల్ని ఏమి చేయమని ప్రబోధించారు... అవి మనం చేస్తున్నామా??

సమాఖ్య విధానం (ఫెడలిజం) విషయాని కొద్దాం. సమాఖ్య విధానంపై, సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల సంబంధాలపై డా. అంబేద్కర్ ఏమన్నారు? "ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన" మన్నారు. ఆయన ప్రసంగం నుంచే చదువుతున్నాను. "ఆ రకమైన రాజ్యాంగాన్నికేంద్రీకృతమైనదిగా పరిగణించటం సాధ్యం కాదు. అంటే సమాఖ్య విధాన ప్రాధమిక సూత్రం ప్రకారం చట్టసభల (లెజిస్లేటివ్), కార్యనిర్వాహక వర్గ (ఎగ్జిక్యూటివ్) అధికారాలు కేంద్ర, రాష్ట్రాల మధ్య, కేంద్ర చేసే చట్టం ద్వారా కాకుండా, రాజ్యాంగ పరంగానే విభజింపబడి ఉంటాయి'' ఈ సమాఖ్య విధాన సూత్రాన్ని అనుసరిస్తున్నారా? మీరు ఆర్టికల్ 356 దుర్వినియోగం గూర్చి మాట్లాడుతున్నారు. అది ఒక భాగం మాత్రమే. మేము కేరళలో వామపక్ష ప్రభుత్వంగా 1950లలో ఆర్టికల్ 356 బాధితులం. ఆ సమయానికి మీరెంత మంది ఉన్నారో నాకు తెలియదు. రెండవసారి 1960లో కూడా బాధితులమే. బెంగాల్‌లో రెండుసార్లు 1967,1969లలో బాధితులంగా ఉన్నాము.....(అభ్యంతరాలు).....

సమాఖ్య విధానమంటే కేవలం సమానత్వమే కాదు. రాష్ట్రాలకు ఇవ్వవలసిన స్వతంత్ర గౌరవం కూడా ఉన్నది. ఈ రోజున మనం అలా ఇస్తున్నామా? మీరు న్యాయ వ్యవస్థ గూర్చి మాట్లాడారు. డా.అంబేద్కర్ న్యాయ వ్యవస్థ గూర్చి చెప్పిన అంశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఆయన చేసిన పై ప్రసంగం నుంచే ఉటంకిస్తున్నాను, "కోర్టులు సవరించ గలవు కాని పున:స్థాపించలేవు, కొత్త వాదనలు, కొత్త దృక్కోణాలు తమ ముందు సమర్పించ బడినప్పుడు అవి (కోర్టులు) అంతకు ముదు చేసిన వ్యాఖ్యానాలను తాజా పరచగలవు, పరిమితమైన సందర్భాలలో విభజన రేఖల్ని మార్చగలవేమో కాని వాటికి అధిగమించలేని అవరోధాలున్నాయి, నిర్దిష్టంగా దఖలుబడ్డ అధికారాలను అవి తిరిగి కేటాయించలేవు. ప్రస్తుతమున్న అధికారాల నిర్మాణంలో విశాలమైన సూత్రీకరణలు చేయగలవు. కాని ఒకళ్ళకు స్పష్టంగా మంజూరు చేసిన అధికారాలను మరొకరికి దఖలు చేయలేవు".

కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, చట్టసభల వ్యవస్థ – ఇవన్నీ వేరుగా ఉండి, ఉమ్మడిగా కలిసి పనిచేయగలగటమే మన రాజ్యాంగ విశిష్టతకు గీటురాయి. ఇదంతా న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశం. కాని మీరు డా. అంబేద్కర్‌కు అంజలి ఘటించటం విడ్డూరంగా ఉంది. సార్, 1946 నుండి 1950 వరకు ప్రపంచంలో నెలకొన్న స్థితిగతులేమిలో జ్ఞాపకం చేసుకోండి. ఆ కాలంలో లక్షలాది ప్రజలు వలసవాదుల శృంఖలాలలో బందీలై ఉన్నారు. దేశాలన్నీ విముక్తమై, స్వతంత్ర రాజ్యాలైన తర్వాత భారతదేశంలో మనం తీసుకున్న చర్య నిజంగా విప్లవాత్మక మైనదే. ఈ దేశాలేమీ మంజూరు చేయని సార్వత్రిక ఓటుహక్కును మనం మన ప్రజలకు అందించాం.....(అభ్యంతరాలు).....యూరప్ దేశాలే కాదు. చివరకు అమెరికా సంయుక్త రాష్ట్రాలు సైతం ఈ చర్యకు పూనుకోలేదు.

ప్రెసిడెంట్ బారక్ ఒబామా ఇక్కడకు వచ్చారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో అన్ని పక్షాల వాళ్ళం ఉత్సాహంగా ఉన్నాం. ప్రతి వాళ్ళు వా.....వా..... అనుకుంటూ ఒబామా పర్యటన సందడిలో ఉండగా ఆయన వచ్చి, "ప్రపంచపు అతి పురాతన ప్రజాస్వామ్యం నుండి ప్రపంచం

లోని అతి పెద్ద ప్రజాస్వామ్యానికి శుభాకాంక్షలు " అని పార్లమెంట్‌లోని బంగారు పుస్తకంలో వ్రాశారు. ఇది ఆయన సందేశం. ఆ రోజు సాయంత్రం ప్రెసిడెంట్ విందులో నేను ఆయన్ను ప్రశ్నించాల్సి వచ్చింది. నేనన్నాను, 'మీది ప్రపంచపు అతి పురాతన ప్రజాస్వామ్యం అనటం సరి కాదనుకుంటున్నాను'. ఆయన "ఎందుకు" అని నన్ను తిరిగి ప్రశ్నించారు. "మీరు అంటే అమెరికన్లు ఆఫ్రికన్లకు సార్వత్రిక ఓటు హక్కు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1962లో ఇచ్చారు. అంటే మీరు పుట్టిన ఒక్క సంవత్సరం తర్వాత ఇచ్చారు. కాని మేము భారతదేశంలో 1950లోనే ఇచ్చాము. దళితులు, భూస్వాములు, ముస్లింలు, హిందువులు-అందరికి 1950లో ఓటు హక్కు ఇవ్వబడింది" అని చెప్పాను. కాని ఇప్పటి పరిస్థితి ఏమిటి? హర్యానాలో వివిధ షరతుల రీత్యా 86 శాతం ప్రజానీకానికి ఓటు హక్కు, ఎన్నికలలో పోటి చేసే హక్కు నిరాకరింపబడింది. కొన్ని షరతులను నెరవేరిస్తేనే తప్ప లేకపోతే ఓటు హక్కుకు గాని, ఎన్నికలలో పోటీ చేయటంగాని అనుమతించబడదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. రాజస్థాన్‌లో మీరు పెట్టిన షరతుల కారణంగా సార్వత్రిక ఓటింగ్ నుండి సగానికి సగం ఓటర్లు మినహాయించబడ్డారు. గుజరాత్‌లో ఇంట్లో మరుగుదొడ్డి లేకపోతే ఓటు వేయటానికి గాని, ఎన్నికలలో పోటీ చేయటానికి గాని అర్హత ఉండదు. ఈ రాష్ట్రాలన్నీ బిజెపి పాలిత రాష్ట్రాలు కావటం గమనార్హం. కాబట్టి మీరు డా. అంబేద్కర్‌కు అంజలి ఘటించటం విడ్డూరంగా ఉంది. పాలక వర్గాల బల్లలు ఖాళీగా ఉన్నాయి. సోమవారం సమాధానం చెప్పే సమయానికి ఎవరు, ఎప్పుడు, ఎలా ఈ అంశాలను తెలియచెప్తారో తెలియదు.

సభా నాయకులు మూడవ జర్మన్ రాజ్యం (నాజీ పాలన) గూర్చి చాలా ఆసక్తికరమైన ప్రస్తావన చేశారు. అద్భుతం సార్. నాకు చాలా ఆనందంగా ఉంది. మూడవ జర్మన్ రాజ్యం, జర్మనీలో నియంతృత్వ ప్రమాదం గూర్చి మీరు గుర్తుచేసినందుకు మీకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. 1939 లో స్వతంత్ర భారత దేశ లక్షణాలు ఎలా ఉండాలని మన దేశంలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ వ్రాసిన "మనం, మన జాతీయతా నిర్వచనం" అనే పుస్తకం తారస పడింది. అప్పుడా పుస్తకం అంత ప్రధానమైనదిగా భావింపబడలేదు. కాని భారతదేశ భవితవ్యం, భారత రాజకీయాలతో ముడిపడిన ఆ పుస్తకం ఇప్పుడు చాలా ప్రధానమనిపిస్తున్నది. ఆ పుస్తకాన్ని రచించిన గోల్వాల్కర్‌ను ఆర్ ఎస్ ఎస్ గురువుగా పిలుస్తారు.

**" రాజస్థాన్‌లో మీరు పెట్టిన షరతుల కారణంగా సార్వత్రిక ఓటింగ్ నుండి సగానికి సగం ఓటర్లు మినహాయించబడ్డారు. గుజరాత్‌లో ఇంట్లో మరుగుదొడ్డి లేకపోతే ఓటు వేయటానికి గాని, ఎన్నికలలో పోటీ చేయటానికి గాని అర్హత ఉండదు. ఈ రాష్ట్రాలన్నీ బిజెపి పాలిత రాష్ట్రాలు కావటం గమనార్హం. "**

సభా నాయకులు మూడవ జర్మన్ రాజ్యాన్ని ప్రస్తావించారు కాబట్టి ఆ పుస్తకంలో పేర్కొన్న మూడవ జర్మన్ రాజ్యాన్ని వివరిస్తాను. "మనం (ఉయ్) " ఎవరు? హిందీలో "స్వరాజ్" "స్వ" అంటే అర్థమేమిటి? ఇది "ఎవరి రాజ్యం?" "మనం" ఎవరు? 'మనది హిందూ రాష్ట్రం. ఆ పుస్తక సారాంశమంతా ఇదే. ఆరోజుల్లో ఆయన (గోల్వాల్కర్) జర్మనీని, హిట్లర్ గూర్చి మాట్లాడమంటే, ఆయన అర్థం ఏమంటే, " కేవలం హిందువులు, హిందువులొక్కరే ఈ దేశ సంతతి (పౌరులు)". మూడవ జర్మన్ రాజ్యం గూర్చి ఆంచనా ఇలా చెప్పారు. ''జర్మనీ జాతి స్వచ్ఛతను, సంస్కృతిని నిలబెట్టటానికి యూదులు లాంటి సెమిటిక్ జాతుల్ని ఉచకోత కోసి ప్రపంచాన్నే నిర్ఘాంతపరిచింది. ఇక్కడ ఒక క్షణం ఆగుతాను. జర్మనీలో వలే భారతదేశంలో కూడా జర్మన్ యూదులతో పోల్చబడుతున్న వాళ్ళను, హిందూ జాతి సంస్కృతుల స్వచ్ఛత పేర వెంపర్లాడుతున్న వారిని మీరు దయచేసి పోల్చి చూడండి. ఆయన (గోల్వాల్కర్) మాటల్ని కొనసాగిస్తాను" జాతి ప్రతిష్ఠను అత్యున్నతంగా ఉంచే...............(అభ్యంతరాలు)...

వి.పి.సింగ్ బద్నోర్ ; సార్, ఆయన ఏ పుస్తకాన్ని ప్రస్తావిస్తున్నారు?

.............(అభ్యంతరాలు).........

ఉప సభాపతి ; మీరు ఏ పుస్తకం నుండి ప్రస్తావిస్తున్నారు?

..........(అభ్యంతరాలు)..........

ఆనంద్ శర్మ ; మీ పార్టీ సాహిత్యం నుండి ప్రస్తావిస్తున్నారు.

............(అభ్యంతరాలు).............

ఉప సభాపతి : ఏ పుస్తకం నుండి?

.......... (అభ్యంతరాలు)...........

సీతారాం ఏచూరి : సార్, నా మిత్రుడు, వి.పి. సింగ్ బద్నోర్ బిజెపి పార్లమెంట్ సభ్యుడైనప్పటికీ ఆర్.ఎస్.ఎస్. గూర్చిన అవగాహన అంతగా ఉన్నట్లు లేదు. ఆ పుస్తకం పేరు చెప్పనివ్వండి. ఆ పుస్తకం పేరు "మనం, మన జాతీయత నిర్వచనం". అందులోని 35వ పేజీ నుండి ఉటంకిస్తున్నాను. ఈ పుస్తకాన్ని 1939లో 'భారత్ ప్రకాశన్' వారు ప్రచురించారు. 'భారత్ ప్రకాశన్' వారే మళ్ళీ 1944లో రెండవసారి ప్రచురించారు. ఇది అధికారయుతమైన పుస్తకం. ఇప్పటికీ తొలగించకపోతే, ఈ పుస్తకం లైబ్రరీలో దొరుకుతుంది. నేనెందుకు చెప్తున్నానంటే, వాళ్ళకు అట్లా పుస్తకాల్ని తొలగించే అలవాటుంది. లేకపోతే మటుకు ఆ పుస్తకం పార్లమెంటు లైబ్రరీలో ఉంటుంది. కాకుంటే నేను సహాయం చేయగలను. ఒక కాపీ ఇవ్వగలను.

నేను ఆ పుస్తకంలోని 35వ పేజీలోని అంశాల్ని తిరిగి ఉటంకిస్తాను, "జాతి స్వచ్ఛతను, సంస్కృతిని నిలబెట్టడానికి, యూదులు లాంటి సెమిటిక్ జాతుల్ని ఊచకోత కోసి జర్మనీ ప్రపంచాన్నే నిర్ఘాంతపరిచింది. రాజ్య ప్రతిష్ఠను అత్యున్నత శిఖరాలకు చేర్చింది. భిన్నత్వం కలిగిన జాతులు, సంస్కృతులను తుదికంటా తమలో ఎలా విలీనం చేసుకోవచ్చో జర్మనీ నిరూపించింది. ఇది మనకు మంచి పాఠం..." దీన్ని దయచేసి అర్థం చేసుకోండి. వాస్తవంగా "హిందూరాష్ట్ర" అంటే ఇదే. అందుకోసమే మీరు డా॥ అంబేద్కర్‌కు శ్రద్ధాంజలి ఘటించాలనకుంటే చివరగా ఆయన చేసిన ప్రసంగాన్ని జ్ఞాపకం చేసుకోండి. ఆయన మత విశ్వాసంపై ఇలా చెప్పారు. "సమానత్వం లేకుండా మీకు స్వేచ్ఛ ఉండదు. సౌభ్రాతృత్వం (సద్భావన) లేకుండా మీకు స్వేచ్ఛ ఉండదు" మీరు భారతదేశ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను కోరుకుంటే. సమానత్వం, సౌభ్రాతృత్వం (సద్భావన)లపై రాజీ పడకూడదు. ఈ అంశాలపై రాజీ పడటంవల్లే అసహన వాతావరణం పెరిగిపోతున్నది.

అంతిమంగా డా॥ రాజేంద్రప్రసాద్‌గారి వాక్యాలు ప్రస్తావిస్తాను. ఆయన రాజ్యాంగ ముసాయిదాపై సంతకం చేసేటప్పుడు చెప్పిన

(మిగతా 35వ పేజీలో)

సిద్ధాంతం

# ఆర్థిక సామాజిక రంగాల్లో వర్గ పోరాటం



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

**ఎస్. వీరయ్య**

**మ**తోన్మాదం బలపడకుండా నివారించేందుకు వామపక్షాలు, అభ్యుదయ కాముకులు చాలా కాలంగా ప్రయత్నించారు.

అధికారం చేజిక్కించుకోకుండా నిలవరించాలని ప్రయత్నించారు.

అయినా మతోన్మాదం బలపడింది. అధికారంలోకి కూడా వచ్చింది. కారణమేంటి?

సంకీర్ణం నుండి సంపూర్ణ మెజార్టీకి దారి తీసిందెందుకు?

సామాజిక సమస్యల మీద పోరాటం ద్వారానే నిలవరించగలమా?

గత రెండు దశాబ్దాలుగా అస్తిత్వవాదాలు కూడా బలపడ్డాయెందుకు?

అభ్యుదయ కాముకులు ప్రజాస్వామ్య వాదులందరినీ వేధిస్తున్న సమస్యలివి. కమ్యూనిస్టు ఉద్యమం కూడా ఈ సమస్యకు పరిష్కారం వెతుకుతున్నది. సమాజ మార్పుకు చోదక శక్తి వర్గ పోరాటం. వర్గ పోరాటాలకు ఎదురయ్యే ఆటంకాలను అధిగమించకుండా కమ్యూనిస్టు ఉద్యమం ముందడుగు వేయజాలదు. అందుకే కమ్యూనిస్టు ఉద్యమానికి ఇది సంధి కాలం. చిక్కు ముడులు వీడుతున్న కాలం.

గత రెండున్నర దశాబ్దాలుగా సరళీకృత ఆర్థిక విధానాలను ప్రతిఘటిస్తున్న శక్తి వామపక్ష ఉద్యమమే. ప్రపంచీకరణ పేరుతో ప్రజలమీద జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తున్నదీ వామపక్షమే. అయినా రాజకీయ ప్రత్యామ్నాయంగా ప్రజలు వామపక్షాన్ని చూడలేదు.ఎందుకు చూడలేదన్నదే అసలు ప్రశ్న. ఒకవైపు ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. ధరలు పెరిగాయి. ఉద్యోగ భద్రత లేదు. మరోవైపు ప్రపంచీకరణ యుగంలో వ్యాపార ప్రకటనల వేగంతో మార్కెట్ మాయాజాలంలో మనిషి చిక్కుకున్నాడు. సంపాదించాలి అనుభవించాలి ఆనందించాలి. కొద్దో గొప్పో బ్యాంకు బేలెన్సు ఉన్నవారి ఆలోచన ఇది. కుటుంబ ఖర్చులు పెరిగాయి. పూడ్చుకునే ప్రయత్నంలో ఆదాయాలు చాలక అదనపు ఆదాయాల కోసం తపన. విరామమెరుగని ప్రయత్నం. మరోవైపు పెరుగుతున్న అసంతృప్తి. ఆర్థిక సాంఘిక సమస్యలు కుటుంబ సంబంధాలలో పెరుగుతున్న దూరం.... ఇంకా అనేక కారణాలున్నాయి. కండ్లముందు అభివృద్ధి మెరుపులు, ఇండ్లల్లో సమస్యల చిక్కుముడులు, మానసిక ఒత్తిడులు ఇవన్నీ సరళీకృత ఆర్థికవిధానాల ఫలితాలు.

ప్రత్యామ్నాయ విధానాలతో కూడిన రాజకీయ కూటమిని రూపొందించే ప్రయత్నం కన్నా కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా ఇతర బూర్జువా పార్టీలను సమీకరించడం మీదనే వామపక్షం కూడా దృష్టి సారించింది. కొన్ని సందర్భాలలో బీజేపీని అధికారంలోకి రాకుండా నివారించేందుకు కాంగ్రెస్‌కు కూడా సహకరించింది. నిజానికి బూర్జువా పార్టీలన్నీ అధికారంలో ఉన్నప్పుడు సరళీకృత ఆర్థిక విధానాలనే అమలుజరిపాయి. అందువల్ల మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలనే పేరుతో తమ కడగండ్లకు కారణమైన విధానాలతో కూడిన పార్టీలకే మద్దతునియ్యడాన్ని ప్రజలు అంగీకరించలేదు. పైగా ప్రత్యామ్నాయం లేని స్థితిలో ప్రజలకు మతం ఒక ఓదార్పు. మార్క్స్ మాటల్లో చెప్పాలంటే “మతం అనేది బదుగుజీవి నిట్టూర్పు, హృదయరహిత ప్రపంచంలో హృదయం, ఆత్మరహిత లోకంలో ఆత్మ, ప్రజలకు నల్ల మందు”. తగిన రాజకీయ ప్రత్యామ్నాయం రూపొందని నేపథ్యంలో మతాన్ని రాజకీయాలతో కలగాపులగం చేసిన బీజేపీవైపే ప్రజలు మొగ్గారు. ఇది కమ్యూనిస్టు పార్టీల ఎత్తుగడలకు సంబంధించిన లోపం. ఆర్థికవిధానాలమీద ఆ విధానాలు అవలంబించే రాజకీయ పార్టీల మీద పోరాడకుండా మతోన్మాదాన్ని నిలవరించడం సాధ్యం కాదని అనుభవం రుజువు చేసింది. పైగా ప్రజాస్వామ్యం గురించి, లౌకికతత్వం గురించి సిద్ధాంతీకరించిన పెట్టుబడిదారీ వర్గమే ఇప్పుడు సంక్షుభిత ఆర్థిక వ్యవస్థలో తమ దోపిడీని కాపాడుకునేందుకు నియంతృత్వాన్నీ మతోన్మాదాన్నీ ఆశ్రయిస్తున్నది. ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలకు మతోన్మాదానికి ఉన్న బంధమిది. అందుకే ఆర్థిక రాజకీయ సాంస్కృతిక రంగాల్లో సమగ్రంగా పోరాడకుండా మతోన్మాదాన్ని నిలవరించడం సాధ్యం కాదు. ప్రజల జీవితాల్లో వెలుగు నింపేందుకు ప్రత్యామ్నాయ విధానాలు చూపనంతవరకూ మతాన్నీ మతోన్మాదాన్నీ ప్రజలు వేరుచేసి చూడజాలరు. 2000 సం॥లో జరిగిన సిపిఐ(ఎం) ప్రత్యేక మహాసభలో తాజా పర్చిన పార్టీ కార్యక్రమం కులం పట్ల అనుసరించాల్సిన వైఖరి గురించి స్పష్టతనిచ్చింది. విశాఖలో జరిగిన సిపిఐ(ఎం) అఖిలభారత మహాసభల్లో రాజకీయ విధానాన్ని సవరించుకున్నది.

సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగానే ప్రైవేటీకరణ జోరందుకున్నది. ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ శాఖల్లోనూ రిక్రూట్‌మెంట్ ఆగిపోయింది. ఫలితంగా బదుగు బలహీన వర్గాలకు రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లు నిరుపయోగమవుతున్నాయి. మరోవైపు కొన్ని దశాబ్దాలపాటు అమలుజరిగిన రిజర్వేషన్ల ఫలితంగా కొత్త తరం మధ్యతరగతి ఆవిర్భవించింది. కొత్త ఆశలు, కోర్కెలు ముందుకొచ్చాయి. ఆర్థికంగాను రాజకీయపరంగాను ఎదగడానికి అవకాశాలను కోరుతున్నది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో వీరికి అవకాశాలు కూడా కన్పించాయి. బదుగు బలహీన వర్గాల ఓటు బ్యాంకు కోసం వీరిలో కొందరిని చేరదీయటం పాలకవర్గాలకు కూడా అవసరమైంది. అనేక ప్రజాతంత్ర నినాదాలు కూడా ముందుకొస్తున్నాయి. వీటిలో మెజారిటీ బదుగు జీవుల ప్రయోజనాలకన్నా కొద్దిమందిని సంతృప్తిపరచగలిగే నినాదాలే ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దళిత బూర్జువాను అభివృద్ధి చేసుకోవటం, బీసీలకు కాంట్రాక్టులు సాధించటం, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు వంటి నినాదాలు ఇందులో భాగమే. పేదలకు తాత్కా

లిక ఊరట కల్పించి పాలకవర్గాల చుట్టూ తిప్పుకునేందుకు సంక్షేమ పథకాలు ఉండనే ఉన్నాయి. మరోవైపు కులనిర్మూలన కోసం కృషికన్నా, కులవివక్ష మీద పోరాటం కన్నా తమ కులం కూడా గొప్పదని చెప్పుకునే ధోరణి ముందుకొచ్చింది. మొత్తంమీద దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులను తమ వెనుక సమీకరించడంలో వామపక్షాలు జయప్రదం కాలేదు. స్వాతంత్ర్యానంతరం వామపక్షాలు ఆర్థిక సమస్యలమీద పెట్టిన శ్రద్ధ, కులసమస్య మీద పెట్టకపోవడమే ఇందుకు కారణం. కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికలు, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య హక్కుల కోసం సాగిన పోరాటం తదితర కారణాలు కూడా పరిమితులకు కారణమయ్యాయి. ఈ కారణాలవల్ల ఆర్థికరంగంలో వర్గ పోరాటం కూడా పరిమితమే. కులాన్ని కూడా తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకునేందుకు పాలకవర్గాలకు ఇది అవకాశం కలిగించింది.

గత రెండున్నర దశాబ్దాలుగా ప్రపంచంలో వచ్చిన అనేక మార్పుల ప్రభావం భారతదేశం మీద కూడా ప్రసరించింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నంతో యువతను సోషలిజం ఆకర్షణీయమైన నినాదంగా ఆకట్టుకోలేకపోయింది. పెట్టుబడిదారీ విధానం అప్రతిహతంగా అభివృద్ధి సాధిస్తుందనే అభిప్రాయం కలిగింది. ప్రపంచీకరణ వేగం అందుకు తోడ్పడింది. ఈ నేపథ్యమే అభ్యుదయ శక్తులు వామపక్ష ఉద్యమం వెనుకపట్టు పట్టేందుకు కూడా తోడ్పడింది. సహజంగానే మతోన్మాదం పుంజుకునేందుకు అస్తిత్వ రాజకీయాలు బలపడేందుకు ఇది మంచి ప్రాతిపదిక అయింది.

గత రెండున్నర దశాబ్దాల పరిణామాలను సిపిఐ(యం) సమీక్షించింది. అనుభవాలను క్రోడీకరించింది. అందుకే ఆర్థికరంగంలో సరళీకృత ఆర్థిక విధానాలను అనుసరిస్తున్న బూర్జువా పార్టీలతో రాజీలేని పోరాటం చేయాలని నిర్ణయించింది. సామాజిక రంగంలోనూ వర్గపోరాటాన్ని ఉధృతం చేయాలని తీర్మానించింది. కులవివక్షకు వ్యతిరేకంగా సమరశీల పోరాటం చేయాలనీ, ఇందుకు సామాజిక శక్తులను కలుపుకుపోవాలని కూడా నిర్ణయించింది. వీటితోపాటు సంస్థాగత బలహీనతలను సరిదిద్దేందుకు కూడా నిర్దిష్ట చర్యలు తీసుకుంటున్నది. ఇందుకోసమే కోల్‌కటాలో ప్లీనం నిర్వహించింది. ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచుతూ వామపక్ష ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించింది. అంతిమంగా వామపక్ష ఉద్యమం బలపడకుండా లక్ష్యాన్ని సాధించలేము కదా!

**“సామాజిక రంగంలోనూ వర్గపోరాటాన్ని ఉధృతం చేయాలని తీర్మానించింది. కులవివక్షకు వ్యతిరేకంగా సమరశీల పోరాటం చేయాలనీ, ఇందుకు సామాజిక శక్తులను కలుపుకుపోవాలని కూడా నిర్ణయించింది. వీటితోపాటు సంస్థాగత బలహీనతలను సరిదిద్దేందుకు కూడా నిర్దిష్ట చర్యలు తీసుకుంటున్నది.”**


కోల్‌కతాలో జరిగిన ప్లీనంకు హాజరైన ప్రతినిధులు

సామాజిక అంశాల ఆధారంగానే మతోన్మాదాన్ని నిలవరించగలమనే అభిప్రాయం కూడా ముందుకొస్తున్నది. ఈ పని దేశంలో ఇప్పటికే అనేకమంది సంఘ సంస్కర్తలు చేశారు. నిజాయితీగా అంకితభావంతో కృషిచేసినవారున్నారు. కానీ కుల నిర్మూలనలో కానీ, కుల వివక్ష నిర్మూలనలో కానీ జయప్రదం కాలేదు. బ్రాహ్మణవాద సిద్ధాంతాన్ని, మతోన్మాదాన్ని నిలవరించడంలో వీరు కూడా జయప్రదం కాలేదు. కమ్యూనిస్టులు కులసమస్య మీద తగినంత దృష్టి సారించలేదు. సంస్కర్తలు, ప్రజాస్వామ్యవాదులు కులసమస్య మీద దృష్టి సారించినప్పటికీ వర్గపోరాట ప్రాధాన్యతను గుర్తించలేదు. ఆర్థిక సమస్యలమీద కొంత దృష్టి సారించినప్పటికీ అవి తాత్కాలికంగా ఊరట కలిగించే సంక్షేమ చర్యలకే పరిమితం. నిజానికి ఆర్థిక సమస్యల ప్రస్తావన లేకుండా కేవలం కులసమస్య పరిష్కారం కోసం జరిగే ప్రజా సమీకరణకు కూడా పరిమితులుంటాయి. దళిత, గిరిజన, బీసీ సంఘాలు ఎన్ని ఏర్పడ్డా సంక్షేమ పథకాలు ఆర్థిక కోర్కెలు లేకుండా అవి ముందుకు సాగలేదు. ఆ మాత్రం సంక్షేమ చర్యలు ఆశలు చూపడం పాలకవర్గాలకు కష్టమేమీ కాదన్నది మన అనుభవం. తాత్కాలిక ఊరట కలిగించే సంక్షేమ పథకాలతో ఓటు బ్యాంకు రాజకీయాలు నడపడం పాలకవర్గాల ఎత్తుగడ. పేదరికం నుండి దోపిడీ వ్యవస్థ నుండి శాశ్వత విముక్తి ప్రసాదించే వర్గ పోరాటమే ఇక్కడ కీలకం. వర్గ పోరాటంతో సమన్వయం లేని సందర్భాలలో సామాజిక ఉద్యమాలు కూడా అంతిమంగా పాలకవర్గ రాజకీయాలకే తోడ్పడ్డాయి. అందుకే ఆర్థిక సామాజిక సాంస్కృతిక రంగాలలో వర్గ పోరాటం అవసరం. ప్రత్యామ్నాయ విధానాల కోసం సంఘటిత ఉద్యమం నిర్మించాలి. కుల వివక్ష మీద రాజీలేని పోరాటం సాగాలి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆర్థిక సామాజిక రంగాలలో పోరాటాలు జరగాలి.

కమ్యూనిస్టు పార్టీలో కూడా ఆధిపత్య కులాల నాయకత్వం సామాజిక న్యాయం కోసం పోరాడగలదా అన్న ప్రశ్న కమ్యూనిస్టేతరులు లేవనెత్తుతున్నారు. కమ్యూనిస్టు కార్యకర్తలు కూడా కొన్ని సందర్భాలలో ఈ వాదనతో ప్రభావితమవుతున్నారు. మార్క్సిస్టు అవగాహన మీద తగిన పట్టు లేనప్పుడు లేదా పట్టు సడలినప్పుడు ఇలాంటి ప్రభావాలు సహజమే. వామపక్ష ఉద్యమం బలహీనపడిన సందర్భంలో ఈ ప్రభావాలు పడటంలో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. కమ్యూనిస్టు అంటేనే కులం మతం ప్రాంతం వంటి భావాలన్నీ వదిలించుకొని అంతర్జాతీయ దృక్పథాన్ని జీర్ణించుకోవడం. శ్రామికవర్గ లక్షణాలను పుణికిపుచ్చుకోవటం. అలాంటి పార్టీలో కొందరు వ్యక్తులలో కులాన్ని చూడటం అర్థరహితం. మార్క్సిస్టు అవగాహన, వర్గ దృక్పథం బలహీనపడిన కార్యకర్తలలోనే నాయకులలో కులాన్ని వెతికే లక్షణం ముందుకొస్తుంది. కమ్యూనిస్టేతరులు కులం దృష్టితో చూడటంలో వింత లేదు. కమ్యూనిస్టులు ఇందుకు ప్రభావితులైనప్పుడే సమస్య. కమ్యూనిస్టు పార్టీ అంటే కార్మిక వర్గ పార్టీ. కార్మికవర్గ నాయకత్వంలో విప్లవ సాధన కోసం పనిచేస్తున్న పార్టీ. ఈ కృషిలో భాగంగానే కమ్యూనిస్టు పార్టీ లౌకికవిలువల పరిరక్షణకు, కులసమస్య పరిష్కారానికి కృషి చేయాలి. వర్గ ఐక్యతను సాధించాలి. అప్పుడే లక్ష్య సాధనకు మార్గం సుగమం అవుతుంది. ❋

# పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలపై ఒక విశ్లేషణ

బి. తులసీదాస్



రచయిత సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు

**రా**ష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు రోజు రోజుకి పెరుగుతున్నాయి. కౌలుదార్ల బలవన్మ రణాలు అంతకంతకూ అధికమౌ తున్నాయి. గృహ అవసరాలకోసం రుణం తీసుకొని విషమ షరతులతో అప్పు తిరిగి చెల్లించలేక ప్రాణ సమానమైన మానాన్ని సహితం కోల్పోవాల్సిన దుస్థితి పట్టణాల్లోని సాధారణ మహిళలకు ఏర్పడడం ఇటీవలి కాల్‌మనీ ఉదంతంలో వెల్లడైన దుర్మార్గం. అన్నదాతల ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాలని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను ఉన్నత న్యాయస్థానం ఆదేశించినా అవి ఆ దిశగా స్పందించిన దాఖలాలు లేవు. ఈ విషమ పరిణా మాలకు ప్రభుత్వ విధానాలకుగల అంతస్సంబంధాన్ని పరిశీలిద్దాం. రైతులు, కౌలుదార్లు, మహిళా స్వయం సహాయ బృందాలకు సంస్థా గత రుణాల లభ్యత, వారికిగల రుణభారం విశ్లేషిస్తే కొన్ని అంశాలు బోధపడతాయి.

కింది పట్టికలోని వివరాలు పరిశీలిస్తే 2013-14 సం॥లో ఇచ్చిన పంటరుణం కంటె 2014- 15లో సుమారు రూ.7400కోట్లు తగ్గింది. ఈ ఏడాది (2015-16) పంటరుణం లక్ష్యం రూ.48,067కోట్లకు గానూ సెప్టెంబర్ 30 నాటికి రూ.31,979కోట్లు లభించింది. మొత్తం వ్యవసాయ రుణాలు 2012-13తో పోల్చితే 2014-15లో రూ.10,122కోట్లు (50060-39401) తగ్గింది. అంటే 2012-13లో బ్యాంకుల నుండి వ్యవసాయరంగానికి రూ.100లు అప్పు లభిస్తే 2014-15లో రూ.80లు మాత్రమే దక్కింది. పెరిగిన వ్యవసాయ ఖర్చులు, దిగజారిన రూపాయి విలువతో పోల్చితే ఈ తగ్గుదల మరింత తీవ్రంగా ఉంటుంది. కాబట్టి ఈ రెండేళ్లుగా రాష్ట్రంలో సేద్యం సాగిందంటే ఆ మేరకు ప్రైవేటు రుణాలు, అధిక వడ్డీలపై రైతులు అదనంగా ఆధార పడాల్సి వచ్చిందన్నమాట.

**పెరుగుతున్న రుణభారం :**

సెప్టెంబర్ 28న, డిసెంబర్ 13న జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశాల ఎజెండా నోట్స్‌లో ఇచ్చిన వివరాల పరిశీలిద్దాం. రైతులు 2013మార్చి 31నాటికి రూ. 50,343కోట్లు రుణాలు చెల్లించాల్సివుండగా అది 2014లో రూ.59,105కోట్లకు చేరింది. 2015 మార్చి 31నాటికి రూ.65,356కోట్లకు పెరిగి, 2015 సెప్టెంబర్ 30నాటికి రూ.91, 415 కోట్లయ్యింది. ఇందులో గడువు మీరిన బకాయి రూ.20,445కోట్లు. ఈ వివరాలను బట్టి రాష్ట్రంలో రైతుల రుణభారం పెరిగిందన్నది సుస్పష్టం. రాష్ట్ర ప్రభుత్వం రైతులను రుణ విముక్తుల్ని చేస్తామని చెబుతున్న మాటలు బూటకమని బ్యాంకర్ల లెక్కలే తేల్చి చెబుతున్నాయి. ఇంకా చెప్పాలంటే టిడిపి అధికారంలోకి వచ్చిన 2014 నాటితో పోలిస్తే ఈ ఏడాదిన్నరలో (2014 ఏప్రిల్ నుండి 2015 సెప్టెంబర్) రైతులకు 32 వేల కోట్ల రూపాయల రుణభారం పెరిగింది. అప్పటితో పోలిస్తే ఇది 54 శాతం ఎక్కువ. ఇదంతా రైతులు బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయి మాత్రమే. స్థానిక వడ్డీవ్యాపారులు, ఎరువులు, పురుగు మందులు వ్యాపారస్థుల దగ్గర రైతులు పొందిన రుణాలు అదనం. వడ్డీలు, చక్రవడ్డీల గురించి చెప్పనక్కరలేదు.

**బ్యాంకుల వ్యవసాయ రుణ వితరణ**

| వివరం | 2012-13 | 2013-14 | 2014-15 | 2015-16 | (సెప్టెంబర్ 30 నాటికి కోట్లరూ॥లో) |
|---|---|---|---|---|---|
| పంటరుణం | 36093 | 37058 | 29658 | 31,979 | (లక్ష్యం 48067) |
| దీర్ఘకాలిక రుణం | 13697 | 12716 | 10280 | 7422 | (లక్ష్యం 17205) |
| **మొత్తం** | **50060** | **49774** | **39938** | **39,401** | **(లక్ష్యం 65275)** |

**కౌలుదార్ల దుస్థితి :**

కౌలుదార్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రాష్ట్రంలో 20 లక్షల మందికి పైగా కౌలు దార్లు ఉన్నారని అంచనా. కాగా ప్రభుత్వం ఈ ఏడాది 16 లక్షల 25 వేల మంది కౌలు దార్లకు రుణార్హత గుర్తింపు కార్డులు (ఎల్ఇసి) మంజూరు లక్ష్యంగా ప్రకటించింది. ఎస్ఎల్‌బిసి వివరాల ప్రకారం 20.11.2015 నాటికి 4,81,611 మందికి ఎల్ఇసిలు మంజూరు చేయగా, వారిలో 70,013 మందికి మాత్రమే రూ.146 కోట్లు రుణం ఇచ్చారు. ఇదిగాక మరో 38,205 జాయింట్ లయబులిటీ గ్రూపులు (జెఎల్‌జి) ఏర్పాటుచేసి సుమారు 2లక్షల మందికి రుణం కల్పిస్తామని లక్ష్యంగా నిర్ణ యించినా కేవలం 6,431 జెఎల్‌జిలకు (దాదా పు 30 వేలమందికి) బ్యాంకు రుణం మంజూ రైంది. అంటే రాష్ట్రంలోని 20 లక్షల మంది కౌలుదార్లలో ఒక లక్షమందికి, అంటే నూటికి ఐదుగురికి కూడా బ్యాంకు రుణం రాలేదన్న మాట. 95 శాతం మంది కౌలుదార్లు వడ్డీవ్యాపా రుల్ని, ఎరువు, పురుగు మందుల దుకాణదారుల్ని ఆశ్రయించవలసి వస్తున్నది.

**మహిళా పొదుపు బృందాలకు దక్కని రుణం :**

రాష్ట్రంలో 90 లక్షల మంది మహిళలు స్వయం సహాయ బృందాల్లో ఉన్నారని ప్రభుత్వం చెబుతోంది. పొదుపు గ్రూపుల రుణం ద్వారా కొద్దిమంది వ్యాపారం నిర్వహిస్తున్నా, ఇంకొందరు కేవలం “దీపం” గ్యాస్ కనెక్షన్లు పొందడం వరకే పరిమితమైనా చాలామందికి వ్యవసాయ, ఇంటి అవసరాల కోసం బ్యాంకు రుణాలు ఉపయోగపడు తున్నాయి. పట్టణ మహిళలు పిల్లల చదువులు, ఇతర కుటుంబ అవసరాలకు కూడా ఒకమేర వినియోగిస్తున్నారు. కానీ మహిళా పొదుపు గ్రూపులకు పరపతి కూడా సమస్యాత్మకంగానే తయారయింది. 2013-14లో 3,14,836 గ్రూపులకు రూ.9,773 కోట్ల రుణం

మంజూరు కాగా, 2014 – 15లో 2,26,975 గ్రూపులకు 7,364 కోట్ల రూపాయలు మాత్రమే మంజూరు చేశారు. అంటే అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే 88 వేల గ్రూపులకు రుణం రాలేదు. 2,400 కోట్ల రూపాయలు (దాదాపు నాల్గవ వంతు) తగ్గింది. ఈ బృందాల రుణభారం కూడా ఈ కాలంలో ఎక్కువైంది. 2015 జూన్ 30 నాటికి 13,816 కోట్ల రూపాయలు బకాయిపడగా అదే సెప్టెంబర్ 30 నాటికి 14, 695 కోట్ల రూపాయలు బకాయి పడ్డాయి. అంటే మూడు మాసాల్లోనే 779 కోట్ల రూపాయల రుణభారం ఎక్కువైంది. బ్యాంకులు అప్పులు ఇవ్వకపోవడం, మరోవైపు చేసిన అప్పులు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో ప్రైవేటు వడ్డీవ్యాపారుల్ని ఆశ్రయించవలసి వస్తోంది. అందులో భాగం గానే మహిళలు దుర్మార్గమైన కాల్‌మనీ వ్యాపా రుల బారిన పడాల్సిన దుస్థితి ఏర్పడింది.


**తగ్గిన సాగు – దిగజారిన దిగుబడి :**

ఈ రెండేళ్ళ కాలంలో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి, ధరలుపడిపోతున్నాయి. రాష్ట్రంలో 2013–14 సాగు విస్తీర్ణం 68 లక్షల 86 వేల హెక్టార్లు కాగా 2014–15లో అది 63 లక్షల 64 వేల హెక్టార్లకు తగ్గింది. (2015–16 వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక) ఈ ఏడాది మరింత దిగజారింది. డిసెంబర్ 23 నాటికి కేవలం 49 లక్షల 48 వేల హెక్టార్లు మాత్రమే సాగయ్యింది. (సీజన్ & క్రాప్ రిపోర్టు 23.12.15 ప్రకారం) రాష్ట్రంలోని 359 మండలాలు, అంటే సగంకన్నా ఎక్కువ కరువు పీడితమైనవిగా ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో పంటల దిగుబడులు కూడా తగ్గుతున్నాయి. వరి 21.65 శాతం, మొక్కజొన్న 13.77 శాతం, వేరుశనగ 7.22 శాతం దిగుబడి తగ్గిందని 2015–16 రెండవ త్రైమాసిక సమీక్ష నివేదికలో పేర్కొన్నారు. ఖరీఫ్ వరి, పత్తి అపరాలకు సంబంధించిన పంట దిగుబడి వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉన్నా అనావృష్టి, దీర్ఘకాల బెట్ట (డ్రై స్పెల్) కారణంగా దిగుబడులు తగ్గుతాయన్నది నిర్వివాదాంశం.

**ధరల ఒడిదుడుకులు :**

వివిధ పంటల ధరలు కూడా ఈ కాలంలో దిగజారుతున్నాయి. 2014 డిసెంబర్ 1న పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మార్కెట్‌లో క్వింటాల్ ధాన్యం ధర రూ.1500లు కాగా ఈ ఏడాది అదే రోజున కేవలం రూ.1430లు మాత్రమే ఉంది. (నిజానికి రైతుకు క్వింటాలుకు రూ.1200లు కూడా దక్కడం లేదు) ప్రభుత్వ

“ బ్యాంకులు అప్పులు ఇవ్వకపోవడం, మరోవైపు చేసిన అప్పులు తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో ప్రైవేటు వడ్డీవ్యాపారుల్ని ఆశ్రయించవలసి వస్తోంది. అందులో భాగం గానే మహిళలు దుర్మార్గమైన కాల్‌మనీ వ్యాపా రుల బారిన పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ”



గతంలో ధాన్యంతో నిండుగా ఉన్న ఎఫ్‌సిఐ గోడౌన్

మార్కెటింగ్ శాఖ నిర్వహించే ఎగ్‌మార్క్‌నెట్ వెబ్‌సైట్‌లోని వివరాలివి. అయినా గతేడాదితో పోలిస్తే ఇప్పుడు క్వింటాల్ ధాన్యానికి కనీసం 70 రూపాయలు రైతు కోల్పోతున్నాడు. ఎకరానికి సగటు దిగుబడి 25 క్వింటాళ్ళు అనుకున్నా 1750 రూపాయలు నష్టపోతున్నాడు. ఇదే పత్తి విషయానికి వస్తే గతేడాది నవంబర్ 1న కర్నూలు జిల్లా ఆదోని మార్కెట్‌లో క్వింటాలుకు 4300 రూపాయల ధర పలకగా ఈ ఏడాది నవంబర్ 2న (1వ తేదీ ఆదివారం) 4139రూపా యలు మాత్రమే దక్కింది. ఈ రెండు పంటలే కాక దాదాపు అన్నింటి పరిస్థితి ఈ ఏడాది ఇలాగే ఉంది. గత రెండేళ్లుగా శనగ రైతుల అగచాట్లు చూస్తున్నాం. గత ఏడాది మొక్కజొన్న, ఈ సంవత్సరం పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది.

**పంటల కొనుగోలు సమస్యలు :**

ధాన్యం లెవీ సేకరణ విషయంలో మోడీ ప్రభుత్వం నిబంధనలు మార్చడం వల్ల తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. గతంలో రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసేందుకు, సంక్షేమ హాస్టళ్లు, ఇతర ప్రభుత్వ పథకాలకు అవసరమయ్యే బియ్యాన్ని మిల్లర్ల నుండి రాష్ట్రంలో ఎఫ్‌సిఐ లెవీగా సేకరించే విధానం ఉండేది. కానీ 2015 అక్టోబర్ నుండి అలా చేయడానికి వీలులేదని మోడీ ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తర్వులు జారీ చేసింది. దాన్ని ఎదిరించవలసింది పోయి ఎన్‌టిఆర్ పరిపాలనా కాలం (1983) నుండి రాష్ట్రంలో ఉన్న లెవీ విధానానికి చంద్రబాబు ప్రభుత్వం మంగళం పాడింది. ఐకెపి, తదితర సంస్థల ద్వారా ఎపి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ రైతుల నుండి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని నవంబర్ 3,4 తేదీల్లో జి.వో 22, జి.వో23ను సర్కారు జారీ చేసింది. జి.వోలు వచ్చి ఆరు వారాలు దాటినా కనీసం కొనుగో లుకు అవసరమైన గోనెసంచులు కూడా జిల్లాల కు సరఫరా కాలేదు. ఇక డబ్బు బకాయి గురించి చెప్పనక్కరలేదు. ఇప్పటికే ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో ధాన్యం ధర తగ్గడమేగాక కొనుగోళ్ళు కూడా ఇబ్బందికరంగా తయారయ్యాయి. రాష్ట్రమంతటా అదే దుస్థితి ఏర్పడుతున్నది. పంటల సేకరణ బాధ్యత, సబ్సిడీలివ్వడం ప్రభుత్వ బాధ్యత కాదని, దాన్ని మార్కెట్ శక్తులకు వదిలి వేయాలన్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు పర్యవసానమిది.

ప్రభుత్వాల విధానాల మూలంగానే వ్యవసాయ సంక్షోభం ముదురుతున్నది. గడిచిన రెండు సంవత్సరాల్లో రైతులు, కౌలుదార్లు, స్వయం సహాయక బృందాలకు వ్యవస్థాగత రుణాలు తగ్గాయి. రుణభారం పెరిగింది. బ్యాంకుల్లో పరపతి పుట్టక ప్రైవేటువారిని ఆశ్రయించడంతో వడ్డీ దోపిడి పెరిగింది. పంటలకు ధరలు కూడా పడిపోవడంతో రాష్ట్రంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు, కౌలుదార్లు, స్వయం సహాయ బృందాలకు బ్యాంకు రుణాలను అధికంగా ఇవ్వాలి. వ్యవసాయ, డ్వాక్రా రుణమాఫీకి విషమ షరతులు, రుణమాఫీని పూర్తిస్థాయిలో చేపట్టడం రాష్ట్ర ప్రభుత్వ తక్షణ కర్తవ్యంగా ఉండాలి. ప్రజలకు సంస్థాగతంగా డబ్బు అందుబాటు పెరగాలి. కరువు, వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో సహాయాలను సకాలంలో సక్రమంగా అందించాలి. బాధల్లో ఉన్నవారికి ప్రభుత్వం భరోసానివ్వాలి. ❋

## పారిస్ నుండి నైరోబి వరకు...

# సామ్రాజ్యవాద ప్రయోజనాలకు పెద్దపీట

**ఎస్. వెంకట్రావు**



రచయిత సిపిఎం రాష్ట్రకమిటీ సభ్యులు

**2015** డిసెంబర్ నెల.... భూగోళంమీద రెండు ఖండాల్లో రెండు ప్రధానమైన అంతర్జాతీయ చర్చలు జరిగాయి. రెంటిలోనూ.. అమెరికా ఒత్తిడి ముందు నరేంద్రమోడీ సర్కారు తలవొంచింది. రెంటిలోనూ.. వర్ధమాన దేశాల ప్రయోజనాలు కాలరాసి ధనిక దేశాలు ప్రయోజనం పొందాయి. మొదటిది నవంబర్ 30 నుండి డిసెంబర్ 12 వరకు పారిస్‌లో జరిగిన వాతారవణ చర్చలు. (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్...కాప్-21) రెండవది అదే నెల 15 నుండి అయిదు రోజుల పాటు ఆఫ్రికాఖండం లోని కీన్యా రాజధాని నైరోబీలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) 10వ మంత్రిత్వ స్థాయి చర్చలు. రెండు వేదికల మీదా చర్చలు పేద వర్ధమాన దేశాలకూ, ధనిక పశ్చిమ దేశాలకూ మధ్య యుద్ధంలాగా జరిగాయి. ఈ యుద్ధంలో అమెరికా నాయకత్వంలో సామ్రాజ్య వాద దేశాలు సమైక్యంగా నిలబడి, వర్ధమాన దేశాలపై ఒత్తిడి తెచ్చి తమ ప్రయోజనాలు నెరవేర్చుకున్నాయి.

**వాతావరణం ఓడింది, వాణిజ్యం గెలిచింది**

పదమూడు రోజుల పాటు జరిగి డిసెంబర్ 12వ తేదీన 31 పేజీల ఒప్పందంతో ముగిసిన పారిస్ చర్చలపై ఒక పర్యావరణ కార్యకర్త వ్యాఖ్యానిస్తూ "పారిస్‌లో వర్ధమాన దేశాలు ఓడిపోయాయి, ధనిక దేశాలు గెలిచాయి. పర్యావరణం ఓడింది, వాణిజ్యం గెలిచింది" అన్నాడు. పారిస్ ఒప్పందంలో ముఖ్యంగా నాలుగు అంశాలున్నాయి. 1. సదస్సుకు హాజరైన 196 దేశాలు సంతకం చేసిన ఒప్పందంలో భూగోళ తాపాన్ని (గ్లోబల్ వార్మింగ్) తగ్గించే ఏ ఒక్క చర్యకూ, ఏ ఒక్క దేశమూ కట్టుబడాల్సిన అవసరం లేకుండా స్వచ్ఛంద లక్ష్యాలు ప్రకటించాయి. 2. ఈ లక్ష్యాలను ఆయా దేశాలు స్వచ్ఛందంగా అమలు చేసినా కూడా భూగోళం రానున్న ప్రమాదం నుండి తప్పుకునే అవకాశాలేవు. 3. కోపెన్‌హేగన్‌లో 2009లో జరిగిన వాతావరణ చర్చల్లో వర్ధమాన దేశాలు గట్టిగా వాదించిన "ఉమ్మడి, కానీ విభిన్న బాధ్యతలు" (కామన్ బట్ డిఫెరెన్షియేటెడ్ రెస్పాన్సిబులిటీస్) అన్న సూత్రం ఓడిపోయి, ధనిక దేశాలూ పేద దేశాలూ ఒకే రకంగా త్యాగాలు చేయాలన్న పశ్చిమ దేశాల పంతం నెగ్గింది. 4. వాతావరణాన్ని కూడా వాణిజ్య ప్రయోజనాలకోసం ఉపయోగించుకునే కార్పొరేట్ బేహారులు పారిస్ చర్చల్లో పైచేయి సాధించారు.

**పూర్వరంగం**

పారిశ్రామిక అవసరాలు, వాహన రవాణా కోసం శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, గ్యాస్ విచ్చలవిడిగా మండించడం వల్ల వాతావరణంలో కార్బన్-డైఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సయిడ్ వంటి వాయువుల సాంద్రత పెరిగిపోతోంది. ఈ వాయువులు (ఉద్గారాలు) భూమి పైన ఒక పొరలాగా ఏర్పడి సూర్యుని నుండి వచ్చే వేడిమిని నిలిపి ఉంచి భూగోళాన్ని క్రమంగా వేడెక్కిస్తున్నాయి. దీన్నే 'గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్' అంటున్నారు. వాతావరణంలో గ్రీన్‌హౌస్ ఉద్గారాల సాంద్రత పెరిగే కొద్దీ సూర్యుని వేడిని అవి మరింతగా పట్టి ఉంచుతాయి. దానివల్ల భూగోళం మరింత వేడెక్కుతుంది. గ్రీన్‌హస్ ఎఫెక్ట్ వల్ల గత 100 సంవత్సరాల కాలంలో భూమి మీద సగటు ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్ వరకు పెరిగిందని శాస్త్రవేత్తలు లెక్కలు కట్టి మరీ చెబుతున్నారు. దీనివల్ల భూమ్మీద వాతావరణంలో విపరీతమైన మార్పులొస్తున్నాయి. భూగోళం ధృవాల వద్ద, ఐస్‌లాండ్, హిమాలయాలు వంటి ప్రాంతాల్లో మంచు కరిగిపోయి జలరాసిగా మారిపోతోంది. దాంతో సముద్రాల నీటిమట్టం పెరుగుతోంది. అందువల్ల తీర ప్రాంతాలు, దీవులు నీటిలో మునిగిపోతున్నాయి. తీరప్రాంతాల్లోని పల్లెలు, పట్టణాలు దెబ్బతింటున్నాయి. రుతుపవనాల్లో తేడాలు వస్తున్నాయి. ఒక ప్రాంతంలో అధిక వర్షాలు కురిసి ఉధృతమైన వరదలు సంభవిస్తుంటే మరికొన్ని ప్రాంతాలు వర్షాలు లేక కరువుకాటకాలతో అలమటిస్తున్నాయి. పంటల సీజనుల్లో మార్పులొస్తున్నాయి. భూమి వేడి పెరుగుతున్న కొద్దీ వరదలూ, తుపానులు, దుర్భిక్షాల తీవ్రతలు పెరుగుతున్నాయి. వీటి పర్యవసానాలు పేద దేశాల మీద ఎక్కువ ప్రభావం చూపిస్తున్నాయి. తీర ప్రాంతాల్లో నివసించే వారిలో పేదలే ఎక్కువ ఉండటాన వారే ఎక్కువ నష్టపోతున్నారు.

ఈ ఉపద్రవం నుండి తప్పుకోవాలంటే భూతాపం పారిశ్రామిక విప్లవ ముందునాటి సగటు ఉష్ణోగ్రతతో పోలిస్తే 2030 నాటికి 2 డిగ్రీల సెంటీగ్రేడుకన్నా ఎక్కువ పెరగకుండా చూసుకోవాలి. ఆ తరువాత ఈ వేడి పెరగకుండా చర్యలు తీసుకోవాలి. ధనిక దేశాలు 2020 నాటికి గ్రీన్‌హౌస్ ఉద్గారాల విడుదలను 40 శాతానికీ, 2050 నాటికి 90 శాతానికీ తగ్గించుకుంటే ఆ పని జరుగుతుందని ఇంటర్ గవర్నమెంటల్ ప్యానల్ ఆన్ క్లయిమేట్ చేంజ్-ఐపిసిసి నివేదిక నిర్దేశించింది. 1990 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఈ తగ్గింపు జరగాలి. 2008లో ఇండోనేషియాలోని బాలిలో జరిగిన వాతావరణ సదస్సులో ఏఏ దేశాలు ఎంతెంత శాతం ఉద్గారాలు తగ్గించుకోవాలో నిర్ణయించారు. 2009లో కోపెన్‌హాగన్‌లో జరిగిన సదస్సులో ఈ మేరకు చట్టబద్ధమైన కట్టుబాటు ఉండే (లీగల్లీ బౌండ్) ఒప్పందం కుదుర్చుకోవాలని అనుకున్నారు. కానీ అక్కడ ధనిక దేశాల మొండిపట్టు వల్ల అది జరగలేదు. అందువల్ల ఆ లక్ష్యాని ప్యారిస్ సమావేశానికి వాయిదా వేసుకున్నారు.

### పారిస్‌లో ఏం జరిగింది?

1. చారిత్రకంగా అత్యధిక గ్రీన్‌హౌస్ వాయువులను వాతావరణంలోకి విడుదల చేసిన ధనిక దేశాలు ఉద్గారాల విడుదలలో ఎక్కువ కోత విధించుకోవాలి, వర్ధమాన దేశాలు ఇంకా పారిశ్రామికంగా అభివృద్ధి సాధించాల్సి ఉంది గనుక అవి తక్కువ కోత విధించాలన్నది "ఉమ్మడి, కానీ విభిన్న బాధ్యతలు" అన్న సూత్రం ముఖ్యోద్దేశం. వాతావరణంలోని 75 శాతం గ్రీన్‌హౌస్ ఉద్గారాలను ప్రపంచ జనాభాలో 25 శాతం కన్నా తక్కువగల అమెరికా ఇతర ధనిక దేశాలు విడుదల చేశాయి. పారిశ్రామిక విప్లవ కాలం నుండీ అవి విడుదల చేస్తున్నాయి. అందువల్ల ఈ వాయువులను తగ్గించాల్సిన బాధ్యత ప్రధానంగా ఈ ధనిక దేశాలమీదనే ఉంటుంది. కానీ ధనిక దేశాలు దీనికి అంగీకరించలేదు. చైనా, భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆలస్యంగా పారిశ్రామిక విప్లవం సాధించాయి. అవి ప్రస్తుత తమ అభివృద్ధిని కొనసాగించాలంటే ఉద్గారాలను విడుదల చేయక తప్పని పరిస్థితి ఉంది.

గతాన్ని వదిలిపెట్టి భవిష్యత్తు ఉద్గారాల తగ్గింపుపై ఒప్పందం జరగాలనేది అమెరికా వాదన. ఇది సమన్యాయ సూత్రానికే విరుద్ధమని భారత్ ఇప్పటివరకు వాదిస్తూ వచ్చింది. కానీ నరేంద్ర మోడీ సర్కారు అమెరికా ఒత్తిడికి తలొగ్గి ఇప్పుడు తన విధానం మార్చుకుంది. అమెరికాతో పాటుగా ఉద్గారాల తగ్గింపుకు అంగీకరించింది. 1990తో పోలిస్తే 2030 నాటికి 25 శాతం నుండి 30 శాతం వరకు ఉద్గారాలు తగ్గించుకుంటామని మోడీ సర్కారు స్వచ్ఛందంగా ప్రకటించింది. దీని ప్రభావం మన దేశాభివృద్ధిపై భవిష్యత్తులో తీవ్రంగా ఉంటుంది.

2. పారిస్ సదస్సులో ఏ ఏ దేశం ఎంతెంత ఉద్గారాలు తగ్గించగలవో ప్రకటించాయి. అయితే ఇవన్నీ స్వచ్ఛంద ప్రకటనలే. దానికి కట్టుబడి ఉండాలన్న నిబంధనేదీ ఇందులో లేదు. కాకపోతే ప్రతి అయిదేళ్లకొకసారి ఏదేశం తన హామీ మేరకు ఎంత శాతం కోత పెట్టుకుంది అన్న విషయం బహిరంగంగా ప్రకటిస్తారు, అంతే. అందువల్ల ఒప్పందం ప్రకారం దేశాలు ఉద్గారాలు తగ్గిస్తాయన్న గ్యారెంటీ లేదు. ఉద్గారాల తగ్గింపుకు చట్టబద్ధత ఉండకూడదని అమెరికా పట్టుబట్టింది. 'చట్టబద్ధత ఉంటే చాలా దేశాలు తక్కువ కోటాలు ప్రకటిస్తాయి. చట్టబద్ధత లేకపోతే ఉదారంగా కోటాలు ప్రకటిస్తాయి' అని సదస్సులో అమెరికా ప్రతినిధి టోడ్ స్టెర్న్ సమర్ధించుకున్నారు.

❝ గతాన్ని వదిలిపెట్టి భవిష్యత్తు ఉద్గారాల తగ్గింపుపై ఒప్పందం జరగాలనేది అమెరికా వాదన. ఇది సమన్యాయ సూత్రానికే విరుద్ధమని భారత్ ఇప్పటివరకు వాదిస్తూ వచ్చింది. కానీ నరేంద్ర మోడీ సర్కారు అమెరికా ఒత్తిడికి తలొగ్గి ఇప్పుడు తన విధానం మార్చుకుంది. ❞

3. భాగస్వామ్య దేశాలన్నీ తాము తీసుకున్న కోటాలను నూటికి నూరుపాళ్లు అమలు జరిపినా కూడా లక్ష్యం నెరవేరదని నిపుణులు చెబుతున్నారు. వారి అంచనా ప్రకారం అన్ని దేశాలూ కోటాల ప్రకారం ఉద్గారాల విడుదలను తగ్గించినా కూడా 2100 సంవత్సరం నాటికి భూమి ఉష్ణోగ్రత పారిశ్రామిక విప్లవం ముందు నాటితో పోలిస్తే సగటున 3.6 డిగ్రీలు పెరుగుతుంది. నిర్దేశించేకున్న లక్ష్యం 2 డిగ్రీల సెలిషియస్ కన్నా ఇది 1.6 శాతం ఎక్కువ. అంటే ఈ కోటాలతో ఉపద్రవాన్ని నివారించలేవన్న మాట. ఇంతకు మించి ఉద్గారాల విడుదలను తగ్గించాలి. కానీ దీనికి ఏ దేశమూ సిద్ధంగా లేదు.

4. తీసుకున్న కోటాల మేరకు ఆయా దేశాలు ఉద్గారాలను తగ్గిస్తాయన్న నమ్మకం కూడా లేదు. ఎందుకంటే ఏ దేశం తను ప్రకటించిన కోటా మేరకు ఉద్గారాలను తగ్గిస్తోంది, ఏ దేశం తగ్గించడం లేదు అన్న యంత్రాంగం రూపకల్పన ఒక సమస్య. ప్రతి దేశమూ ఉద్గారాల తగ్గింపును బహిరంగంగా ప్రకటించాలి. కానీ ఇటీవల జర్మన్ కంపెనీ ఫోక్స్ వాగన్ తన కార్లనుండి వచ్చే ఉద్గారాల కొలతను తగ్గించి చూపించే టెక్నాలజీ వాడిన కుంభకోణాన్ని పరిశీలిస్తే పారిశ్రామిక ఉద్గారాల కొలత ఎంతటి కష్టమైన పనో, మోసం చేయడానికి ఎంతటి అవకాశం ఉందో అర్ధమవుతుంది.

5. పేద దేశాలు ఉద్గారాలు తగ్గించాలంటే అవి బొగ్గు, చమురు ఇంధనాల నుండి సౌర, పవన, అణు తదితర ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మళ్లాలి. దానికి చాలా పెట్టుబడి, టెక్నాలజీ కావాలి. అ టెక్నాలజీ ప్రధానంగా ధనిక దేశాల దగ్గర ఉంది. ఉదాహరణకు, అమెరికా దగ్గర ఆ దేశం మొత్తంగా ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మళ్లిపోగలిగే టెక్నాలజీ ఉంది. కానీ ఆ దేశంలో ఇప్పటికీ తలసరి ఏడాదికి 55 బ్యారెల్ల చమురు వాడుతున్నారు. బంగ్లాదేశ్ దగ్గర అటువంటి టెక్నాలజీ లేదు. పెట్టుబడులూ లేవు. ఆ దేశంలో తలసరి చమురు వాడకం 3 బ్యారెల్లు మాత్రమే. అందువల్ల వర్ధమాన దేశాలు చమురు, బొగ్గువాడకం తగ్గించుకుంటూనే తమ అభివృద్ధిని కొనసాగించాలంటే వాటికి ధనిక దేశాల టెక్నాలజీ, పెట్టుబడులు బదిలీ కావాలి. కాని టెక్నాలజీ అంతా బహుళజాతి కార్పొరేషన్ల దగ్గర పోగుపడ్డ పెటెంట్ హక్కుల్లో బందీ అయింది. వాటి దగ్గర కొనుక్కుంటేనే పేద దేశాలకు టెక్నాలజీ వస్తుంది. కొనుక్కోవాలంటే వాటి దగ్గర డబ్బు లేదు.

6. వాతావరణ సదస్సు సందర్భంగా పశ్చిమ దేశాలకు చెందిన సుమారు 350 కార్పొరేట్ సంస్థలు పారిస్‌లో వందకు పైగా సదస్సులు జరిపాయి. ప్రత్యామ్నాయ ఇంధనాలు ఉత్పత్తి చేసే "గ్రీన్ టెక్నాలజీని" వర్ధమాన దేశాలకు ఎలా అమ్ముకోవాలి? ఈ వ్యాపారంలో వచ్చే లాభాలు, నష్టాల గురించి చర్చించాయి. మొత్తం మీద చూసినప్పుడు పారిస్ సదస్సును ప్రపంచ కార్పొరేట్ సంస్థలు మంచి లాభాలు గడించే అవకాశంగా మలుచుకున్నాయని పలువురు చెబుతున్నారు.

7. చివరిగా వాతావరణ మార్పుల వల్ల నష్టపోయే పేద దేశాలకు సహాయం చేసేందుకుగాను ఏటా 10,000 కోట్ల (100 బిలియన్) డాలర్ల సహాయం అందించాలని ధనిక దేశాలు ప్రకటించాయి. కానీ ఈ ప్రకటనకు చట్టబద్ధమైన కట్టుబాటు ఉండకూడదని అమెరికా పట్టుబట్టి మరీ సాధించుకుంది. దాంతో ఇదంతా స్వచ్ఛంద ప్రకటనగానే మిగిలిపోయింది. 2009 కోపెన్ హాగన్ సదస్సులో కూడా ఏటా 100 బిలియన్ డాలర్ల సహాయం చేయాలని ధనిక దేశాలు ప్రకటించాయి. కానీ ఆచరణలో అందులో 10శాతం కూడా ఇవ్వలేదంటే సరికొత్త ప్రకటన ఎంత వరకు అమలవుతుందో అర్ధం చేసుకోవచ్చు.

మొత్తం మీద చూసినప్పుడు ఈ సదస్సు నిరర్థకంగా మారిపోయింది. "ఒక టైమ్ టేబుల్‌గానీ, ఒక టార్గెట్‌గానీ లేని అస్పష్టమైన ఆశలతో కూడిన ఒప్పందం ఇది" అని పారిస్ సదస్సును కవర్ చేసిన బ్రిటిష్ పాత్రికేయుడు, గార్డియన్ పత్రికలో రచయిత జార్జి మోన్‌బి

**" మరో వైపు పేద దేశాల్లోని బడుగు రైతులకు ఇచ్చే వ్యవసాయ సబ్సిడీలకు మంగళం పాడుతుంది. వర్ధమాన దేశాల ప్రజల ఆహార భద్రతను హరి స్తుంది. ధనిక దేశాలనుండి వచ్చే వ్యవసాయో త్పత్తులకు వర్ధమాన దేశాల వ్యవసాయ మార్కెట్లను బార్లా తెరవడం ద్వారా ఆ దేశాల్లో రైతుల కు రక్షణ లేకుండా చేస్తుంది. "**

యోట్ పేర్కొన్నారు. ఆయన 2006లో "ఉష్ణం: ఈ భూగోళం మండిపోకుండా ఎలా ఆపాలి" అన్న పుస్తకం రాశారు. సదస్సులో "ఒకరి భుజం ఒకరు చరుచుకోవడం మినహా నిజంగా వాతావరణం సర్వనాశనం కాకుండా ఉండేందుకు చేసింది శూన్యం" అని ఆయన పేర్కొన్నారు.

మరి కర్తవ్యమేమిటి? ప్రపంచ సాఫ్ట్‌వేర్ వ్యాపారి బిల్‌గేట్స్ ఒప్పుకున్నట్లు స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థలో వాతావరణ పరిరక్షణ సాధ్యం కాదు, ఎందుకంటే దానివల్ల ప్రయివేటు వ్యాపారులకు లాభం రాదు. నయా–ఉదారవాద ప్రపంచంలో స్వేచ్ఛామార్కెట్ ఆర్థిక వ్యవస్థకూ, పర్యావరణ పరిరక్షణకూ పొసగదు. స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థ ఉంటే భూగోళం వేడెక్కి మానవాళికి ముప్పు వస్తుంది. అలా ముప్పు వాటిల్లకూడదు అంటే స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థ లేకుండా చేయాలి.

**డబ్ల్యుటిఓ చర్చలు:**
**ఉత్తిచేతుల్తో వచ్చిన భారత్**

అమెరికా నాయకత్వంలో ధనిక దేశాలు ఏకమై వర్ధమాన దేశాల మెడలు వంచి తమ ప్రయోజనాలను నెరవేర్చుకున్న తీరు, అమెరికా ముందు భారత సర్కారు సాష్టాంగపడిన తీరు పారిస్‌లో కన్నా స్పష్టంగా, నగ్నంగా నైరోబీలోని డబ్లుటిఓ సమావేశాల్లో కనిపించింది. అయిదు రోజుల చర్చల అనంతరం వెలువడిన నైరోబీ మంత్రిత్వస్థాయి ప్రకటన, లేక నైరోబీ ప్యాకేజీ... ధనిక దేశాలు తమ రైతులకు ఇచ్చే కోట్లాది డాలర్ల సబ్సిడీలను రక్షిస్తుంది, బహుళజాతి అగ్రో వ్యాపారుల ప్రయోజానలు నెరవేరుస్తుంది. మరో వైపు పేద దేశాల్లోని బడుగు రైతులకు ఇచ్చే వ్యవసాయ సబ్సిడీలకు మంగళం పాడుతుంది. వర్ధమాన దేశాల ప్రజల ఆహార భద్రతను హరి స్తుంది. ధనిక దేశాలనుండి వచ్చే వ్యవసాయో త్పత్తులకు వర్ధమాన దేశాల వ్యవసాయ మార్కె ట్లను బార్లా తెరవడం ద్వారా ఆ దేశాల్లో రైతుల కు రక్షణ లేకుండా చేస్తుంది.



నైరోబి డబ్ల్యు.టి.ఒ. మంత్రుల సమావేశం

1995లో ప్రారంభమైన డబ్లుటిఓలో 162 దేశాలున్నాయి. 1999లో అమెరికాలోని సియాటెల్ నగరంలో జరిగిన డబ్లుటిఓ సమావేశాలకు నిరసనగా వేలాది మంది ప్రజలు ప్రదర్శనలు జరిపి సమావేశాలకు ముగింపు వాక్యం పలికేట్లు చేశారు. దాంతో 2001లో డబ్లుటిఓ రెండో దఫా చర్చలు క్వతర్ రాజధాని దోహాలో ప్రారంభమైనాయి. అందుకని దీన్ని దోహా రౌండ్ చర్చలు అంటున్నారు. ప్రపంచ వాణిజ్యం అమెరికా, యూరప్‌లోని ధనిక దేశాలకు అనుకూలంగా ఉన్నది కనుక వర్ధమాన దేశాలకు సమన్యాయం జరిపే అంశాలపై దోహా చర్చలు కేంద్రీకరించాలని నాడు నిర్ణయించారు.

దోహా రౌండ్‌లో ఇప్పటి వరకు 9 దఫాలు మంత్రిత్వ స్థాయి చర్చలు జరిగాయి. నైరోబీలో జరిగినవి 10వ దఫా చర్చలు. అంతకు ముందు చర్చలు 2013 డిసెంబర్‌లో ఇండొనేసియాలోని బాలిలో జరిగాయి. నైరోబీ మంత్రిత్వ స్థాయి చర్చలు చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే ఇవి డబ్ల్యుటిఓ భవిష్యత్తు నడకను నిర్ణయించేవి. వాతావరణ చర్చల మాదిరిగా కాకుండా ఇక్కడ జరిగే నిర్ణయాలకు అన్ని దేశాలూ చట్టబద్ధంగా కట్టుబడి ఉండాలి. అందువల్ల ఈ చర్చల్లో నిర్ణయాలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకుగాను అమెరికా ఇతర ధనిక దేశాలు ముందుగానే "ట్రాన్స్–పసిఫిక్ భాగస్వామ్యం, ట్రాన్స్–అట్లాంటిక్ వాణిజ్యం, పెట్టుబడుల భాగస్వామ్యం" పేరతో ప్రాంతీయ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. భారత్, చైనా రెండింటినీ ఒప్పందాలకు దూరం పెట్టాయి. ఈవిధంగా ఏకమైన ధనిక దేశాలు రహస్య ఒడంబడికల ద్వారా మెజారిటీ వర్ధమాన దేశాలను అంతర్జాతీయ వాణిజ్యం నుండి బయటకు నెట్టే కుట్రలకు పాల్పడ్డాయి. వర్ధమాన దేశాల సమస్యలపై కేంద్రీకరించిన దోహా రౌండ్ చర్చల వల్ల ఇప్పటి వరకు ఎలాంటి ఫలితాలు రాలేదన్న పేరుతో ధనిక దేశాలు పాత అంశాలను పక్కనబెట్టి నైరోబీలో తమకు అనుకూలమైన కొత్త అంశా లను ముందుకు తెచ్చాయి.

ఉదాహరణకు అంతకు ముందు ఎజెండా లో లేని రెండవ సమాచార సాంకేతిక (2ఐటి) ఒప్పందం ముందుకు తెచ్చాయి. ఈ ఒప్పందం వల్ల ఐటి ఉత్పత్తులపై సుంకాలు తొలగిపోయి వర్ధమాన దేశాల మార్కెట్లను ధనిక దేశాలు తమ ఉత్పత్తులతో ముంచెత్తుతాయి. 1996లో భారత దేశం మొదటి ఐటి ఒప్పందంపై సంతకం చేసినందున 200కు పైగా ఐటి ఉత్పత్తులపై సుంకాలు తగ్గించడంతో దేశంలోని హార్డ్‌వేర్ పరిశ్రమ దివాళా తీసింది. ధనిక దేశా లు ముందుకు తెచ్చిన మరో అంశం.. వాతా వరణ సరుకుల ఒప్పందం. దీనివల్ల వాతా వరణ ఉత్పత్తులపై సుంకాలు తొలగిపోయి ధనిక దేశాలు బాగా లాభపడతాయి.

నైరోబీ ఒప్పందంలో వ్యవసాయంపై ఆరు నిర్ణయాలు చేశారు. వీటిలో అమెరికా ఇతర ధనిక దేశాలు తమ వ్యవసాయోత్పత్తులకు ఇస్తున్న వేల కోట్ల డాలర్ల పరోక్ష సబ్సిడీ తగ్గింపు గురించిన ఊసే లేదు. వాస్తవానికి ధనిక దేశాలు ఇస్తున్న సబ్సిడీల వల్లనే వాటి వ్యవసాయ ఉత్పత్తులు తమ దేశాల్లోకి చౌకగా ప్రవేశించి తమ రైతులను దెబ్బతీస్తున్నాయని, అందువల్ల ధనిక దేశాలు ఈ సబ్సిడీలు ఎత్తివేయాలని వర్ధమాన దేశాలు దోహా చర్చల్లో డిమాండ్ చేస్తూ వచ్చాయి. ఈ డిమాండ్‌ను ధనిక దేశాలు పక్కకు నెట్టేశాయి. కానీ 2018 నుండి భారత దేశం, ఇతర వర్ధమాన దేశాలు మాత్రం తమ సన్న, చిన్నకారు రైతులకిచ్చే సబ్సిడీలు తగ్గించుకోవాలని నైరోబీ ఒప్పందంలో నిర్ణయించారు. ఈ సబ్సిడీలు స్వేచ్ఛా వాణిజ్యానికి అడ్డుపడుతున్నాయన్నది ధనిక దేశాల కార్పొరేట్ బేహారుల అభియోగం. వర్ధమాన దేశాల్లో ఆహార భద్రత కోసం

ధాన్యాలు నిల్వ చేసుకునే విషయంలో కూడా ధనిక దేశాలు మొండి చేయి చూపించాయి. డబ్ల్యుటివో సభ్యులంతా ప్రజల ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆహార ధాన్యలను నిల్వ ఉంచుకునే విషయమై ఒక శాశ్వత పరిష్కారాన్ని 2015 డిసెంబర్ 31 లోగా కనుగొనాలని 2014 నవంబర్ 27న జరిగిన డబ్ల్యుటిఓ జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. కానీ నైరోబీ సమావేశంలో దానిపై నిర్ణయం తీసుకోలేదు. దాంతో భారత్ లాంటి పేద దేశాల్లో ఆహార నిల్వలు చేసుకునే అవకాశం లేక ఆహార భద్రతకు ముప్పువచ్చే ప్రమాదం ఏర్పడింది. దీనిపై ఎటువంటి పరిస్థితుల్లోనూ నిర్ణయం తీసుకోవలసిందే అని నైరోబీ సమావేశాలకు ముందు గర్జించిన మోడీ ప్రభుత్వం సమావేశంలో చేతులెత్తేయడంతో మన దేశంతో పాటు మొక్కజొన్న నిల్వ చేసుకునే పలు ఆఫ్రికా దేశాలకూ నష్టం వాటిల్లింది.

జి33కు చెందిన వర్ధమాన దేశాల్లోని సన్న, చిన్నకారు రైతులను రక్షించేందుకుగాను ప్రత్యేక పరిరక్షణ యంత్రాంగాలు (స్పెషల్ సేఫ్‌గార్డ్ మెకానిజమ్స్ –ఎస్ఎస్ఎం) ఏర్పాటు చేయాలన్నది దోహా చర్చల్లో ప్రధానమైన అంశం. కానీ దీనిమీద కూడా నైరోబీ ప్రకటనలో స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఇదంతా దిగుమతుల నుండి వర్ధమాన దేశాల రైతులను రక్షించే యంత్రాంగం. పెద్ద ఎత్తున చౌకగా దిగుమతులు ముంచెత్తితే పేద దేశాల్లోని రైతులు పండించే పంటల ధరలు పడిపోయి దివాళా తీస్తారు గనుక దిగుమతులపై ప్రత్యేక సుంకాలు విధించే యంత్రాంగాలను ఏర్పాటు చేయాలన్నది డిమాండు. కానీ ధనిక దేశాలు దీనిపై నిర్ణయాన్ని వాయిదా వేశాయి. నిజానికి ధనిక దేశాల్లోకి దిగుమతులు పెరగకుండా సుంకాలు విధించే ప్రత్యేక వ్యవసాయ పరిరక్షణ చర్యల (ఎస్ఎస్జి)ను అవి ఇప్పటికే అమలు చేస్తున్నాయి. కానీ వర్ధమాన దేశాల రైతులకు మాత్రం అటువంటి రక్షణలు లేకుండా చేశాయి. అందువల్ల ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న మన బడుగు రైతులకు నైరోబీ ప్రకటన మరింత పెద్ద ఉరితాడుగా మారబోతోంది. హైతీ దీనికి మంచి ఉదాహరణ: బిల్ క్లింటన్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అమెరికా వరి దిగుమతులతో హైతీని ముంచెత్తారు. దాంతో హైతీ రైతులు దివాళా తీసి వరి పండించడం మానేశారు. వరి సేద్యం పూర్తిగా ధ్వంసమైంది. ఫలితంగా హైతీ ప్రజలు తిండి కొరతకు లోనై ఐక్యరాజ్య సమితి ఇచ్చే సహాయంతో కడుపు నింపుకోవలసిన దుస్థితి దాపురించింది. తరువాత ఈ ఐరాస కార్యక్రమానికి ప్రత్యేక రాయబారిగా నియమించబడిన క్లింటన్ తను చేసిన పనికి హైతీ ప్రజలకు క్షమాపణ చెప్పారు. "ఇంకెవరో కాదు నేను చేసిన పనికి హైతీ ప్రజలు ఆహారం పండించే సామర్థ్యాన్ని కోల్పోయిన దుస్థితిని నేను రోజూ నా కళ్లారా చూస్తూ ఇక్కడ గడిపాను" అని క్లింటన్ చెప్పారు.

**"బిల్ క్లింటన్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అమెరికా వరి దిగుమతు లతో హైతీని ముంచెత్తారు. దాంతో హైతీ రైతులు దివాళా తీసి వరి పండించడం మానేశారు. వరి సేద్యం పూర్తిగా ధ్వంసమైంది. ఫలితంగా హైతీ ప్రజలు తిండి కొరతకు లోనై ఐక్యరాజ్య సమితి ఇచ్చే సహాయంతో కడుపు నింపు కోవలసిన దుస్థితి దాపురించింది."**

నైరోబీ మంత్రిత్వ స్థాయి సమావేశంలో "అమెరికా తనకు కావలసింది తాను తీసుకుంది. వర్ధమానదేశాలకు ఒక్క మెతుకు కూడా విదల్చలేదు" అని ఈ సమావేశాలకు హాజరైన ఒక సామాజిక కార్యకర్త వ్యాఖ్యానించాడు. "ఆఫ్రికా ఖండంలో జరిగిన మొట్టమొదటి డబ్ల్యుటివో సమావేశాల్లో అయిదు రోజుల తీవ్ర చర్చల తరువాత వర్ధమాన దేశాలు ఉత్తి చేతుల్తో తిరిగి వెళ్లాయి. కానీ అమెరికా, బడా కార్పొరేషన్లు మాత్రం వాటికి కావలసినవి దక్కడంతో చాలా ఆనందంగా ఉన్నాయి" అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ సమావేశాల్లో అమెరికా ఒత్తిడికి లొంగిపోయి మన దేశ రైతాంగపు ప్రయోజనాలకు నష్టం కలిగించిన తీరు తీవ్ర విమర్శలకు గురైంది. మన వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశాలకు ముందు చాలా గంభీరమైన ప్రకటనలు చేశారు. పశ్చిమ దేశాల ఒత్తిడికి తలొగ్గేది లేదనీ, మన రైతుల ప్రయోజనాలు ఎట్టి పరిస్థితుల్లో కాపాడతామని బల్లగుద్దారు. కానీ సమావేశంలో అమెరికా చెవి మెలిపెట్టేసరికి అది చెప్పిన పత్రాలపై సంతకాలు చేసి వచ్చేశారు. విచిత్రమేమంటే తిరిగి వచ్చిన తరువాత ఆమె ఒప్పందం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత దేశ ప్రజల ప్రయోజనాలతోబాటు, వర్ధమాన దేశాల ప్రయోజనాలను భారత్ కాపాడుతుందని భావించిన వారికి ఇది నవ్వు తెప్పించింది. ఎందుకంటే డబ్ల్యుటిఓ చర్చల్లో ఏ నిర్ణయమైనా ఏకాభిప్రాయం ద్వారా జరగాల్సిందే. భారత దేశం కాదు అంటే అసలు ఒప్పందం కుదిరే అవకాశమే లేదు. కానీ నైరోబీలో అమెరికా చెప్పిన చోట సంతకం చేసి ఇంటికి వచ్చి అసంతృప్తి వ్యక్తం చేయడం ప్రజలను మోసగించడానికే.

పారిస్ వాతావరణ చర్చల్లోగానీ, నైరోబీలో జరిగిన డబ్ల్యుటిఓ చర్చల్లోగానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టడానికి కారణమేమిటంటే ఆయన నెత్తికెత్తుకున్న 'మేకిన్ ఇండియా' నినాదమేనని పలువురు పరిశీలకులు చెబుతున్నారు. మోడీగారి మేకిన్ ఇండియా అమెరికా, కార్పొరేట్ పెట్టుబడులపై ఆధారపడి రూపొందించబడింది. వాటికి ఆగ్రహం తెప్పించే ఏపని చేసినా మేకిన్ ఇండియా మూల కూర్చుంటుంది. మోడీ భారత దేశాన్ని విదేశీ పెట్టుబడులతో 'ముందుకు' తీసుకుపోవాలను కుంటున్నారు. కానీ ఆయన వ్యూహం మొదటికే మోసం తెస్తుందని విమర్శకులు మొదటి నుండీ హెచ్చరిస్తున్నా అధికార పక్షం కొట్టి పారేస్తోంది. కానీ ఈ హెచ్చరికలు నిజమవుతున్నాయని పారిస్, నైరోబీ చర్చలు స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. పారిస్ సమావేశానికి ముందు వాతావరణ న్యాయం కావాని అన్న మోడీ అమెరికా అధ్యక్షుడు ఒబామా నుండి ఒక్క ఫోన్ కాల్ వచ్చేసరికి పారిస్ ఒప్పందంపై మారుమాటాడకుండా సంతకాలు చేశారు. నైరోబీలో కూడా అదే జరిగింది.

మతోన్మాదం సందర్భం వచ్చినప్పుడల్లా సామ్రాజ్యవాదానికి సాష్టాంగపడుతుందని చరిత్ర చాలా సార్లు రుజువు చేసింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పుడు అదే చేస్తోంది. పారిస్ ఒప్పందం మన పారిశ్రామికాభివృద్ధికి ప్రతిబంధకంగా మారుతుంది. నైరోబీ ఒప్పందం మన వ్యవసాయ రంగం ఉసురు తీస్తుంది. మోడీ ప్రభుత్వానికి ఘోరీ కట్టి, ప్రత్యామ్నాయ విధానాలకు పట్టం కట్టినప్పుడే ఈ రెండు రంగాలకు భవిష్యత్తు ఉంటుంది. ❋

**ఈ మాసం ప్రత్యేకం**

# భారతదేశ సమ్మిళిత సంస్కృతిని దెబ్బతీస్తున్న హిందూత్వవాదులు

**ఇర్ఫాన్ హబీబ్**

గత కొద్ది నెలల కాలంలో బా.జ.పా నేతృ త్వం లోని కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ సంస్థల స్వభావాన్ని మార్చడం ద్వారా సంఘ పరివారపు హిందుత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్ళడానికి తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చి, నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరి, లలితకళా అకాడమి వంటి స్వయం ప్రతిపత్తి గల సంస్థలను సంఘపరివార్ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండే విషయాలపైనే పరిశోధనలు సాగించమని ఒత్తిడి చేస్తోందని ప్రముఖ పండితులు అంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం, వివిధ రంగాలలో అనైతికమైన, అశాస్త్రీయమైన పరిశోధనా పద్ధతులను అదే పనిగా ప్రోత్సహిస్తున్నదని పలువురు పండితులు చెబుతున్నారు.

సాంస్కృతికరంగంలో సైతం స్వభావ రీత్యా స్పష్టంగా హిందూ మెజారిటీకి చెందిన వారిని రెచ్చగొట్టే చర్యలను చేపట్టే ప్రయత్నాలను భా.జ.పా నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్నాయి. ఏదో ఒక వంకతో మాంసా హారాన్ని తినడంపై నిషేధం విధించడం, స్కూళ్ళలో పాఠ్యపుస్తకాలుగా గీతను, రామాయ ణాన్ని ప్రవేశ పెట్టడం, ఢిల్లీలోని ప్రసిద్ధ ఔరంగ జేబు రోడ్డు పేరును మార్చడం వంటి చర్యలు హిందుత్వాన్ని, అంటే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రాజకీయ ఎజెండాను ప్రోత్సహించడంపై ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న పట్టుదలకు అద్దంపడ తాయి. హిందూత్వవాదులకు అందుతున్న ఇటువంటి ప్రభుత్వ మద్దతుతోనే, ప్రభుత్వం లోపల, బైటా ఉన్న హిందూ అతివాదులు దేశం లోని పలు ప్రాంతాలలో నిర్భీతిగా ముస్లింలు, క్రైస్తవులకు వ్యతిరేకంగా విద్వేషపూరిత ప్రసం గాలు చేస్తున్నారు. భారతదేశంలోని ప్రజల మనస్సుల్లో నెలకొని ఉన్న వైవిధ్య భరితమైన ఉమ్మడి సంస్కృతి చరిత్రపై నేరుగా దాడి చేయ డమే ఈ దాడులలో ఇమిడి ఉన్న అర్థం. సర్వ సహజంగా చరిత్ర పాఠ్య పుస్తకాలను తిరిగి రాయడం అన్నదే సంఘపరివార్ యొక్క అతి ముఖ్యమైన ఎజెండాలలో ఒకటి. **1998**లో అధికారం చేపట్టిన మొదటి నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ ప్రభుత్వం చేయితిరిగిన చరిత్ర రచయితలు చేసిన కఠోర కృషిని పూర్తిగా తోసి పుచ్చుతూ, చరిత్ర పాఠ్యపుస్తకాలను తిరిగి రాయ డానికై హిందుత్వ సిద్ధాంత కర్తలను నియమిం చింది. ఏ శాఖలో పరిశోధనకైనా తప్పని సరిగా ఉండవలసిన శాస్త్రీయ, హేతుబద్ధ శోధనా సాంప్రదాయాలను అంతం చేయడానికి పూనుకో వడమే కాక, అర్థం పర్థం లేని అసత్యాల ప్రాతి పదికన చరిత్రకు మతం రంగు పులుముతున్నదని చరిత్ర కారులు, ఇతర పండితులు విశ్వసిస్తు న్నారు. ప్రాచీన మధ్య యుగాల భారతదేశ చరిత్రకు సంబంధించి అంతర్జాతీయ ఖ్యాతిని గడించిన చరిత్ర పరిశోధకుడు ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్ ప్రస్తుతం అలీగడ్ ముస్లిమ్ యూనివర్సిటి చరిత్ర శాఖలో గౌరవ ఆచార్యుడిగా పనిచేస్తు న్నారు. నేటి ప్రభుత్వం ఏమాత్రం శాస్త్రీయ ఆధారాల దన్ను లేకుండానే చరిత్రలోని పలు వాస్తవాల అన్వేషణకు ఉన్న ప్రాతిపదికలను (హైపాథిసెస్) మార్చడానికి ఎలా ప్రయత్నిస్తోం దనే విషయం పై ఆయన ఫ్రంటలైన్ పత్రిక విలేకరితో సంభాషించారు. **84** ఏళ్ళ హబీబ్ తన జీవితమంతా అన్ని రకాల మతమౌఢ్యాలకు వ్యతిరేకంగా తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల అలిగడ్ ముస్లిమ్ యూనివర్సిటికి మైనారిటి ప్రతిపత్తి కల్పించాలని కొన్ని గ్రూపులు లేవనెత్తిన డిమాండును ఆయన వ్యతిరేకించారు. ఆయన రాసిన అనేక ప్రామాణిక రచనలలో మొఘల్ కాలపు భారతదేశంలో **(1556-1707)** వ్యవ సాయిక విధానం అనే రచన, మొఘల్ కాలంలో భారతదేశ స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో గత ఐదు దశాబ్దాలలో చరిత్ర విద్యార్థులకు అతి ముఖ్య పాఠ్యపుస్తకంగా ఉపకరించింది. ప్రొఫెసర్ హబీబ్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చి సంస్థలకు పలు సంవత్సరాలు నేతృత్వం వహించారు. పద్మ భూషణ్‌తో సహా పలు పురస్కారాలను ఆయన అందుకొన్నారు. ఆయనతో ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలను మార్చిస్తూ పాఠకులకు అందిస్తున్నాం.



రచయిత ప్రఖ్యాత చరిత్రకారులు

**ప్రశ్న : –** బా.జ.పా నేతృత్వంలోని ప్రభుత్వం భారత చరిత్రను పునర్నిర్వచించాలనే ధ్యేయంతో సాగుతోందని అది ప్రస్తుతం చేస్తున్న ప్రయత్నాలు తెలియచేస్తున్నాయి. పరిశోధనకు అది ఎంపిక చేసిన వాటిలో వేదకాలం నాటి వివిధ సమస్య లు, ఆర్యుల సమస్య, ఢిల్లీ సుల్తానుల కాలం, మొఘల్ సామ్రాజ్యానికి సంబంధించిన కీలక అంశాలు ఉన్నాయి. ఈ విషయాలపై జరిగిన వాదోపవాదాలతో చేయి తిరిగిన చరిత్ర కారులు ఇప్పటికే సమగ్రంగా పరిశీలించిన అంశాలే ఇవి. ఈ పరిణామాన్ని గురించి మీరేమను కుంటున్నారు. ?

**జవాబు : –** నేటి ప్రభుత్వ నాయకులు చేసిన "చరిత్ర పై వ్యాఖ్యలను" కొన్నింటిని నేను చదివాను. గణేషుడి ఏనుగు తల అతి ప్రాచీన కాలంలోనే భారత దేశంలో ప్లాస్టిక్ సర్జరి కనిపెట్టబడిందని తెలియచెబుతోందని ప్రధాని నరేంద్రమోడి వ్యాఖ్య పై వాటిన్నిటికి తలమా నికంగా నిలుస్తుంది. అదేవిధమైన మానసిక స్థితిలో ఉన్న ఆయన పరివారంలో కింది స్థాయి నాయకులు చేస్తున్న ఇట్లాంటి ప్రకటనలు ఇపుడు అనేక రెట్లు పెరిగాయి. పురాణాల కాలం నాటి చరిత్రను, అంటే నా ఉద్దేశంలో రామాయణ, మహాభారత గాథల ఆధారంగా చరిత్రను పునర్నిర్వచించాల్సిన అవసరాన్ని గురించి, నేడు చరిత్ర కారుల ప్రథమ కర్తవ్యం అదే అని ఐసిహెచ్ఆర్ ప్రస్తుత నేత పిలుపు నిస్తున్నాడు.

ఔరంగజేబు రోడ్డు పేరు మార్చడం, "వేయి ఏళ్ళ విదేశీ పాలన" కు వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు చేస్తున్న కఠోర ప్రకటనలు తొలి ఎన్‌డిఏ ప్రభుత్వం కింద నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చి (ఎన్‌సిఇఆర్‌టి) సంస్థ ప్రచురించిన చరిత్ర పాఠ్య పుస్తకాలకు ఏగతి పట్టిందో, అదేగతి పునరావృతం కాగల దోనేదానికి సూచికలు. కట్టుకథలు, విద్వేషాల

విషయంలో ఈ సారి రాబోయే స్కూలు పాఠ్య పుస్తకాలు పాత పుస్తకాలను మించి పోవచ్చు.

విషయాలు ఇలా ఉన్నప్పుడు ఒక శోధనా శాఖగా చరిత్రకు, ఆర్ఎస్ఎస్ ప్రాజెక్టులు అవక తవకగా సృజించిన కట్టుకథలకు మధ్య నిజమైన చర్చోపచర్చలు జరిగే అవకాశాలు కనబడడం లేదు. ఇక్కడ'బోధనా విషయపరమైన వాదోప వాదాలకు తావేలేదు. అయితే ఎన్ని అసత్యాలతో ప్రతిపాదించినప్పటికి చరిత్రను మార్చటం సాధ్యం కాదు. కాని ఇందు మూలంగా దేశపు ఆలోచనా విధానం ఘోరంగా దెబ్బతినవచ్చు.

**ప్రశ్న :- "ఆర్యుల మూలాలు" అనే వివాదాత్మక సమస్యలను చరిత్ర శోధకులు ఎలా పరిష్కరించారు? ఆర్యుల మూలం భారత దేశంలోనే ఉందనేది హిందు మితవాదులు ఎల్లప్పుడూ తీసుకుంటున్న వైఖరి. చారిత్రక ఆధారాలు దీన్ని రుజువు చేస్తాయా? చరిత్రకు సంబంధించినంత వరకు ఆర్యుల గురించి సర్వసాధారణంగా ఆమోదించబడిన సిద్ధాంతం ఏది ?**

**జవాబు : –** నిజంగానే దీర్ఘకాలం విస్తృతంగా సాగిన పరిశోధనల మూలంగా "ఆర్యుల" కు సంబంధించిన ఎంతో సమాచారం మన ముందు స్పష్టంగా ఉన్నది. "ఆర్య" దానితో ముడిపడివుండిన ఇతర పదాలకు ఇండో – యూరోపియన్ భాషలలో 'ఉత్తముడు' (నోబుల్) అని అర్ధం. "ఇరాన్" అన్నది "ఆర్య" అనే పదానికి వచన భౌగోళిక ప్రతిరూపం మాత్రమే. అయితే ఇండో యూరోపియన్ బాషలు మాట్లాడే వారికి ఆనువర్తింప చేసినది నాజీలు. వారు జర్మనులకు "అతిపరిశుద్ధ" ఆర్యుల ప్రతిపత్తిని ఆపాదించుకున్నారు. "ఇండో యూరోపియన్" భాషల మధ్య సంబంధానికి, జాతితో గాని, మతంతో గాని సంబంధం లేదన్నది స్పష్టమైన విషయం. ఆ పదం కేవలం తత్సంబంధిత బాషలు మాట్లాడే వారిని సూచిస్తుంది. రెండవది, '(ప్రోటో) పురాతన – ఇండో యూరోపియన్" భాషకు సిద్ధాంత పరంగా దగ్గర ఉన్న భాషలు, చాలా దీర్ఘకాలం తర్వాతి భాషల అవతరణా వరస క్రమాన్ని భాషాశాస్త్ర అధ్యయనాలు నిరూపించాయి. "పురాతన ఆర్యన్" లేదా "పురాతన ఇండో – ఇరానియన్" బాషలను ఋగ్వేద సంస్కృతం నుండి, అవెస్థాన్ నుండి పునర్‌నిర్మించుకోవచ్చు. నిచ్చెన మెట్లలో ఇవి హిటైట్, ఆల్బేనియన్ భాషలకంటె చాలా కింద ఉంటాయి. అందువల్ల, తొలి "పురాతన ఇండో యూరోపియన్" భాషకు భారతదేశం పుట్టినిల్లు అయివుండే అవకాశం లేదనే చెప్పవచ్చు. "ఆర్య" లేదా "ఇండో యూరోపియన్" అంటే నాగరికతకు మారు పేరని, 'ఆర్యు'లమైన మేమే విస్తరించి ప్రపంచానికి నాగరికతను నేర్పామని ఏ ఆధారము లేకుండా చెప్పుకోవడం, దాన్నో సమస్య చేయడం సరిగ్గా నాజీలు గొప్పలు చెప్పుకున్నట్లు చేసే చిన్న పిల్లల చేష్టే. వాస్తవానికి పురాతన– ఇండో యూరోపియన్ బాషల పునర్నిర్మాణం అతి ప్రాచీన స్థాయిలోని సమాజాన్ని గురించి తెలియ చెబుతుంది.

❝ నాగరికతకు మారు పేరని, 'ఆర్యు'లమైన మేమే విస్తరించి ప్రపంచానికి నాగరికతను నేర్పామని ఏ ఆధారము లేకుండా చెప్పుకోవడం, దాన్నో సమస్య చేయడం సరిగ్గా నాజీలు గొప్పలు చెప్పుకున్నట్లు చేసే చిన్న పిల్లల చేష్టే. ❞


మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు

**ప్రశ్న : – ప్రభుత్వం ఇటీవలనే న్యూ ఢిల్లీలోని ఔరంగజేబు రోడ్డుపేరును ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ రోడ్డుగా మార్చింది. హిందు వ్యతిరేక నియంతగా ప్రాచుర్యం పొందిన మొఘల్ పాలకుడి స్మృతిని తుడిచి పెట్టే ప్రయత్నంలో ఇది ఒక ముఖ్య ఘటన. ఔరంగజేబును, అతడి కాలాన్ని మీరు ఎలా మధింపు చేస్తారు? అతడిని ఒక హిందు వ్యతిరేక పాలకుడిగా ముద్ర వేయడంలో సంఘపరివార్ ఎలా విజయం సాధించింది. చరిత్ర పరిశోధనలో నిపుణులైన వారు ఈ విషయాన్ని ఎలా చూస్తున్నారు?**

**జవాబు : –** ఔరంగజేబు రోడ్డు పేరును మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నప్పుడు ఔరంగజేబు పట్ల పక్షపాతం చూపించాల్సిన అవసరం లేదు. అతడు ఇద్దరు సోదరుల్ని హత్య చేశాడు, తండ్రిని ఖైదు చేశాడు, తన ముందటి వారు అనుసరించిన మత విధానాలను కొంత మార్చాడు. వివక్షాపూరితమైన పన్ను వడ్డింపుల విధానాన్ని అవలంభించాడు – ప్రత్యేకించి, ముస్లిమేతరులపై జిజియా పన్ను విధించాడు –కొన్ని దేవాలయాలను, ధ్వంసం చేశాడు, ప్రత్యేకించి మధురలోని కేశవరాయ్ దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. మరోవంక, బృందావన్ దేవాలయం వంటి పలు దేవాలయాలకు అనేక దానాలను కొనసాగించాడు. ఇతర దేవాలయాలకు దానాలు లేదా వాటికి సదుపాయాలను కలుగచేసే ఆదేశాల ఫర్మాలు కూడా వెలుగులోకి వచ్చాయి.

అతడి పాలనా కాలంలో దేశానికి వచ్చిన విదేశీ యాత్రికులు కూడా మత ప్రాతిపదికన వేధించే ప్రభుత్వాన్ని కాక సహనాన్ని వహించే ప్రభుత్వంగా ఒక సాధారణ చిత్రాన్ని ఇచ్చారు. ఇరు పక్షాల మత మౌఢ్యవాదులు అతడి గురించి తప్పుడు చిత్రీకరణ – ఒకరి దృష్టిలో భక్తి ప్రవత్తులుగల పరమ నిష్ఠా గరిష్టుడూ, మరొకరి దృష్టిలో మత మౌఢ్యవాదిని చేశారు. ఆయన ఖాతాలో ఒక విజయం ఉంది – కొంత కాలం పాటు ఇంచుమించుగా యావత్ భారత్ దేశాన్ని ఒక రాజకీయ కేంద్రం కింద ఏకం చేశాడు, తద్వారా హిందుస్తాన్, మొఘల్ సామ్రాజ్యం ఒకటిగా అస్తిత్వాన్ని గుర్తింపచేశాడు. ఆశ్చర్యకరంగా ఈ విషయం ప్రజల చైతన్యంలో నాటుకు పోయింది. ఉదాహరణకు 1857 లో తిరుగుబాటు చేసిన సిపాయిలలో అత్యధికులు బ్రహ్మణులున్నప్పటికీ వారిలో ఇదే చైతన్యం నెలకొనివుంది.

**ప్రశ్న: హిందు దేవాలయాలను, ఉదాహరణకు వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయాన్ని, మధురలోని కృష్ణజన్మభూమి వంటి వాటిని ధ్వంసం చేసిన వాడిగా ప్రాచుర్యంలో ఉంది. ముస్లిమ్/విదేశీ పాలనకు దానికి వ్యతిరేకంగా తన వాదాలకు సమర్ధనగా సంఘ పరివారం సోమనాథ్ దేవాలయ విధ్యంసాన్ని పదేపదే ఎత్తి చూపుతోంది. దేవాలయాల విధ్వంసం అనే అంశం చుట్టు అల్లుకున్న మాయాజాలాన్ని ఛేధించడానికి చరిత్ర శోధకులు ఈటన్ ప్రయత్నించాడు. భారతీయ చరిత్రకారులు ఈ సమస్యను ఎలా పరిష్కరించారు?**

> **❝ ఔరంగజేబు పాలన చివరి కాలంలో ఆయన దళాధిపతుల్లో 30 శాతం మంది హిందువులే - ముఖ్యంగా రాజ పుట్‌లు మరాఠాలు - అని ఒక అంచనా ఉంది. మీదు మిక్కిలి, పాలకులు విదేశాలకు తరలించడానికి సంపదను కొల్లగొడుతున్న పరాయి దేశస్తులు కాదు. ❞**

**జవాబు:** ఔరంగజేబు రోడ్డు పేరు మార్చిడి మొదటి అడుగుగానే తోస్తోంది. జాతీయోద్యమం మనలో ఆ స్పృహ కల్గించే దాక భారతీయులలో ప్రజాస్వామిక చైతన్యం ఉండేది కాదు. ఢిల్లీ సుల్తానుల పాలన, మొఘల్ సామ్రాజ్యం రెండు కూడా రాచరిక పాలనలే. వారిలో ఏలికలు ఎక్కువగా ముస్లీములు కాగా, భూస్వామ్య పాలకులు (జమిందారులు) హిందువుల్లోని పై కులాలకు చెందినవారు. ఔరంగజేబు పాలన చివరి కాలంలో ఆయన దళాధిపతుల్లో 30 శాతం మంది హిందువులే – ముఖ్యంగా రాజ పుట్‌లు మరాఠాలు –అని ఒక అంచనా ఉంది. మీదు మిక్కిలి, పాలకులు విదేశాలకు తరలించడానికి సంపదను కొల్లగొడుతున్న పరాయి దేశస్తులు కాదు. దాన్ని "విదేశీ పాలన' అనటం అర్థం లేని విషయం. కట్టడాలలోను, కళారంగంలోను వారు సృజించి, మిగిల్చి వెళ్ళిన సంపద భారతదేశ పేరు, ప్రఖ్యాతులను ఇనుమడింపచేసింది.

ఇక దేవాలయముల విధ్వంసం విషయానికి వస్తే నేను రిచర్డ్ ఈటన్‌తో ఏకీభవించను గాని అతడు కూడా దాన్ని సమర్థించలేదు. మరోవంక, భారతదేశంలో ముస్లీమ్ పాలకులలో ఒకడుగా లెక్కించబడని మహమ్మద్ గజనీ సోమనాథ్ దేవాలయాన్ని ధ్వంసం చేశాడని మనం గుర్తుంచుకోవాలి. ఇక్కడ మరో విషయం ఏమిటంటే, గజనీ కూడా సంక్లిష్ట వ్యక్తిత్వం కలవాడే. అతడు తన పలుకుబడిలో ఉన్న ముస్లీం ప్రజానీకాన్ని అదుపులో ఉంచడానికి, హిందు దళాధిపతులు గల పెద్ద హిందూ సేనలను వినియోగించాడు. ఆ దళాధిపతులలో అతడికి అత్యంత ఇష్టుల్లో ఒకరైన తిలక్ అనే తాంత్రికుడు ఉండేవాడు. ఇక ఢిల్లీ సుల్తానుల విషయానికి వస్తే, వారి ఆధ్వర్యంలో ప్రసిద్ధమైన పలు దేవాలయాలు నిర్మితమయినట్లుగా తెలుస్తున్నది. 1295–98 మధ్య చివరి సారిగా పునర్నిర్మితమైన గయ లోని మహాబోధి దేవాలయం వీటిలో అతి ముఖ్యమైనది. మొఘలుల పాలనలో నిర్మించబడిన, పునర్నిర్మించబడిన దేవాలయాల సంఖ్య అసంఖ్యాకంగా ఉంటుంది. ఔరంగజేబు తన అవసాన కాలంలో రాసిన లేఖల రాతప్రతుల సంకలనాన్ని నేను చదువుతున్నప్పుడు, అతను తన కొడుకుల్లో ఒకరికి రాసిన లేఖ నన్ను బాగా ఆకట్టుకుంది. అందులో అతడు ఔరంగాబాదు పర్యటనలో ఎల్లోరా శిల్పాలను తప్పని సరిగా చూడమని తన కొడుకుకు రాస్తూ, వాటిని భగవంతుడి సృష్టిలోని అద్భుతాలలో ఒకటిగా వర్ణించాడు.

సంస్కృతికి అనేక కోణాలున్నవన్నది దృష్టిలో ఉంచుకోవాలి. 1928 కాలంలో తొలుత ప్రచురితమైన తారాచంద్ యొక్క "భారత సంస్కృతి పై ఇస్లాం ప్రభావం" అనే రచన ఈ విషయంపై ఒక ప్రామాణిక రచన. దానిలో లోపించిన ఒక విషయం, భారత దేశభక్తిని గురించి స్పష్టంగా పేర్కొన్న వివరాలు ఇపుడు వెలుగులోకి వస్తున్నాయి. దేశభక్తి భావనలు నిజమైన తొట్టితొలి వ్యక్తీకరణ భారతదేశాన్ని, దాని ప్రజలను ఇతర దేశాల కంటే మేటిగా సరిపోలుస్తూ, దాని ప్రకృతి సౌందర్యాన్ని, దాని వాతావరణాన్ని, దాని బ్రాహ్మణ పాండిత్యాన్ని, దాని భాషల గొప్పతనాన్ని, ప్రత్యేకించి సంస్కృతపు గొప్పతనాన్ని భారతీయులు ప్రపంచానికి అందించిన వరాలని, అంటే, దశాంశ పద్ధతి (హిండ్‌ఫా), చదరంగం, పంచతంత్ర కథలను ఘనంగా కీర్తిస్తూ ఒక రచన సంస్కృతంలో కాక, దిగుమతి భాషయై పారశీకంలో, ఆస్థాన కవియైన అమీర్ ఖుస్రో క్రీ.శ.1318లో రచించిన 'నూసిఫర్'లో కనిపిస్తుంది. ఇది నిజంగానే 'విదేశీపాలన'లోని ఒక వింత సృజనే కదా!

ఢిల్లీ సుల్తానులు విస్తరించిన విస్తృత భూభాగం, భారత ప్రజలలో 'పెద్ద విధేయ" భావనను పెంపొందించిందని తారాచంద్ స్వయంగా పేర్కొన్నాడు. పర్షియన్–అరబిక్ ప్రభావం పెరిగిన కారణంగా, జీవితాన్ని గురించిన నూతిలో కప్ప భావనలు తగ్గటం, ఇతర దేశాలు, సంస్కృతులను గురించి తెలుసుకోవటం పెరిగిందన్నది దీనికి మించిన విశిష్ట విషయమే.

**ప్రశ్న: మొఘల్ రాజరికం, ఢిల్లీ సుల్తానుల వంశం రెండు కూడా హిందూ వ్యతిరేక ప్రభుత్వాలేనని, అవి హిందువుల సంపదను ముస్లిములు దోచుకున్న సామ్రాజ్యాలని సంఘ పరివార్ భావిస్తోంది. మీరేమంటారు?**

**జవాబు:** ఈ ప్రశ్నలోని మొదటి భాగంపై నేను ఇప్పటికే ఎంతో చెప్పి ఉన్నాను. ఇక రెండవ భాగం హిందువులు అదనపు విలువను ఉత్పత్తి చేశారు, ముస్లిములు దాన్ని ఆరగించారు అనే విషయానికి వస్తే, మొఘల్‌ల కాలంలో గొప్ప సర్వే ఆయిన్–ఎ– అక్బరీ అనేది (క్రీ.శ. 1595)లో ప్రాంతాలవారీగా వివరణాత్మకంగా సేకరించిన జమీందారీ కులాల పట్టికను ఎవరైనా అధ్యయనం చేస్తే ఇది ఎంత అసంబద్ధ విషయమో తేలుతుంది. జమిందారీ వర్గంలో అత్యధికులు హిందువులలోని పై కులాలకు చెందినవారు. రైతాంగంలో ముస్లిములు పెద్ద భాగంగా ఉండిన బెంగాలు లాంటి తావుల్లో సైతం జమిందారులు ఎక్కువలో ఎక్కువగా ఈ కాయస్తులే ఉన్నారు. బ్రిటీషు వారు వచ్చేవరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

భారతదేశంలోని దారిద్ర్యాన్ని గురించిన ఏ విదేశీ ప్రస్తావనైనా ముస్లిములను గురించి పేర్కొనడాన్ని మినహాయించటం లేదు. ఇక భూమిశిస్తు విషయానికి వస్తే, హిందూ రైతులకు భిన్నంగా ముస్లీం రైతులకు ఎటువంటి రాయితీలు దక్కలేదు. అంతేకాకుండా, కూలిరేట్లు కూడా (అధికారిక పత్రాల పేర్కొన్న వాటితో సహా) ఆ కూలి హిందువా, ముస్లిమా అన్న దానితో మారలేదు. మొఘలుల పాలనలో ముస్లీం కులీనులు తమ భోగభాగ్యాలను అట్టహాసంగా ప్రదర్శిస్తే, దేశంలో విస్తరిస్తున్న వాణిజ్య వ్యాపారాలలో ఎక్కువ భాగం వైశ్య వ్యాపారులు, బ్యాంకర్ల అజమాయిషీలో ఉంది. వారు డిపాజిట్ బ్యాంకింగ్, బీమా రంగాలకు చెందిన విస్తృత వ్యవస్థను అభివృద్ధి చేశారు. కాబట్టి సంఘ్ పరివార్ భావనలు నిరాధారమైనవి.

**ప్రశ్న: ఢిల్లీ విశ్వవిద్యాలయపు సంస్కృత విభాగం వేదకాలంపై ఒక వర్క్‌షాపు జరపటానికి పూనుకుంటున్నది. చరిత్ర విభాగానికి చెందిన ఒక విషయంపై సంస్కృత శాఖ అంత ఆసక్తిని ఎందుకు చూపుతోంది? వేదకాలపు ఉనికికి సంబంధించిన భావనలను మార్చగల ఖగోళ శాస్త్ర అధ్యయనాలపై ఆధారపడిన కొన్ని పత్రాలను విడుదల చేస్తామని కూడా అది చెబుతోంది. హిందూ నాగరికత అన్నిటికంటే ప్రాచీనమైనదనే తమ దృక్పథానికి సమర్థనగా రుగ్వేద కాలాన్ని ఇంకా కొన్ని శతాబ్దాల వెనక్కి నెట్టాలని**

**సంఘ పరివారం నిరంతరాయంగా కృషి చేస్తోంది. చరిత్ర పరిశోధన ఏం చెబుతోంది?**

**జవాబు:** అనేక పద్ధతుల ద్వారా ఋగ్వేద కాలాన్ని గురించి ఇంచుమించు అంచనాకు రావచ్చు. అశోకుడు క్రీ.పూ. 3వ శతాబ్దంలో తన పాలనా సంవత్సరాలను శాసనాలలో వాడుకొనడానికి ముందు భారతదేశంలో, సంవత్సరాలను, తేదీలను లెక్కించే పద్ధతి ఏదీ లేదని మనం తప్పక గుర్తుంచుకోవాలి. అందుచేత వేదాలలోని శ్లోకాలలో తేదీలు లేవు. అందుచేత వాటి కూర్పు కాలాన్ని కనుగొనడానికి ఇతర పద్ధతులను అనుసరించాల్సి ఉంటుంది. ఉదాహరణకు, ఋగ్వేదం గుర్రంలాగే రథాన్ని గురించి వివరిస్తుంది. అటువంటి రథాలకు సంబంధించిన తొలి పురావస్తు పరిశోధనా సాక్ష్యం వాటిని తొట్ట తొలుతగా వాడిన రష్యా, కజికిస్తాన్ గుడ్డి మైదానాలలో కూడా, క్రీ.శ. 2000 సంవత్సరం కంటే వెనుక కనబడవు. కనుక ఋగ్వేద ఋక్కులు క్రీ.పూ. 2000 కంటే పురాతనమైనవి అయి ఉండే అవకాశాలు లేవు.

రెండో విషయం భాష. ఋగ్వేద భాష, అవేస్తాలోని భాష ఒక దానితో ఒకటి చాలా సన్నిహితంగా ఉంటాయి. మెసపొటేమియా శాసనాల కాలంలో ఇవ్వబడిన ఇలాంటి నామాలు ఆఫ్ఘనిస్తాన్ యొక్క తొలి భాగాలు. ఇంచుమించుగా క్రీ.పూ. 1000 కాలానికి చెందినవని తెలుపుతాయి. ఋగ్వేదాన్ని క్రీ.పూ. 2000 కాలం నాటిదిగా చెప్పుకోవచ్చు. దానిలో రాగి గురించి తెలుసుగాని ఇనుము ప్రస్తావన లేకపోవడం దాన్ని ప్రామాణీకరిస్తుంది. దానిలోని దేవతలు సింధు నాగరికతలోని దేవతల్లా జుమార్ఫిక్ కాదు. వారు ఆంత్రోపోమార్ఫిక్ దేవతలు. సింధు నాగరికత క్రీ.పూ. 1800ల చుట్టుపట్లనే కుప్పకూలింది. కాబట్టి, అది ఋగ్వేదానికి ఇంకొంచెం ఎక్కువ కాల పరిమితిని సూచిస్తుంది. ఋగ్వేదంలో ఖగోళ వివరాలు నామమాత్రంగానే ఉన్నాయి. కనుక ఢిల్లీ విశ్వవిద్యాలయపు సంస్కృతశాఖ, ఋగ్వేదంలో లేని దాన్ని అధ్యయనం చేస్తే తప్ప, ఏ విధమైన ఉత్కంఠను రేకెత్తించే ఫలితాలను కనుగొనే అవకాశాలు లేవు. ఇదే సందర్భంలో, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తలు ఋగ్వేదానికి అత్యంత ప్రాచీనతను ఆపాదించడానికి ఉవ్విళ్ళూరుతూనే ఉన్నారు (వారి ప్రముఖ పురాతత్వ శాస్త్రవేత్త వి.ఎస్. వాకన్కర్, దాన్ని క్రీ.పూ. 8000 నాటిదిగా పేర్కొన్నారు. అంటే అధునిక రాతియుగం (నియోలిథిక్)కాలంలో అన్నమాట! సంస్కృత శాఖ ప్రయత్నాలు ఏ ఫలితాలను ఇచ్చినప్పటికీ నేడు ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ప్రముఖుల్లో

**❝ సహజంగానే, వైదిక మతంలో జంతు బలులు (పశువులతో సహా) ఒక భాగంగా ఉన్నాయని చరిత్ర పరిశోధకులకు తెలుసు. భారతదేశపు ఆహార సాంప్రదాయాల్లో మాంసం గురించి తన రచనల్లో ప్రొఫెసర్ డి.ఎన్.ఝా తత్సంబంధితమైన విస్తృత సమాచారాన్ని ఇచ్చారు.❞**



సింధు నాగరికత కాలపు నిర్మాణం

ఆర్ఎస్ఎస్‌కు విధేయులైన శిష్యులున్నారని తేలుతోంది.

**ప్రశ్న: ఢిల్లీలోని లలిత కళా అకాడమి 'ఋగ్వేదం నుండి రోబోటిక్స్ వరకు సంస్కృతి కొనసాగింపు" అనే పేరిట ఒక ప్రదర్శనను నిర్వహిస్తోంది. రాముడు ఒక చారిత్రక వ్యక్తి, సరస్వతి నది ఇతర యుగాలలో కూడా ఉనికిలో ఉంది, మహాభారత యుద్ధం నిజంగానే జరిగింది, వంటి ఇతర సిద్ధాంతాలను రుజువు చేయడం అన్నదే ఆ ప్రదర్శన ప్రకటిత లక్ష్యం. సంఘ పరివారపు చరిత్ర శోధకులు చూపుతోన్న ఆధారాల స్వభావం ఏమిటి ?**

**జవాబు:** అదృష్టవశాత్తు రామాయణం సమస్యను, అతి చాంధసవాదిగా పేరుపొందిన ఒక చరిత్ర పరిశోధకుడు కీ.శే. ప్రొపెసర్ డి.సి.సర్కార్ "రామాయణ సమస్యలు" అనే తన రచనలో ఆ కావ్యపు సౌందర్యాన్ని ప్రశంసించి, ఆ కథనపు చారిత్రకతను తోసిపుచ్చాడు. మత పరమైన ఇతిహాసాలు, బ్రాహ్మణ లేదా యూదు లేదా ఇస్లామ్ సాంప్రదాయాలలో దేనికి చెందినవైనా వాటికి సంబంధించిన ఘటనల ఆధారంగా చరిత్రలో స్థానం ఉండదు. కాగా, ఈ ఇతిహాసాలు ఎలా పుట్టుకొచ్చాయన్నది చరిత్ర పరిశోధకులు తరచి చూడాల్సిన ఆసక్తికర అంశం.

**ప్రశ్న: దేశంలోని అన్ని ప్రాంతాలలోను మాంసాన్ని నిషేధించే కార్యక్రమంలో ప్రభుత్వం తలమునకలై ఉంది. హిందువులు మాంసాహారాన్ని తినడానికి వ్యతిరేకులని భావించటానికి ఈచర్య దారితీస్తుంది. భారత చరిత్ర అధ్యయనంలో ఆహారపు అలవాట్లు, ప్రత్యేకించి మాంసం తినడంగురించి అధ్యయనం ఎలా సాగింది?**

**జవాబు:** సహజంగానే, వైదిక మతంలో జంతుబలులు (పశువులతో సహా) ఒక భాగంగా ఉన్నాయని చరిత్ర పరిశోధకులకు తెలుసు. భారతదేశపు ఆహార సాంప్రదాయాల్లో మాంసం గురించి తన రచనల్లో ప్రొఫెసర్ డి.ఎన్.ఝా తత్సంబంధితమైన విస్తృత సమాచారాన్ని ఇచ్చారు. సర్వసాధారణంగా చెప్పాలంటే బౌద్ధం, జైనం ఆవిర్భవించిన పిదప గోవధపైనా, మాంసాహారం తినడంపైనా వ్యతిరేకత తల ఎత్తింది. కాగా క్షత్రియులలోనూ, ఇతర కింది కులాలలోనూ మాంసాహారం తినటం కొనసాగింది. ఈ విషయంపై "చరిత్రలో ఆవు"అనే వ్యాసాన్ని హెచ్.డి. సంకాలియా వ్రాశారు. (1967 సెమినార్) ప్రముఖ పురాతత్వ శాస్త్రవేత్త అయిన ఆయన స్వయంగా పచ్చి శాఖాహారేనను కుంటున్నాను.

**ప్రశ్న: చరిత్ర విభాగాన్ని ఎలా అధ్యయనం చేయాలి? ఇది ఒక అపరిష్కృత సిద్ధాంత సమస్యా? పాజిటివిస్టులు, ఉదారవాదులు, అన్నా లేస్, మార్క్సిస్టు, సబాల్ట్రెన్స్, వలసానంతర వంటి వివిధ శాఖలున్నాయి. హిందూ మితవాద చరిత్ర శోధకులు ఏ ప్రత్యేక సాంప్రదాయానైనా అనుసరిస్తారా ? చరిత్ర విభాగంలో ఒక ఆరోగ్యకరమైన అకడమిక్ చర్చకు భూమికను సమకూర్చే పలు భాష్యాలు ఉండే అవకాశాలు ఎల్లప్పుడు ఉంటూ వచ్చినపుడు, భారత చరిత్ర గురించి హిందుమత వాదుల భాష్యం పట్ల నిపుణులైన చరిత్ర శోధకులు ఎందుకు విముఖంగా ఉన్నారు?**

**జవాబు:** చరిత్రకు సంబంధించిన వివిధ సంప్రదాయాలు (స్కూల్స్) గురించి మాట్లాడినపుడు, దానర్థం చరిత్ర శోధకులు ఏ విషయంపైనా ఒక అంగీకారానికి రారనికాదు. అక్బరు

> **“స్వాతంత్ర్య పోరాటానికి ఈ పరివారాన్నించి ఒక్కరంటే ఒకర్ని కూడా హీరోలని అందించలేక పోయారు. ఒక్కరు కూడా జైలుకి పోలేదు సరికదా, కనీసం పోరాటాలు కూడా చేయలేదు. కష్టాలను ఎదుర్కోలేదు.”**

1556 గద్దెనెక్కి, 1605లో మరణించాడనే వాస్తవాన్ని లేదా అశోకుడు దమ్మాని బోధించ డానికై తన శాసనాలను ప్రాకృతం, గ్రీకు, అరామిక్ లిపులలో చెక్కించాడనే వాస్తవాన్ని ఎవరు వివాదం చేయరు.

నిజానికి ప్రాథమిక వనరులు, పురాతత్వ శాస్త్రం, ధనం, పతకాల ఆధారాలు, కార్బన్ డేటింగ్, పాలియోగ్రఫి వగైరాలతో కూడుకొని ఉండే పద్ధతుల ద్వారా నిర్ధారితమైన వాస్తవా లలో అత్యధికమైన వాటిపై వివాదానికి అంతగా అవకాశం లేదు. మార్పును అధికంగా ప్రభావి తం చేసిన కారణాలు ఏవి, అవి ఏ రకానికి చెందినవి అనే విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఈ వాస్తవాల నుండి ఎంపిక చేసుకోవాల్సి వచ్చినపుడు వచ్చే తేడాలు న్యాయబద్ధమైవే అవుతాయి. ఈ విషయంలో మీరు పేర్కొన్న సంప్రదాయాలకు ప్రాతిపదికలు, అంగీకారానికి వచ్చిన అంశాలు ఉన్నాయి. మీరు హిందు, ముస్లీం మితవాదుల గురించి గాని మరి ఇతరులను గురించి గాని ప్రస్తావించినపుడు, వారు చారిత్రక వాస్తవాలను నిర్ధారించడానికి వివిధ పద్ధతులను చేపట్టినపుడు వారు నిర్ధారించ బడిన ప్రమాణాలకు కట్టుబడి ఉన్నారా, లేదా అన్నది కూడా స్పష్టమౌతుంది. వారి రాజకీయ, సామాజిక అభిప్రాయాలు మితవాద పక్షంవైపే ఉన్నప్పటికీ, అటువంటి చరిత్ర శోధకులుగా ఆర్. సి.మజుందార్, డి.సి సర్కార్‌లను పేర్కొనవచ్చు.

మీ పదజాలంలోని “హిందు మితవాదులు” గా పిలవబడే వారు నేడు ఏం చేస్తున్నారంటే అసలు చారిత్రక పద్ధతినే తిరస్కరిస్తున్నారు. తద్వారా మజుందార్, సర్కార్‌ల వైపు చూడడం గాక, డేవిడ్‌ఫ్రాలె వంటి సాధువుల వైపు చూస్తున్నట్టుగా అగుపిస్తోంది. ఈయన చిటికవేస్తే ఏవాస్తవాన్నైన తన గారడి బుట్టలోంచి వదల గలడు. దానికి ఏ ఆధారం ఉండదు. అందుకనే ఆయనకు ఇటీవలనే పద్మవిభూషణ్ పురస్కారం అందించారు. వీరికి ప్రేరణ కలిగించే మరో వనరు “నాసా శాస్త్రవేత్త” అయిన నవరత్న రాజారామ్‌గారు గుర్రంతో కూడిన సింధు నాగరికతలోని ముద్రను చూయించి, సింధు నాగరికతకు మూల బిందువులు ఆర్యులేనని ప్రచారం చేసిన సిద్ధాంతం. ప్రొఫెసర్ మైఖేల్ విట్‌జెల్ ఫ్రంట్‌లైన్ 2000 సంవత్సరం అక్టోబర్ 13వ తేదీ సంచికలో హరప్పా నాగరి కతలో గుర్రపు స్వారీ పేరుతో ఈ మోసాలను బహిర్గతం చేశారు. అందుకనే ఇటువంటి వ్యక్తులతో చర్చలు అనవసరమైన సమయం వృధా. అయితే మీరు చెప్పిన చర్చలు జరగలే దన్నది సరికాదు. వివిధ సందర్భాలలో తగిన సమయం వచ్చినపుడు, అవసరమైన విషయాలపై చర్చలు జరుగుతున్నాయి.

**ప్రశ్న :- ఈ విషయంలో హిందుమతవాద చరిత్రకారుల సిద్ధాంతాలకు శాస్త్రబద్ధమైన లేదా హేతుబద్ధమైన రుజువులు ఏమిటి ? ముఖ్యంగా, వై.ఎస్ రావుగారి హిందూ పురాణాల మీద, రాకేష్ సిన్హాగారు భారతీయత మీద వెలిబుచ్చిన అంశాలపై మీ అభిప్రాయం ?**

**జవాబు :** నాకు తెలిసినంత వరకు బ్రిటిషు వారు పాలించిన తొలి రోజులలో ఉత్తరసర్కారు ప్రాంతంలో భూమి పంచాయితీలకు సంబంధిం చినది ప్రొఫెసర్ రావుగారి పరిశోధన. ఆయన పురాణాల మీద, ఇతిహాసాల మీద చేసిన పరిశోధనా పత్రాలు నేనింత వరకు ఎక్కడా చూడలేదు. ఇకపోతే రాకేష్ సిన్హాగారు జాతీయోద్యమం మీద రాశారని చెపుతున్న అంశాలు నేనింత వరకు గమనించలేదు.

**ప్రశ్న : ఎప్పుడు అధికారంలోకి వచ్చినా హిందూ మతవాదులు చరిత్రనే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటారు? ఇతర శాస్త్రాలను ఎందుకు చర్చించరు? వారి వాదన ప్రకారం చరిత్ర రచన అంతా వక్రీకరించబడిందని, వామపక్ష వాదు లు, కాంగ్రెస్ లౌకికవాదులు చరిత్రను రచించ డంలో ప్రధానపాత్ర పోషించడం వలన అది వక్రీకరించబడిందని, తమ గొంతు వినిపించ డానికి కుదరలేదని, అందుకే తాము దానిని సరిచేయాలని చూస్తున్నామని పేర్కొంటున్నారు. దీనికి మీ సమాధానం?**

**జవాబు :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పరివారంతో ఇదొక తలనొప్పి! వారు 1947 తర్వాత మాత్రమే జాతీయత అని అరవటం ప్రారంభించారని మనం గుర్తుంచుకోవాలి. స్వా తంత్ర్య పోరాటానికి ఈ పరివారాన్నించి ఒక్క రంటే ఒకర్ని కూడా హీరోలని అందించలేక పోయారు. ఒక్కరు కూడా జైలుకి పోలేదు సరికదా, కనీసం పోరాటాలు కూడా చేయలేదు. కష్టాలను ఎదుర్కోలేదు. అంతేకాదు, వారు స్వా తంత్ర్య పోరాటాన్ని తక్కువచేస్తూ, బ్రిటీష్ వారితో మంచిగా ఉండటానికే ఎక్కువ ప్రయత్నం చేశారు. హిందీ-హిందూ-హిందూస్థాన్ అని, హిందూ రాజ్ అమర్ హై అని పిలుపులతో కాలక్షేపం చేశారు. ఇవన్నీ దేశం ముక్కలు కావడానికి కారణాలు కాదా? పైపెచ్చు వారు ఈనాడు గాంధీని, నెహ్రూని దేశ విభజనకు కారకులుగా చిత్రీకరిస్తూ మాట్లాడుతుంటారు. ఈ విధంగా వారు తప్పుడు చరిత్రను సృష్టించి, వారే అసలైన జాతీయవాదులుగా చిత్రీకరించు కునే ప్రయత్నం చేయడమే కాక, నిజమైన జాతీయోద్యమ నాయకులపై బురద చల్లటానికి ఒడిగడుతున్నారు.

నేను ఇవన్నీ మరలా కూలంకషంగా వివరించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, 2003లోనే జాతీయ చరిత్ర కాంగ్రెస్ రిపోర్టు లోనే ఇవన్నీ వివరించాము. హిందూ మతవా దులు ఎన్.సి.ఇ.ఆర్.టి పాఠ్య పుస్తకాలలోనే చరిత్రను ఎలా మారుస్తున్నారో వివరించాము.

ఎప్పుడయితే వారి అసంబద్ధ వాదనలు, వారి చరిత్రలోని నిజానిజాలు బట్టబయలు చేసి చూపించామో అప్పుడల్లా ఆర్.ఎస్.ఎస్, వారి సేవకులు వామపక్షవాదులు చరిత్ర మొత్తాన్ని వక్రీకరించారనే వాదనను లేవనెత్తుతుంటారు. వామపక్షవాదులు రచించిన చరిత్ర కాబట్టే ఆర్యుల జన్మస్థలం భారతదేశమేనని అంగీకరిం చకపోవటానికి గల కారణమని వాదిస్తుంటారు. నేను వారిని ఒక్క ప్రశ్న సూటిగా అడుగుతు న్నాను. ప్రఖ్యాత చరిత్రకారులైన ఆర్.సి. ముజుం దార్, తారాచాంద్, ఈశ్వరీ ప్రసాద్, ఎన్.కె. సిన్హా, డి.సి. సర్కార్, ఆర్.ఎన్. ముఖర్జీలలో ఒక్కరన్నా వామపక్షవాదులు ఉన్నారేమోచూపించ మనండి. వీరంతా వారి వారి దృక్పథాలలో చరిత్రను ఎవరి కోణంలో వారు అధ్యయనం చేసి రచించిన వారే. కానీ వీరందరూ రచించిన చరిత్రలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తన జెండా ఎగురవేయటానికి ఏమీ కన్పించక పోవటమే అసలు కారణం. అందుకే వారికంత అసహనం. అనువాదం : **ఎల్.ఎస్. భారవి**

# మహా నగరాల్లో ధనికులకు అవసరమౌతున్న మురికివాడల నివాసులు

సిద్ధేశ్వర్ శుక్లా

ఇరవై ఒక్కటో శతాబ్దంలోకి ప్రవేశించిన భారతదేశంలో మురికివాడలలో 6 కోట్ల 50 లక్షల మంది ఉన్నారు. 2017 నాటికి 10కోట్ల 40 లక్షలకు చేరతారనిఅంచనా. 2011లో విడుదలైన సెన్సెస్ రిపోర్టు ప్రకారం మెట్రో నగరాలలో అది అత్యంత ప్రమాదకరంగా పెరుగుతోంది. చిన్న పట్టణాలలో కూడా మురికి వాడలు వేగంగా పెరుగుతున్నాయి. అంతేకాదు ఈ పట్టణ జనాభాలో అవి దాదాపు 62 శాతం దాకా పెరిగాయి. ఇది కేవలం జనాభా ఎక్కువైపోయిన పట్టణ ప్రాంతాల్లో, ఆక్రమణలకు గురైె అనధికార కట్టడాలు, మురికి వాడలపై జరుగుతున్న గెలుపులేని పోరాటం మాత్రమే కాదు... అత్యంత ఖరీదైన, అభివృద్ధి చెందిన, అత్యంత తక్కువ జనసాంద్రత ఉన్న మహా నగరం ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. అత్యంత ప్రముఖులు ఉండే విఐపి కాలనీల వెనుక, కేంద్ర మంత్రుల నివాసాల వెనుక, ప్రముఖ ఆసుపత్రులు, హోటళ్ళ వెనుక దాచబడి ఉన్నాయి. ప్రజాస్వామ్యం భారతదేశంలో పరిఢవిల్లిన క్షణం నుండి విధాన నిర్ణయకర్తలకు ఈ మురికి వాడలలోని జీవన స్థితిగతులు ఒక పెద్ద సవాలుగా ఉన్నాయి. రోజు రోజుకీ ఈ మురికివాడల సంఖ్య, అందులో పెరుగుతున్న జనాభా, వారి సమస్యలు అధికమౌతూనే ఉన్నాయి.

న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ఏరియాలో అత్యంత సంపన్నవంతమైన ప్రాంతంగా గుర్తింపబడిన చోట మురికివాడల స్థితిగతులు, ప్రజల జీన విధానంపై అధ్యయనం చేసి సమర్పించిన పత్రం ఇది. ఈ ఏరియాలోని నాలుగు మురికివాడలలో సర్వే చేసి, అలాగే అనేక ప్రభుత్వ కార్యాలయాల ద్వారా, ఢిల్లీ అర్బన్ షెల్టర్ అభివృద్ధి బోర్డ్ ద్వారా మరియు సమాచార హక్కుచట్టం ద్వారా సంపాదించిన అంశాలతో కలిపి క్రోడీకరించిన పత్రం ఇది. అంతేకాకుండా, అసలు మురికివాడలు పట్టణ ప్రాంతాల మౌలిక వసతులపై భారం అవుతున్నాయో లేక కారుచౌకగా దొరికే మానవ వనరులను అవే ఇరికించి ఉంచాయా అనే విషయంపై పరిశీలన జరిగింది.

### ల్యూటెన్స్ ఢిల్లీలోని మురికివాడలు

న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ఏరియా దేశ రాజధాని ప్రాంతం (ఢిల్లీ)లో మధ్య ప్రాంతంలో నెలకొని ఉంది. ఢిల్లీ విస్తీర్ణంలో మూడు శాతం విస్తీర్ణం కలిగిన ఈ ప్రాంతం2.57 లక్షల ప్రజలకు ఆవాసంగా ఉండి పౌర సేవలను అందిస్తోంది. ఢిల్లీ జనాభాలో ఇది మూడు శాతంగా ఉంది. వీటినే జిగ్గీ జోఫ్రి నమూనాలు అంటారు. 1951 నుండి ఇవి కొనసాగుతున్నాయి.

వీరందరికీ సరియైన ప్రత్యామ్నాయాలను చూపలేకపోవడం, పాలకవర్గాల ఉదాసీన వైఖరి, సరియైన ప్రణాళికలు లేకపోవడం వలన అవి రోజు రోజుకీ విస్తీర్ణంలోనూ, సంఖ్యలోనూ పెరుగుతూనే వచ్చాయి. 2007 నాటికి ఢిల్లీ నగరంలో ఇటువంటి జగ్గీజాఫ్రీ సమూహాలు 38కి పెరిగి, ప్రతిదాంట్లో జనాభా 10,867కి పెరిగింది. పద్నాలుగు హెక్టార్ల విస్తీర్ణంలో ఇవి ఉన్నాయి. 2011 సెన్సెస్ ప్రకారం ఎన్.డి.ఎమ్.సి. ఏరియాలో మురికివాడల జనాభ 20,002. ఇందులో 56 శాతం మంది పురుషులు ఉన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న 31 మురికివాడల విస్తీర్ణం 1.25 లక్షల స్వేర్ మీటర్లు. దాని ఖరీదు 8,433 కోట్లు. ఈ 31 మురికివాడలలో, 6 మురికివాడలు ప్రధానమంత్రి నివాసానికి సుమారు 1.5 నుండి 2 కిలోమీటర్ల దూరంలో, మరొక పది మురికివాడలు పార్లమెంట్ భవనానికి కేవలం 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.

1991లోనే ఢిల్లీ పాలనా యంత్రాంగం పది సంవత్సరాల కాలంలో ఢిల్లీ నగరాన్ని మురికివాడల రహిత నగరంగా మార్చడానికి ప్రణాళిక సిద్ధం చేసి, అమలుపరచటం ప్రారంభించింది. 2007లో అమలుకు నోచుకున్న ఢిల్లీ మాస్టర్ ప్లాన్ 2021లో కూడా ఇదే ప్రాధాన్యత ఇవ్వబడింది. ప్రత్యామ్నాయ ప్రాంతాలను అభివృద్ధి చేయటం, వీటన్నింటినీ తరలించటం అనే ప్రాధాన్యతతో అవి రచించబడ్డాయి. జాతీయ కార్యక్రమాలైన జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. రాజీవ్ ఆవాస్ యోజన, ఎన్.హెచ్.హెచ్.పి. 2007 వంటి పథకాల ద్వారా కూడా ఢిల్లీని మురికివాడల రహిత నగరంగా మార్చాలని ప్రణాళిక రచించారు. ఈ రకమైన సూక్ష్మ స్థాయి ప్రణాళికలతో న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ 21వ శతాబ్దం ప్రారంభం నాటికి ఢిల్లీ నగరాన్ని మురికివాడల రహిత నగరంగా మార్చాలని కలలు కన్నది. కానీ 2007లోనే అందుకు అవసరమైన బృహత్తర ప్రణాళిక (బ్లూప్రింట్)ను తేగలిగింది. 2007లో ఏర్పడిన సబ్‌సిటీ ప్లాన్ ద్వారా ఎన్.డి.ఎమ్.సి. 2010లో జరగనున్న కామన్‌వెల్త్ క్రీడల ప్రారంభానికి ముందే ఈ పనిని పూర్తి చేయాలని భావించింది. 2007లో ఆ పనిని ప్రారంభించేనాటికి 38 మురికివాడలు ఉన్నాయి. అందులో నివాసయోగ్యంగా ఉన్నది 31. ఇవికాక ఇంకా అనేక చిన్న చిన్న జగ్గీజాఫ్రి క్లస్టర్లు ఉన్నాయి. వీటికి ఎటువంటి పౌర సేవలు అవసరం లేదు. అందువలన అవి అధికారికంగా ప్రభుత్వం రికార్డులలో కూడా లేవు.

### మురికివాడలలో చవకగా దొరికే కార్మిక శ్రమ ఎన్.డి.ఎమ్.సి.కి ఎలా లాభం తెచ్చిపెడుతోంది?

2014 అక్టోబర్ 17 నాటికి న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్‌లో అందుబాటులో ఉన్న మానవ వనరులు సరిగ్గా ఇరవై రెండు వేలమంది ప్రజలు. ఇందులో 5400 మంది గ్రూప్–డి స్థాయి ఉద్యోగులు. వీరిలో 90 శాతం మంది వృత్తి నైపుణ్యం కలవారు. వీరందరూ సుమారుగా నెలకు 6,000 నుండి 20,200 రూపాయల వరకు సంపాదించే రకరకాల గ్రేడ్‌లలో ఉన్నారు. సుమారు 18 వేల నుండి 21 వేల రూపాయల వరకు నెలసరి వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కూడా పొందుతున్నారు. ఎన్.డి.ఎం.సి.లో గ్రూప్ డి ఉద్యోగుల కోసం 1379 సింగిల్ రూమ్ ఫ్లాట్స్ ఉన్నాయి. మిగతా వారందరికీ హౌసింగ్ అలవెన్స్ ఇవ్వబడుతుంది. కానీ అది నామమాత్రంగా ఉండటంతో ఆ అద్దెతో పని ప్రాంతంలో చుట్టుప్రక్కల ఎక్కడా ఇళ్ళు దొరకవు. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ 2014లో టెంపరరీ మస్టర్ రోల్ కార్మికులలో, 1999 నుండి 2014 మధ్యకాలంలో 500 రోజుల పనిని పూర్తిచేసిన వారందరినీ రెగ్యులైజ్డ్ మస్టర్ రోల్ కార్మికులుగా పదోన్నతి కల్పించాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదనకు పదకొండు వేల దరఖాస్తులు వచ్చాయి. అందులో

**" దీనివలన మనకి అర్థమయ్యేదేమిటంటే ఢిల్లీ కౌన్సిల్ ఒక గ్రూప్-డి ఉద్యోగిని తీసుకుంటే ఎంత ఖర్చు అవుతుందో అదే ఖర్చుతో ఎటువంటి అదనపు సదుపాయాలు కల్పించే అవసరం లేకుండా ఇద్దరు టి.ఎం.ఆర్. లు-ఆర్.ఎం.ఆర్.లు దొరుకుతున్నారు. "**

4500 మందికి ఆర్.ఎం.ఆర్.లుగా పదోన్నతి కల్పించారు. ఇదంతా 2014 లోక్‌సభ ఎన్నికల ముందు జరిగింది. ఇంకొక 500 మందిని వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టారు. సుమారు 710 మంది ఆర్.ఎం.ఆర్.లను పర్మినెంట్ ఉద్యోగులుగా తీసుకున్నారు. ఈ టి.ఎం.ఆర్. మరియు ఆర్.ఎఫ్.ఆర్. కార్మికులు సాధారంగా భవన నిర్మాణాలలో, వాటి నిర్వహణ పనిలోనూ, స్వీపర్లు, దోమల నివారణ, వీధి కుక్కలు, కోతులు లేదా ఇతర జంతువులను పట్టే వారిగా, తోటపని, బంట్రోతులు, పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తుంటారు.

ఈ టి.ఎం.ఆర్, ఆర్.ఎం.ఆర్. కార్మికులు పదోన్నతి పొందక ముందు కాలంలో నైపుణ్యం లేనివారికి రోజుకి 279 రూపాయల నుండి 311 రూపాయల వరకు, నైపుణ్యంగల కార్మికులకి రోజుకి 339 రూపాయల నుండి 377 రూపాయల వరకు ఇస్తారు. దీనివలన మనకి అర్థమయ్యేదేమిటంటే ఢిల్లీ కౌన్సిల్ ఒక గ్రూప్-డి ఉద్యోగిని తీసుకుంటే ఎంత ఖర్చు అవుతుందో అదే ఖర్చుతో ఎటువంటి అదనపు సదుపాయాలు కల్పించే అవసరం లేకుండా ఇద్దరు టి.ఎం.ఆర్. లు-ఆర్.ఎం.ఆర్.లు దొరుకుతున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు అడిగితే 18 రకాల డిపార్ట్‌మెంట్లలో కేవలం మూడు డిపార్ట్‌మెంట్లు మాత్రమే సమాధానం ఇచ్చాయి. ప్రజారోగ్యశాఖ, హార్టికల్చర్, సివిల్ ఇంజనీరింగ్ వారు 2012-13, 2013-14 సంవత్సరాలలో వారి దగ్గర పనిచేసిన వారి వివరాలు ఇచ్చారు. 2012-13లో ఈ మూడు డిపార్ట్‌మెంట్లవారు కలిసి 3907 మంది కాంట్రాక్ట్ కార్మికులు, 695 మంది ఆర్.ఎం.ఆర్.లను నియమించి 9,05,47,000 రూపాయలు ఖర్చుచేశారు. అదే 2013-14లలో 12,280 కాంట్రాక్ట్ కార్మికులు మరియు 5,115 ఆర్.ఎం.ఆర్.లతో పని చేయించుకొని రూ. 147,92,20,000 రూపాయలు ఖర్చు చేశారు.

2012-13లో తీసుకున్న 695 ఆర్.ఎం.ఆర్.ల స్థానంలో శాశ్వత ఉద్యోగులను ఢిల్లీ కౌన్సిల్ తీసుకొని ఉంటే, వారికే 13 కోట్ల 93 లక్షల రూపాయల నుండి 16 కోట్ల 25 లక్షల రూపాయలు ఖర్చయ్యేవి. 2013-14లో తీసుకున్న 5115 ఆర్.ఎం.ఆర్.ల స్థానంలో శాశ్వత ఉద్యోగులను తీసుకుంటే రూ. 110 కోట్ల 48 లక్షల రూపాయల నుండి 128 కోట్ల 89 లక్షల రూపాయలు ఖర్చయ్యేది. ఇవికాక శాశ్వత ఉద్యోగులకుండే అదనపు సౌకర్యాలు కల్పించాల్సి ఉండేది.

ఈ రకంగా పరిశీలన చేస్తే, మురికివాడల మానవ వనరులు పట్టణ మౌలిక వనరుల కల్పనకు భారంగా ఉన్నాయని, రాజకీయ పార్టీలకు ఓటు బ్యాంక్‌గా ఉన్నాయనేవి కేవలం పాక్షిక దృక్పథమే అవుతుంది. అంతకంటే ఎక్కువ లాభాలు ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ఈ మానవ వనరుల సేవల ద్వారా పొందుతోంది. ఢిల్లీలాంటి నగరాలలో ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రయివేటు ఆఫీసులకు, ఆసుపత్రులకు, మానవ వనరులు అత్యంత కారుచౌకగా లభ్యమయ్యే కర్మాగారాలు ఈ మురికివాడలు. వీరే కాకుండా కొన్ని వేలమంది రోజువారి పనివారుగా ఏజెన్సీలద్వారా, ప్రభుత్వ ఏజెన్సీల ప్రాజెక్టుల నిర్మాణంలో, సెక్యూరిటీ ఏజెన్సీలు, మానవ వనరులు శాఖలు ఉన్న కంపెనీలద్వారా, ప్రభుత్వకార్యాలయాలలో, ప్రయివేటు పరిశ్రమ లకు, విదేశీ మిషన్లు, ప్రాంతాలకు, పారిశుధ్యం, స్వీపింగ్, సెక్యూరిటీ గార్డులుగా పంపబడు తున్నారు.

**మురికివాడలలో సర్వే...**

2014లో జులై నుండి ఆగస్టు వరకు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్‌లో ఉన్న నాలుగు మురికివాడలను ఎంచుకొని, అక్కడి నుండి అందింపబడుతున్న మానవ వనరులను, వారి ఆర్థిక సామాజిక స్థితిగతులను అధ్యయనం చేయటం జరిగింది. ఈ మురికివాడలను రెండు భాగాలుగా విడగొట్టి సర్వే చేశాము. మీడియాలోనూ, రాజకీయ చర్చల ద్వారా వచ్చిన విశ్లేషణలను బట్టి ఈ ఏరియాలలో ఒక్కొక్క ప్రాంతాన్ని ఎంపిక చేయడమైనది. అందులో ఉన్నవి, బైయ్యారామ్ కాంప్ (రేస్ కోర్స్ క్లబ్ సెక్టార్-1), బంగ్లా నెం. 2 వెనుక ఉన్న మురికి వాడ, తుగ్లక్ లేన్ (సెక్టార్-2) రాజు కాంప్, (-33, హాప్లాట్ సెక్టార్, కార్‌బరీమార్గ్ మరియు జె1 క్లస్టర్, డైరీ నెం.95, కాల్‌బరీ మార్గ్ (3-4). వీటన్నింటిలో సుమారు 305 నివాస గృహాలలో 765 మందిని విశ్లేషించడమైంది. ఇందులో 509 మంది రోజువారీ పనిలో ఉన్నారు. మిగతా 33.44 శాతం మందిలో ఏ పని లేనటువంటి మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు ఉన్నారు.

**మానవ వనరుల ప్రవాహం...**

ఈ శ్రామికవర్గం మొత్తాన్ని వారి యజమానుల ఆధారంగా ఆరు కేటగిరీలుగా విభజించడమైనది. ప్రభుత్వరంగంలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఇంటిపనివారు, క్లబ్‌లలో పనిచేసేవారు, ప్రయివేటురంగం, స్వయం ఉపాధి కలిగిన వారు. ఇతర కేటగిరీలలో షాపు వర్కర్లు, వీధి వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, ఈ-రిక్షాడ్రైవర్లు, ఐస్‌క్రీమ్ అమ్మేవారు, ఎలక్ట్రీషియన్లు, ట్యూటర్లు, మెకానిక్‌లు, ప్లంబర్లు తదితరులు ఉన్నారు. మొత్తం శ్రామికవర్గంలో 9.23 శాతం మంది ప్రభుత్వరంగంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు, 84 శాతం మంది ఔట్ సోర్సింగ్ వారు, 11.2 శాతం ఇంటిపనివారు 14.34 శాతం మంది క్లబ్బులలోను, 38.5 శాతం మంది ప్రయివేటు రంగంలోనూ, 18.95 శాతం మంది స్వయం ఉపాధిలోనూ ఉన్నారు. ఈ మొత్తం మానవ వనరులలో మహిళల శాతం కేవలం 22 శాతంగా ఉంది. ఇందులో 54 శాతం మంది ఇంటి పనివారలుగా ఉన్నారు. 36.17 శాతం మంది ప్రభుత్వ రంగంలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఉన్నారు. 8.25 శాతం మంది క్లబ్బులలో చేస్తారు. ఈ క్లబ్బులలో పని చేసేవారిలో ఎక్కువ మంది మురికివాడలలో చౌకగా దొరికే శ్రామికులు ఉన్నారు. మచ్చుకి రేస్‌కోర్స్ క్లబ్, రైడింగ్ క్లబ్, ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్, రైల్వే ఫ్లయింగ్ క్లబ్ లాంటివాటికి అత్యంత సాధా రణంగా వనరులను అందించే సాధనాలుగా ఉన్నాయి.

మొదటి కేటగిరీకి చెందిన మురికి వాడల నుంచే దాదాపు 53.4 శాతం మంది ఢిల్లీ రేస్‌కోర్స్ క్లబ్‌లో ఉన్న గుర్రాలను సంరక్షించేందుకు వినియోగిస్తున్నారు. కేవలం 0.75 శాతం మంది మాత్రమే ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి పనివారుగా ఉన్నారు. రెండో కేటగిరీ నుంచి 19.39 శాతం మంది ఇంటిపని

వారుగా చుట్టుప్రక్కల ఇళ్ళల్లో, బంగ్లాలలో, అపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్నారు. ఇందులో 74.19 శాతం మంది మహిళలే. ప్రయివేటు రంగంలో పనిచేసేవారిలో ఎక్కువ మంది హోటళ్ళలో వెయిటర్లుగా, పరిశ్రమలలో కార్మికులుగా, ఎకౌంట్స్ సహాయకులుగా, బ్యూటీపార్లర్స్, హాస్పటల్స్‌లో స్వీపర్లుగా, గార్డ్స్, సేల్స్‌బాయ్స్, డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఇక మూడవ కేటగిరీలో 45.05 శాతం శ్రామిక జనం స్వయం ఉపాధిలో ఉన్నారు. కారణం ఈ మురికి వాడల చుట్టూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకి సంబంధించిన రెసిడెన్షియల్ ప్లాట్స్ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బీహార్ నుంచి వలస వచ్చిన శ్రామికులు మొదట్లో వీరికి సేవలను అందించేవారుగా వచ్చినా, క్రమేణా ఇక్కడే స్థిరపడిపోయారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే వీరి సేవలను వినియోగించేవారిలోఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ రెండవ స్థానంలో ఉన్నది. దాదాపు 32.91 శాతం మందిని నేరుగా వినియోగించుకుంటోంది. ఇందులో 51.72 శాతం మంది బేల్దార్లుగా, కాంట్రాక్ట్ కార్మికులుగా పి.ఎం.ఆర్.లుగా ఉన్నారు. 46.67 శాతం మంది మహిళలు పి.ఎం.ఆర్.లుగా, 36.71 శాతం మంది ఆర్.ఎం.ఆర్.లుగా ఉన్నారు. సెక్టార్-3లో ఉన్న వి.ఎం.ఆర్. టి.ఎం.ఆర్. లందరూ ఎన్.డి.ఎం.సి.లోని సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నారు. అది ఎంతగా పాతుకుపోయిందంటే ఒక డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే బేల్దార్లందరూ ఒకే మురికివాడలో నివసించేలా తయారైంది. ప్రభుత్వ ఆరోగ్యశాఖలో పనిచేసే బేల్దార్లందరూ పహార్ గంజ్ మురికివాడలో, సివిల్ ఇంజనీరింగ్‌వారు పంచుకుయాన్ రోడ్, పాలికాథామ్ మురికివాడలలో ఉంటున్నారు. అందువలనే ఈ మురికివాడల నుండి ఉత్పన్నమయ్యే మానవ వనరుల ప్రవాహాన్ని గమనిస్తే అర్థమయ్యేది ఒక్కటే. ఎవరికైతే వీరివలన అత్యంత లాభదాయంగా ఉందో వారే వీరి రాకను స్వాగతించి, వారిక్కడే వృద్ధి చెందేలా చూసుకొని, తమకు కావల్సిన శ్రామికశక్తిని నిరంతరం చవకగా పొందేందుకు కృషి చేస్తున్నారు.

**మురికివాడల ఆర్థిక, సామాజిక స్థితిగతులు...**

ఈ మురికివాడలలోని ఎక్కువ శాతం మానవ వనరులను ఉపయోగించుకునేది ప్రభుత్వ కార్యాలయాలే. నైపుణ్యంలేని ఈ మొత్తం శ్రామికవర్గంలో 81.34 శాతం మంది నైపుణ్యంలేని కార్మికులే ఉన్నారు. 10.41 శాతం మంది కొద్దిగా నైపుణ్యం కలవారు, 8.25

**" ఈ మురికివాడలలోని ఎక్కువ శాతం మానవ వనరులను ఉపయోగించుకునేది ప్రభుత్వ కార్యాలయాలే. నైపుణ్యంలేని ఈ మొత్తం శ్రామికవర్గంలో 81.34 శాతం మంది నైపుణ్యంలేని కార్మికులే ఉన్నారు. 10.41 శాతం మంది కొద్దిగా నైపుణ్యం కలవారు, 8.25 శాతం మంది నైపుణ్యం కలవారు. "**



ఢిల్లీ నగరంలోని ఒక మురికివాడ

శాతం మంది నైపుణ్యం కలవారు. కాంట్రాక్ట్ కార్మికులుగా ప్రభుత్వరంగంలో ఉన్నవారిలో 91.49 శాతం మంది నైపుణ్యం లేనివారు, మొత్తం ప్రభుత్వ కార్యాలయాలలో ఉన్న ఔట్ సోర్సింగ్ కార్మికులు కూడా నైపుణ్యం లేనివారు. 98.61 శాతం మంది నైపుణ్యం లేనివారే. అంతేకాదు ఎవరైతే మొదటిసారిగా వచ్చి ఇక్కడ స్థిరపడ్డారో వారిలో ఎక్కువశాతం ప్రభుత్వ కార్యాలయాలు, క్లబ్బులు, నివాస గృహాలలో పనిచేస్తున్నారు. తరువాత వచ్చిన తరాలు ముఖ్యంగా యువతరం కొద్దిగా చదువు ఉండటం వలన ప్రయివేటు రంగంలో పనిచేస్తున్నారు. 23.72 శాతం మంది వార్షిక ఆదాయం 18,000 రూపాయలు, 43.2 శాతం మందికి 18,000 రూపాయల నుండి 36,000 రూపాయలుగాను, 26.8 శాతం మందికి 36,000 రూపాయల నుండి 60,000 రూపాయలుగాను, 60.96 శాతం మందికి 60, 000 రూపాయల నుండి 1,20,000 రూపాయల వరకు ఉంది. అందువలన శ్రామి కుడి సగటు వార్షిక ఆదాయం, యజమానులను పరిశీలిస్తే, ప్రభుత్వరంగం, ప్రభుత్వ కార్యాల యాలు, గృహాలు, క్లబ్బులకు చెందిన యాజ మాన్యం అత్యంత చవకగా శ్రామికశక్తిని పొంది లాభపడతున్నారనేది సుస్పష్టం. ఢిల్లీ నగర పౌరుని సగటు వార్షిక ఆదాయం 2012-13 పరిశీలిస్తే అది సుమారు రూ.2,01,083గా ఉంది. దీనితో పోలిస్తే మురికివాడల శ్రామికవర్గ ఆదాయం చాలా తక్కువగా ఉందనేది సుస్పష్టం.

ఇక వారు నివసించే గృహాలను పరిశీలిస్తే, సగటు భారతీయుడికి ఉండాల్సిన 102 చదరపు అడుగులు కూడా వారికి లేదు. 98.32 శాతం ఇంతకన్నా తక్కువ స్థలంలో నివసిస్తున్నారు. 13.78 శాతం గృహాలలో సగటు మనిషికి ఉన్న స్థలం 12 చదరపు అడుగులు. 2.01 శాతం ప్రజలు కేవలం 6 చదరపు అడుగులు స్థలంలో ఉంటున్నారు. ఈ మురికివాడలలో ఉన్న గుడిసెలు ప్రధానంగా టార్పాలిన్, ప్లాస్టిక్ షీట్స్, పాలిథిన్ షీట్స్‌తో కట్టబడి ఉన్నాయి.

సగటున 215 మందికి ఒక టాయిలెట్ ఉంది. సెక్టార్ ఒకటిలో 5 వేల మందికిగాను 466 యూనిట్స్ ఉన్నాయి. అందులో 4 మగవారికి 16 మహిళలకు ఉన్నాయి. నాలుగు

**❝ఎన్.డి.ఎం.సి.లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు కేవలం తమకి చౌకగా దొరికే మానవ వనరుల కోసం, ఢిల్లీలాంటి అత్యంత ఖరీదైన నగరంలో వారికి ఎటువంటి సదుపాయాలు కల్పించకుండా వాడుకుంటున్నారు. మురికి వాడల పునరావాసం రాజకీయ పార్టీల మధ్య పెద్ద చర్చకు దారితీస్తోంది.❞**

బహిరంగ స్నానపు గదులు ఉన్నాయి. అలాగే సెక్టార్-2లో 130 క్లస్టర్స్‌లో 400 మందికి మూడు మగవారికి, నాలుగు మహిళలకు ఉన్నాయి. తగినంతగా టాయిలెట్స్ లేకపోవడం వలన చాలామంది మురికివాడలలో ప్రవహించే కాలువలలో బహిరంగ మలవిసర్జన చేయటం వలన దుర్గంధపూరిత వాతావరణం అంతటా వ్యాపించి ఉంది. పారిశుధ్యం చాలా అధ్వాన్నంగా నిర్వహించబడుతోంది. రోడ్లు కూడా చాలా చిన్నవిగా ఉంటాయి. 1.5 నుండి 2 అడుగులు వెడల్పుతో ఉంటాయి. 38 శాతం గృహాలకి మంచినీటి సౌకర్యం కుళాయిల ద్వారా జగ్గీల ముందు ఏర్పాటు చేశారు. మిగతా వారందరూ బహిరంగ కుళాయిలు, బోరుపంపుల ద్వారా ఏర్పాటు చేసుకోవాలి.

ప్రభుత్వ ఏజెన్సీలు కుమ్మక్కైపోవడం, అవినీతి, ఓటుబ్యాంకు రాజకీయాలు కలిసి న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ప్రణాళిక అయిన మురికివాడల రహిత నగరం లక్ష్యం పూర్తిగా విఫలమైంది. 2007లో ప్రారంభించిన సబ్-సిటీ ప్లాన్ అమలు తర్వాత ఇప్పటికీ ఏడు మురికివాడలను తరలించగలిగారు. అదికూడా పాక్షికంగానే. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి కేటాయించే సింగిల్ బెడ్ ప్లాట్లకు అర్హతలేనివారు అక్కడే నివసిస్తున్నారు. అర్హత ఉండి వెళ్ళినవారిలో కొంతమంది ఉపాధికోసం మరలా ఇక్కడికే రావటం లేదా కొత్తగా వచ్చిన వలసదారులకి తమ ఇల్లు అద్దెకు ఇవ్వటం జరుగుతోంది.

మేము సర్వేచేసిన నాలుగు మురికివాడలలో రెండింటికి పునరావాస కేంద్రాలకు తరలించటం, మురికివాడను తొలగించటం, తిరిగి మురికివాడలు స్థిరపడిన చరిత్ర ఉంది. మిగతా రెండూ కొత్తగా ఏర్పడినవి. సెక్టార్ ఒకటి 1947లో ఏర్పడింది. అప్పుడు రేస్‌కోర్సు క్లబ్ కోసం పనిచేసే కార్మికులకి 15 నుండి 20 టెంట్లు వేయబడ్డాయి. వారందరూ పాకిస్తాన్ నుండి వలస వచ్చినవారు. 1976లో ఉన్న 250 గృహాలలో 150 మందిని తూర్పు ఢిల్లీలోని ఖిరీపూర్ ఏరియాకు తరలించారు. 87 గృహాలను కొనసాగించారు. వీరందరూ రేస్‌కోర్సు క్లబ్‌కి మానవ వనరుల సరఫరాదారులుగా మిగిలారు. అలాగే సెక్టార్ 4లో గృహాలను 1976లో నిర్మూలించి, తూర్పు ఢిల్లీలోని ఘదోలీ డెయిరీ ఫామ్ దగ్గర పునరావాసం కల్పించారు. కానీ తర్వాత కాలంలో ఖాళీగా ఉన్న ఈ ప్రాంతాన్ని వేరే వలసవాదులు నెమ్మదిగా ఆక్రమించారు. సెక్టార్-2 మటుకు 1980ల్లో ఏర్పడింది. చుట్టు ప్రక్కల బంగళాల్లో పనిచేసేవారు ఎన్.డి.ఎం.సి. ఏరియాలోని 1400 చదరపు మీటర్ల స్థలాన్ని ఆక్రమించి ఇళ్ళను ఏర్పాటు చేసుకున్నారు. సెక్టార్-3 1990ల్లో కేంద్ర ప్రజాపనుల శాఖకు చెందిన 1200 చదరపు మీటర్ల స్థలంలో ఏర్ప డింది. ఈ భూమి విలువ 77.4 కోట్లు. కంప్ట్రో లర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) రిపోర్టు ప్రకారం ఢిల్లీ అర్బన్ డెవలప్‌మెంట్ బోర్డు ఎటువంటి దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించలేదని, ఈ మురికివాడల అభివృద్ధికి సంవత్సర ప్రణాళికలను కూడా కలిగి లేదని విమర్శించటంతోపాటు, 19 కోట్ల 44 లక్షల రూపాయల కుంభకోణం కూడా జరిగిందని బయటపెట్టింది.

**ముగింపు, చర్చనీయాంశాలు**


సమాజంలో చౌకగా మానవ వనరులను అందిస్తున్న అట్టడుగువర్గాల అవసరాలకు, ఇప్పుడు అందుబాటులో ఉన్నవాటికి మధ్య ఉన్న వ్యత్యాసమే మురికివాడల పెరుగుదలకు ప్రధాన కారణం. వీరినుంచి లాభం పొందుతున్న వారందరూ ఆ లాభాలను కొనసాగించాలనే చూస్తున్నారు తప్ప, ఏ ఒక్కరూ కూడా వీరికి బాధ్యత వహించి, వారికి కావాల్సిన మౌలిక వసతులను కల్పించడానికి ముందుకు రావడం లేదు. ఎన్.డి.ఎం.సి.లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు కేవలం తమకి చౌకగా దొరికే మానవ వనరుల కోసం, ఢిల్లీలాంటి అత్యంత ఖరీదైన నగరంలో వారికి ఎటువంటి సదుపాయాలు కల్పించకుండా వాడుకుంటున్నారు. మురికివాడల పునరావాసం రాజకీయ పార్టీల మధ్య పెద్ద చర్చకు దారితీస్తోంది. అలాగే వారి ఎన్నికల మ్యానిఫెస్టోలో కనిపిస్తుంది. కాని ఎన్నికలు అయిపోగానే అవికూడా కంచికి చేరతాయి.

ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న వివక్ష, అవినీతి, పట్టణ ప్రాంత పేద ప్రజానీకానికి నివాసాలు కల్పించలేకపోవటం, ఆర్థికంగా వెనుకబడిన, తక్కువ ఆదాయం కలిగిన వారికి కనీసం 20 నుండి 25 శాతం నివాస వసతులు కల్పించాలని రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు విధించిన నిబంధనలు అమలు కాకపోవటం వలన, కొత్తగా పదకొండు మురికివాడలు వీటి వెనుకనే ఏర్పడ్డాయి. ఈ వాణిజ్య, వ్యాపార, నివాస సముదాయాలలో ఉండేవారు కూడా వీరిని చౌకగా దొరికే వనరులుగా భావించి, ఇంటి పనివారిగా, స్వీపర్లుగా, సెక్యూరిటీ గార్డులుగా నియమించుకుంటున్నారు. వీరే కమ్యూనిటీ సేవలను అందించడంలో ముందున్నారు. వీధి వ్యాపారులుగా, షాపు కీపర్లు, ఇస్త్రీపనివారు, బార్బర్‌లుగా పనిచేస్తున్నారు. వీరందరి పిల్లలు సరిగ్గా విద్యను అందుకోలేక, నైపుణ్యంలేనిశ్రామిక వర్గంగా తయారై, భవిష్యత్తులో కొత్త మురికివాడల ఏర్పాటుకు కారకులౌతున్నారు.

మురికి వాడల రహిత భారతదేశం ఏర్పడాలంటే, ప్రతి రంగంలోనూ అట్టడుగుస్థాయిలో పనిచేస్తున్న మానవ వనరులకి కావాల్సిన నివాసం, మౌలిక సదుపాయాలు కల్పించకపోతే మురికివాడలను నిర్మూలించలేం. అందుకే ఏ ప్రాజెక్టు అయినా, ప్రాథమిక స్థాయిలోనే వీరందరికీ కల్పించాల్సిన వసతులు గురించి సరియైన ప్రణాళిక రచించడం ప్రథమ కర్తవ్యం. కొత్తగా ఏర్పడిన కేంద్ర ప్రభుత్వం దేశంలో వంద స్మార్ట్ సిటీలు ఈ-గవర్నెన్స్ తరహాలో నిర్మిస్తామని ప్రకటించింది. వీటిలో కూడా మానవ వనరుల గురించి చిత్తశుద్ధితో ఆలోచించి ప్రణాళిక రూపొందించకపోతే రానున్న కాలంలో ఈ స్మార్ట్ సిటీలు కూడా మురికివాడల ఆవాసాలు కావచ్చు. కనీసం మధ్యలో కాకపోయినా, వీటి చుట్టూ ఏర్పడతాయి. అందువలన, ఇప్పుడయినా సరియైన పద్ధతిలో వీటి గురించి చర్చ జరగాలి. మురికివాడల ప్రజల నివాస వసతులు, మౌలిక సదుపాయాల కల్పన కేవలం సామాజిక సేవా కోణంలో చూడకుండా, వీరి చవక శ్రామికశక్తిని దోచుకొని లాభపడుతున్న వారందరూ తమ సంపదలో వాటాగానో, మిగులులోంచో, ఎంతో కొంత కేటాయించటం తప్పనిసరిగా వారి కర్తవ్యంగా ఉండాలి. ❋

# మానవాభివృద్ధిపై మరోమారు దృష్టి సారించిన 'నోబెల్'

కొండూరు వీరయ్య



రచయిత వ్య.కా. సంఘం నాయకులు

**2015** సంవత్సరానికి ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతికి ఏంగస్ డేటన్‌ను ఎంపిక చేయటం ద్వారా ఆర్థిక శాస్త్ర పరిశోధనల్లో మానవాభివృద్ధి దశ, దిశలపై మరోమారు దృష్టి సారించాటానికి దోహదంచేసే అంశంగా చెప్పవచ్చు. ఆర్థిక అసమానతలు, వినియోగం, పేదరికం, ఆరోగ్యం మధ్య ఉన్న సంబంధాలు గురించి సాగించిన పరిశోధనలకు గుర్తింపుగా డేటన్‌కు ఈ బహుమతి ఇస్తున్నట్లు నోబెల్ సంస్థ ప్రకటించింది. ఈ సమయంలోనే డేటన్ ప్రచురించిన గ్రేట్ ఎస్కేప్ అనే పుస్తకం కూడా ఆర్థిక అంతరాలు ఆరోగ్య సమస్యల మధ్య ఉన్న సంబంధాన్ని శోధించటంలో కొత్త కోణాలు ముందుకు తెచ్చింది. డేటన్ పరిశోధలకు వర్ధమాన దేశాలు, ప్రత్యేకించి భారతదేశంలో మానవాభివృద్ధి రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు కేంద్రంగా ఉండటం గమనార్హం. ఏదైనా ఒక ఆవిష్కరణకు నోబెల్ బహుమతి ప్రకటించటం అంటే సదరు ఆవిష్కరణకు విశ్వవ్యాప్తంగా ఆమోదం ఇచ్చినట్లే. శాస్త్ర పరిశోధనా రంగంలో ఈ విధంగా చోటు చేసుకున్న ఆవిష్కరణలు కాలక్రమంలో మానవాళి శ్రేయస్సును ముందుకు తీసుకెళ్లటంలో ఉపయుక్త సాధనాలుగా ఉంటూ వచ్చాయి. డేటన్‌ను ఈ సంవత్సరం నోబెల్ పురస్కార గ్రహీతగా ఎంపిక చేయటానికి గల ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలంటే వర్తమాన ప్రపంచంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్నిగురించి కూడా ఆకళింపు చేసుకోవాల్సి ఉంది.

సార్వత్రిక శాస్త్ర విజ్ఞాన రంగంలో ఇస్తున్న నోబెల్ పురస్కారానికి, ఆర్థికరంగంలో ఇచ్చే నోబెల్ పురస్కారానికి మధ్య మౌలిక వ్యత్యాసం ఉంది. శాస్త్రవిజ్ఞాన రంగంలో కొత్త కొత్త ఆవిష్కరణలు మానవాళి పురోగతిలో ప్రాపంచిక విజ్ఞానాన్ని మరో మెట్టు పైకి తీసుకెళ్తున్న ఆవిష్కరణలుగా ఉన్నాయి. కానీ ఆర్థిక రంగంలో కొత్త కొత్త మార్కెట్ అనుకూల సూత్రీకరణలకు, ప్రతిపాదనలకు నోబెల్ పురస్కారం ఇస్తూ వచ్చారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం మొదలు 1970 దశకం వరకు కీన్స్ ప్రతిపాదించిన సంక్షేమ వ్యవస్థల మార్గాన్ని ప్రభుత్వాలు అనుసరించాయి. 1960 దశకం చివర్లో పెట్టుబడిదారీ వ్యవస్థలో చోటు చేసుకున్న సంక్షోభానికి కీన్స్ ప్రతిపాదిత ఆర్థిక విధానాలే కారణమన్న వాదన ప్రబలంగా ముందుకు వచ్చింది. కీన్స్ ప్రతిపాదించిన ప్రభుత్వ నియంత్రిత మార్కెట్ ఆర్థిక వ్యవస్థ స్థానంలో ఆర్థికాభివృద్ధి సాధించాలంటే మార్కెట్ శక్తులపై ఉన్న నియంత్రణలు ఎత్తి వేయాలని (సరళీకరణ) ప్రభుత్వ రంగం స్థానంలో ప్రైవేటు రంగానికి పెద్ద పీట వేయాలని ( ప్రైవేటీకరణ) పెట్టుబడి చలనంపై వివిధ దేశాల మధ్య ఉన్న నియంత్రణలు రద్దు చేసి దేశీయ ఆర్థిక వ్యవస్థల్లో గుత్తపెట్టుబడిదారులు సాధించిన లాభాలకు అంతర్జాతీయ పెట్టుబడిగా నామకరణం చేసి ప్రపంచ వ్యాప్తంగా స్వైరవిహారానికి అనుమతించాలని (ప్రపంచీకరణ) ప్రతిపాదనలు ముందుకొచ్చాయి. ఈ ప్రతిపాదనలకు సార్వజనీనత సాధించటం అంత తేలిక కాదు. అటువంటి సమయంలో ఆర్థిక శాస్త్ర ప్రతిపాదనలకు, సూత్రీకరణలకు నోబెల్ బహుమతుల నిర్వహణ కమిటీ ద్వారా పురస్కారాలు అందచేసే సాంప్రదాయం మొదలైంది. ఇదమిద్ధంగా ఈ మార్పుల వెనక ఏ దేశం హస్తం ఉన్నా లేకపోయినా ప్రపంచాన్ని కుదిపేసిన ఆర్థిక విధాన చర్చల్లో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలు అనుసరిస్తున్న విధానాలకు పెద్ద పీట వేయటానికి, సోషలిస్టు దేశాలు, వర్ధమాన దేశాలు అనుసరిస్తున్న సామ్యవాద ఆర్థిక విధానాలు, సంక్షేమ ఆర్థిక విధానాలను చిన్న బుచ్చటానికి ఈ ప్రయోగం సమయోచిత సాధనంగా అక్కరకొచ్చింది. ఆర్థిక రంగంలో నోబెల్ పురస్కారం ప్రారంభించినప్పటి నుండీ మార్కెట్ ప్రాయోజిత ఆర్థికవేత్తలకే పురస్కారాలు దక్కాయి తప్ప 1990 దశకం చివరి వరకు సామ్యవాద ఆర్థిక వ్యవస్థల మాట అటుంచి సంక్షేమవాద ఆర్థిక సూత్రాలు ప్రతిపాదించిన వారికి సైతం నోబెల్ మెట్లమీద స్థానం దక్కలేదు. నోబెల్ బహమతి పొందిన మొదటి సంక్షేమ ఆర్థిక వేత్తగా అమర్త్యసేన్‌ను చెప్పుకోవచ్చు. ఆయన ప్రతిపాదించిన విశ్లేషణ ప్రమాణాలు, ప్రాతిపదకలు విశ్వవ్యాప్తంగా ఆదరణ పొందిన మానవాభివృద్ధి నివేదికల రూపంలో మనకు కనిపిస్తున్నాయి.

మూడు దశాబ్దాల్లో మొదటిసారి అమర్త్యసేన్ వంటి సాంప్రదాయక పెట్టుబడిదారీ వ్యవస్థ విమర్శకులకు నోబెల్ మెట్లమీద స్థానం దక్కటం వెనక మరో పరిశీలించదగ్గ అంశం కూడా ఉంది. ప్రపంచీకరణ పతాక స్థాయికి చేరిన 1990 దశకంలో ఏసియన్ టైగర్స్ గా పిలవబడిన తూర్పు ఆసియాదేశాల్లో సంక్షోభం బద్దలైంది. ఇండోనేషియా వంటి దేశాల్లో ఆహారం కోసం బహిరంగ తిరుగుబాట్లు జరిగాయి. మదుపు సొమ్ము వెనక్కు తీసుకోవటానికి మదుపరులు బ్యాంకుల ముందు బారులు తీరి రోజుల తరబడి నిలబడ్డారు. బహుశా 1990 దశకంలో ప్రపంచీకరణ విధానాలకు తగిలిన తొలి ఎదురుదెబ్బగా తూర్పు ఆసియా దేశాల సంక్షోభం నిలిచిపోతుంది. సంక్షోభం నేపథ్యంలో వాషింగ్టన్ అవగాహన పేరుతో ప్రపంచం మీద స్వైర విహారం చేస్తున్న ప్రపంచీకరణ విధానాలను ప్రశ్నించటం, విమర్శించటం, ప్రత్యామ్నాయ విధానాల కోసం చర్చలు మొదలవటం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ చర్చలు, సైద్ధాంతిక విమర్శలకు కేంద్రంగా లాటిన్ అమెరికాలో ప్రారంభమైన సామాజిక శక్తులు చివరకు ప్రపంచ సామాజిక వేదిక రూపం తీసుకున్నాయి. లాటిన్ అమెరికాలో వెనిజులాతో మొదలు పెట్టి నూతన ప్రగతిశీల ప్రభుత్వాలు తెరమీదకు వచ్చాయి. దాంతో పాటు ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆర్థిక విధానాలపై జరిగిన

**❝ 2008లో మొదలైన ప్రపంచ ఆర్థిక సంక్షోభం 1999 నాటి సంక్షోభం కంటే ఎక్కువ స్థాయిలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది. ఎనిమిదేళ్ల తర్వాత కూడా ప్రపంచంలో ఏ దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయి లో కోలుకునే పరిస్థితి లేదు.❞**

చర్చల్లో కూడా కొత్త కోణం మొదలైంది. దాంతో ప్రపంచీకరణపై సాగుతున్న సైద్ధాంతిక దాడిని దారి మళ్లించటానికి అమర్త్యసేన్ ప్రతిపాదించిన మానవాభివృద్ధి కోణాన్ని ఆదరిస్తున్న సూచనలు ఇవ్వటానికి ఆయన్ను నోబెల్ పురస్కారానికి ఎంపిక చేయటం జరిగింది. 1998–99 నాటి సంక్షోభం నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ ఊపిరి తీసుకున్న తర్వాత మళ్లీ నోబెల్ కమిటీ తన పాత ధోరణికే మళ్లింది. 2008 సంక్షోభానికి పునాదులు వేసిన డెరివేటివ్స్ పద్ధతిని గుర్తించిన వారికి, అంతర్జాతీయ వాణిజ్యం ద్వారా అభివృద్ధి సాధించవచ్చున్న ప్రతిపాదనలకు నోబెల్ పురస్కారం ఇచ్చింది. 2008లో మొదలైన ప్రపంచ ఆర్థిక సంక్షోభం 1999 నాటి సంక్షోభం కంటే ఎక్కువ స్థాయిలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది. ఎనిమిదేళ్ల తర్వాత కూడా ప్రపంచంలో ఏ దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయి లో కోలుకునే పరిస్థితి లేదు. 1999 సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక చిన్న భాగాన్ని కకావికలం చేస్తే పరిస్థితిని చక్కదిద్దటానికి అమెరికా వంటి దేశాలు పూనుకున్నాయి. ప్రపంచీకరణకు ఆర్థికంగానే కాదు. సైద్ధాంతికంగా కూడా నాయకత్వం వహిస్తున్నది అమెరికా అన్న విషయం తెలిసిందే. కానీ 2008 నాటి సంక్షోభం దీనికి భిన్నమైనది. స్వేచ్ఛా వాణిజ్యానికి, ప్రపంచీకరణకు మూలస్థంభం అయిన అమెరికా లోనే ఈ సారి ముసలం మొదలైంది. కొమ్మలకు చెదలు పడితే చెట్టును కాపాడుకోవటానికి కొమ్మల నరుక్కుంటారు. కానీ వేరుకే చెదలు పడితే... సమకాలీన పెట్టుబడిదారీ వ్యవస్థలో 2008కు ముందు చోటు చేసుకున్న సంక్షోభాలకు 2008లో చోటు చేసుకున్న సంక్షోభానికి మధ్య ఉన్న వ్యత్యాసం అది. దాంతో సహజంగానే సైద్ధాంతిక స్పందన, విమర్శ, ప్రతివిమర్శలు కూడా అదే స్థాయికి పెరిగాయి. ప్రపంచీకరణపైనా, ప్రపంచీకరణకు పునాదిగా ఉన్న సామ్రాజ్యవాద విధానం, అంతర్జాతీయ గుత్తపెట్టుబడిదారీ విధానం, అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడిపై సైద్ధాంతిక ఆచరణ దాడి ఎక్కుపెట్టబడింది. ఈ దాడిలో భాగస్వాములవుతోంది కేవలం ప్రభాత్ పట్నాయక్, జిజెక్, డేవిడ్ హార్వే వంటి మార్క్సిస్టు, వామపక్ష మేధావులు, ఆర్థివేత్తలు మాత్రమే కాదు. ఫ్రెంచి మాజీ అధ్యక్షులు సర్కోజీ, బ్రిటిష్ మాజీ ఛాన్సలర్ గార్డన్ బ్రౌన్, గతంలో ఐఎంఎఫ్‌కు, ప్రపంచ బ్యాంకుకు సేవలందించిన స్టిగ్లిట్జ్ వరకు మధ్యేవాదులు, సంక్షేమవాదులు, కీనీసియనిస్టులు విచ్చలవిడి ప్రపంచీకరణపైనా, అడ్డు అదుపులేని ద్రవ్య పెట్టుబడి లాభాపేక్షపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు సర్కోజి భద్రమైన జీవితానికి కావల్సిన ప్రాథమిక అవసరాలు ఏమిటి అన్నది పరిశోధించటానికి ఏకంగా కమిషన్ నియమించాడు. ఈ నేపథ్యంలో భాగంగానే ఎగ్నెస్ డేటన్ పరిశోధనలపై దృష్టిసారించటాన్ని అర్థం చేసుకోవాలి. తాజా సంక్షోభం ప్రపంచీకరణ ఆర్థికవేత్తలు, వారి ఆర్థికశాస్త్ర ప్రయోగాలు అంతగా ఆదరణ పొందలేకపోతున్నాయన్న విషయం అర్థం చేసుకోవటానికి తాజా నోబెల్ వివాదం ఉపయోగపడుతుంది.

డేటన్ ప్రధాన విమర్శ వినిమయవాదానికి సంబంధించిన విమర్శ. మూడు దశాబ్దాలుగా వివిధ దేశాల్లో జరుగుతున్న అధికారిక సర్వేలు (భారతదేశంలో జాతీయ నమూనా సర్వే సంస్థ, కేంద్ర గణాంకాల సంస్థ వంటి సర్వేల కోవకు చెందినవి) వెల్లడించిన వివరాల ఆధారంగా ఆర్థిక అంతరాలు, ఆరోగ్య వ్యయం, వినిమయ వ్యయం వంటి అంశాల మధ్య ఉన్న సంబంధాలపై ఆయన కేంద్రీకరించారు. ప్రపంచ బ్యాంకు కోరిక మేరకు కుటుంబ సర్వేల విశ్లేషణలను అధ్యయనం చేయాల్సి విధి విధానాలపై కూడా ఆయన ఒక పుస్తకం ప్రచురించారు. జేమ్స్ వూల్ఫెన్సన్ ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా ఉన్న కాలంలో డేటన్ నివేదిక ఆధారంగానే జాతీయ స్థాయిలో ప్రపంచీకరణ విధానాలు రూపొందించి అమలు చేయటం కోసం కేంద్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకోవటంతో పాటు రాష్ట్రాల స్థాయిలో నిర్దిష్ట పరిస్థితులకు తగ్గట్లుగా నిర్దిష్ట మోతాదులో ఆర్థిక సంస్కరణలు అమలు చేయటానికి ఈ డేటన్ విశ్లేషణలే ప్రాతిపదికగా ఉన్నాయన్న విషయాన్ని మర్చిపోకూడదు. 1995–2004 మధ్య కాలంలో రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకు ప్రయోగశాలగా మార్చటానికి దారులు వేసింది ఈ విధానాలే. అందువల్లనే డేటన్ పరిశోధనలకు భారతదేశం కేంద్రంగా ఉండటాన్ని ఈ దృష్ట్యా అర్థం చేసుకోవాలి. గత మూడు దశాబ్దాలగా భారతదేశంలో వినిమయ వ్యయం గురించి, ప్రత్యేకించి ఆరోగ్య అవసరాలకు పెట్టే ఖర్చు విషయంలో సాగించిన పరిశోధనలు, వెలువడిన పరిశోధనా పత్రాల్లో ఎక్కడా మార్కెట్ విధానాల వైఫల్యం గురించిన చర్చకు స్థానం దక్కలేదు. పైగా వ్యక్తివాదానికి పెద్ద పీట వేస్తున్న పరిశోదనలుగానే ఇవి మిగిలిపోయాయి.

డీటన్‌కు పూర్వం పేదరికం గురించి, వినిమయం గురించి సాగిన పరిశోధనలు పేదరికాన్ని స్థిరమైన ధోరణిగా పరిగణించాయి. ఆదాయాలు, వ్యయాల్లో వస్తున్న మార్పులతో పాటు దారిద్ర్యంలో ఉన్న కుటుంబాల స్థితిగతులు మారుతాయన్న పరిణామాత్మకవాదంతో పరశోధనలు సాగించటం డేటన్ ప్రత్యేకతగా ఉంది. దాంతో కుటుంబ స్థాయిలో ఆదాయాల స్థితిగతుల్లో వస్తున్న మార్పులతో పాటు ఆయా కుటుంబాల వినియమ స్వభావంలో వచ్చే మార్పులను కూడా పరిశీలించటం ఆయన లక్ష్యంగా ఎంచుకున్నారు. డేటన్ తన సహచరుడు మౌల్‌బేయర్‌తో కలిసి ప్రతిపాదించిన ఆదర్శవంతమైన గిరాకీ స్థితి సిద్ధాంతం మార్కెట్ వ్యూహాలకు, వ్యక్తిగత వినిమయ ధోరణులకు మధ్య ఉన్న సంబంధాలను మార్కెట్ లాభాలు పెంచే కోణంలో పరిశీలించటానికి అవకాశం కల్పించింది. ఆదర్శవంతమైన గిరాకీ వ్యవస్థ అంటే నిర్దిష్ట సమయంలో నికరంగా నిర్దిష్ట ఆదాయం వస్తున్నపుడు ఏ మోతాదులో ఏ అవసరం కోసం ఖర్చు పెడతారు అన్న ఒక ఊహాజనిత గిరాకీ వ్యవస్థను ప్రతిపాదిస్తోంది. వివిధ దేశాల్లో ప్రభుత్వ సర్వే సంస్థలు, ప్రైవేటు సర్వే సంస్థలు వ్యక్తిగత వినిమయం గురించి చేస్తున్న సర్వేలన్నీ డేటన్ ఆవిష్కరణను మరింత ముందుకు తీసుకెళ్లేవే. భారతదేశంలో జాతీయ నమూనా సర్వే సంస్థ ఐదేళ్ల కొకసారి కుటుంబ వినియోగ వ్యయం వివరాల కోసం సాగించే సర్వే నిర్ధారణలు ఒకవైపున కుటుంబాల ఆదాయాలు, పేదరికం స్థాయిని నిర్ధారించటానికి ఒక ప్రమాణంగా ఉపయోగపడుతుంటే, మరోవైపున డేటన్ ప్రతిపాదించిన సూత్రాల ద్వారా కంపెనీలు తమ ఉత్పత్తులకు సంబంధించిన వ్యూహాలను విశ్లేషించుకోవటానికి,

పున:సమీక్షించుకోవటానికి ఉపయోగపడుతున్నాయి. ఆదర్శవంతమైన గిరాకీ స్థితి అసలు సాధ్యమా అన్న విషయాన్ని కూడ పరిశీలిద్దాం. ఈ సిద్ధాంతం పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల పూర్వీకులు ముందుకు తెచ్చిన సంపూర్ణ సమతౌల్య వ్యవస్థలో నిరుద్యోగం ఉందన్న సిద్ధాంతాన్ని పోలి ఉంటుంది. ఈ విధానాల వాస్తవికతను అర్థం చేసుకోవాలంటే కొత్త వాహనం లేదా ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసేటపుడు, మొబైల్స్ కొనేటపుడు దుకాణందారు వారంటీ ఇచ్చేటప్పుడు పెట్టే షరతులు గుర్తు తెచ్చుకుంటే సరిపోతుంది. ఫలానా కంపెనీ ఫలానా మోడల్ మోటార్ సైకిల్ కొంటే లీటరు పెట్రోలుతో 110 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేయవచ్చన్న ప్రకటనలు చూస్తాము. ఔత్సాహికులెవరైనా ప్రయోగం చేసి తక్కువ దూరంలో పెట్రోలు అయిపోయిందని షోరూంలో ఫిర్యాదు చేస్తే షోరూం నిర్వాహకుడు ఫలానా వేగంతో నడిపినప్పుడు మాత్రమే అది వర్తిస్తుంది, మీరు మధ్యలో రోడ్ మీద గుంటలున్నాయని బ్రేకులు, క్లచ్చులు ఎక్కువగా వాడటం, ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఇంజన్ ఆపలేదు వంటి వంద నిబంధనలు పాటించలేదు కాబట్టి మా వారంటీ వర్తించదు అని చావుకబురు చల్లగా చెప్తాడు. కీన్స్ నిరుద్యోగం విషయంలో ప్రతిపాదించిన ఆర్థిక వ్యవస్థ పూర్తి సమతౌల్యం సాధించినపుడు నిరుద్యోగానికి తావు ఉండదు అన్న వాదన కానీ, తాజాగా డేటన్ ప్రతిపాదించిన ఆదర్శవంతమైన గిరాకీ స్థితి కానీ షోరూం వాడు విధించే షరతుల్లాంటివే. ఆచరణలో అమలుకు సాధ్యమైనవి కాదు. అందువల్లనే పెట్టుబడిదారీ విధానంలో వృద్ధిరేట్లు ఎంతగా పురోగమించినా ఆచరణలో పేదరికం, దారిద్ర్యం, అనారోగ్యం, నిరక్షరాస్యత, నివాసాల కొరత వంటి మౌలిక సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయి.

డేటన్ ముందుకు తెచ్చిన మరో పరిశీలనాత్మక అంశం సగటు ఆదాయాల విశ్లేషణ. సగటు ఆదాయం అంటే దేశంలో ఉన్న ప్రజలందరి ఆదాయాన్ని కూడి మొత్తం ప్రజలు లేదా కుటుంబాలతో భాగిస్తేవచ్చే ఆదాయం. కుటుంబ సగటు లేదా తలసరి సగటు ఆదాయం. ఈ పద్ధతిలో సగటు తలసరి ఆదాయం ముఖేష్ అంబానీకి ఊళ్లో సైకిలు మీద ముగ్గురాళ్లు అమ్ముకునే వ్యక్తికీ, టాటాకు తాటాకు ఇంట్లో నివశించే వ్యక్తికీ, బిర్లాకు, బీడికార్మికులకు ఒకే రీతిలో సమానంగా ఆదాయం వస్తుందని ప్రభుత్వ సగటు ఆదాయం లెక్కలు చెప్తాయి. ఈ విషయంలో డేటన్ మరో అడుగు ముందుకు వేసి ఆదాయాల ప్రాతిపదికన కుటుంబాలను

**" ఈ దిశగానే ఆయన తన తాజా రచన గ్రేట్ ఎస్కేప్‌లో పేదరిక నిర్మూలనకు, ఆరోగ్య ప్రమాణాలు పెంచేందుకు ఆదాయం పెంచే మార్గాల వైపు దృష్టి మళ్లించటం కంటే నేరుగా ఆయా లబ్దిదారుల కుటుంబాలకు రొక్కం సమకూర్చటంద్వారా మార్కెట్ ప్రాయోజిత ఆర్థిక వ్యవస్థలో వారిని భాగస్వాములను చేయాలని సిఫార్సు చేస్తున్నారు. "**



ఏంగస్ డేటన్

తరగతులు వారీగా విభజించాలని, వేర్వేరు తరగతులకు చెందిన కుటుంబాల వినిమయం తీరుతెన్నులు పరిశీలించాలన్న మరో ప్రతిపాదన ముఖ్యమైనది. ఈ మధ్యకాలంలో ఆదాయ అంతరాలు పరిశీలించే పరిశోధనల్లో మొత్తం జనాభాను పదేసి శాతం చొప్పున విభజించి వివిధ తరగతుల మధ్య అంతరాలు అధ్యయనం చేసేందుకు ప్రమాణంగా ఉపయోగిస్తున్నారు. ఈ విధంగా పేదరికాన్ని పరిశోధించటంలో మార్కెట్ ప్రాయోజిత పరిశోధనలకు పెద్దపీట వేసిన వ్యక్తిగా డేటన్‌ను చెప్పుకోవచ్చు. ఈ దిశగానే ఆయన తన తాజా రచన గ్రేట్ ఎస్కేప్‌లో పేదరిక నిర్మూలనకు, ఆరోగ్య ప్రమాణాలు పెంచేందుకు ఆదాయం పెంచే మార్గాల వైపు దృష్టి మళ్లించటం కంటే నేరుగా ఆయా లబ్దిదారుల కుటుంబాలకు రొక్కం సమకూర్చటంద్వారా మార్కెట్ ప్రాయోజిత ఆర్థిక వ్యవస్థలో వారిని భాగస్వాములను చేయాలని సిఫార్సు చేస్తున్నారు.

ఈ రచనలో విశ్వమానవాళి ఆయుః ప్రమాణాలు పెంపొందించటంలో పారిశ్రామిక విప్లవం అనంతర పరిణామాలు సాధించిన విజయాలపై ఆయన కొత్త అంశాలు పాఠకుల దృష్టికి తెచ్చారు. పెట్టుబడిదారీ వ్యవస్థ నాలుగు వందల సంవత్సరాలుగా సంపద కేంద్రీకరణకు, లాభాలకు కారణమవుతున్నా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తెరమీదకు వచ్చిన ప్రజారోగ్య వ్యవస్థల ద్వారా మాత్రమే అంటువ్యాధుల నిర్మూలన సాధ్యమైందన్న చారిత్రక వాస్తవాన్ని డేటన్ కూడా అంగీకరించక తప్పలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎంతగా శాస్త్రవిజ్ఞాన రంగంలో పరిశోధన జరిగినా చాలా సమస్యలకు ప్రజా ఆరోగ్య వ్యవస్థ పుంజుకునే వరకు పరిష్కారం సాధించలేకపోవటం సార్వత్రిక ప్రయోజనాలు సాధించటంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఉన్న పరిమితులను గుర్తిస్తారు. అదేవిధంగా ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న అంటు వ్యాధులకు పారిశ్రామిక విప్లవమే కారణమని, పారిశ్రామిక విప్లవంతో ఆవిర్భవించిన పెట్టుబడిదారీ విధానం తిరిగి అవే అంటువ్యాధులకు పరిష్కారం వెతకటానికి వివిధ అంతర్జాతీయ వేదికల ద్వారా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని విమర్శిస్తారు. ఔషధ పరిశ్రమ ఆవిర్భావానికి మూలం చమురు శుద్ధి పరిజ్ఞానం అని, ఖనిజవాయువుల వినియోగంలో ఉప ఉత్పత్తిగా ఉన్న తారును శుద్ధి చేసే క్రమంలో సింథటిక్ రసాయనాలు ఉత్పత్తి అయ్యాయని, ఈ సింథటిక్ రసాయనాలే తర్వాతి కాలంలో అద్దకం పరిశ్రమకు ముడిసరుకుగా మారాయని ఆయన తన రచనలో వివరిస్తారు. అద్దకం పరిశ్రమ వినియోగం కోసం సల్ఫనమైడ్ అనే రసాయనం తయారు చేసే క్రమంలో ఉప ఉత్పత్తిగా వచ్చిన పెన్సిలిన్ తర్వాతి కాలంలో ఔషధరంగ పరిశ్రమ విస్తరణకు పునాదులు వేసిందని, పారిశ్రామిక విప్లవానికి ఔషధ పరిశ్రమల ప్రారంభానికి మధ్య ఉన్న సంబంధాన్ని చారిత్రక ఆధారాలతో నిరూపిస్తారు. అటువంటి ఆర్థికవేత్తకు నోబెల్ పురస్కారం ప్రకటించటం తిరిగి పేదరికంపై పరిశోధనల వైపు దృష్టి సారించటానికి దోహదం చేసే పరిణామంగా ఉంటుంది. తద్వారా ప్రపంచీకరణ ఆర్థిక విధానాలపైవెల్లువెత్తిన విమర్శల బారి నుండి ప్రజల దృష్టిని మళ్లించటానికి ఉపకరించే మార్గంగా కూడా ఇది ఉంటుంది. ఏది ఏమైనా డేటన్ రూపొందించిన ప్రమాణాలు పేదరికాన్ని అధ్యయనం చేయటంలో మార్కెట్ ప్రయోజనాలతో పాటు మానవాళి ప్రయోజనాలకు కొత్త కోణాలు అందించిందని చెప్పవచ్చు. ❋

## కార్పొరేట్ సంస్థల మోసాలు...

# ఒయన్‌జిసి గ్యాస్‌ను దోచేస్తున్న రిలయన్స్

**పరంజయ్ గుహ థాకుర్తా**

**భా**రతదేశంలో జరుగుతున్న ఓ జగడమిది. ఎలాంటి కనీస ఉదాహరణలు అవసరం లేని ఓ పోరు. ఈ దేశపు అతి పెద్ద ప్రభుత్వరంగ సంస్థ, ఆయిలు, సహజవాయువు ఉత్పత్తి దారైన 'ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జిసి), స్వతంత్ర్య భారతదేశంలో అతిపెద్ద ప్రైవేటు కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్.ఐ.ఎల్.)ల మధ్య న్యాయస్థానంలో నడుస్తున్న వ్యాజ్యం. బంగాళాఖాతం సముద్రతీరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా గోదావరి బేసిన్‌లోని సహజ వాయు నిక్షేపాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ అక్రమంగా దొంగిలిస్తున్నదని నడుస్తున్న తగాదా! అత్యంత దౌర్భాగ్యమైన విషయమేమిటంటే ఈ వ్యవహారంలో భారతీయ పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ సైతం భాగస్వామిగా ఉందని ఆరోపణలు ఎదుర్కోవడం.

ఇరు కంపెనీల మధ్య ఈ విషయమై రెండు సంవత్సరాలకు పైగా న్యాయ వివాదం నడుస్తుంది. వాద ప్రతివాదనలు జరుగుతున్న సమయంలోనే రెండు కంపెనీలు సాంకేతిక అథారిటీ నిజ నిర్ధారణ కోసం ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీపై ఆధారపడ్డాయి. అలాగే, యునైటెడ్ స్టేట్స్‌లోని, టెక్సాస్ రాష్ట్రంలోని డల్లాస్ నగరంలోని "డిగోల్యర్ అండ్ మ్యాక్ నామన్" కన్సల్టెన్సీ. డి అండ్ ఎం గా ఖ్యాతిగాంచిన ఈ సంస్థ 2015 అక్టోబర్ 9న ఓ మధ్యంతర నివేదిక నందించింది. "ఓఎన్‌జిసి పరిధిలో, ఎలాంటి అనుమతులేకుండా పదకొండు వేల కోట్ల రూపాయల (1.7 బిలియన్ డాలర్ల) విలువైన సహజ వాయువుని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అక్రమంగా దండుకుందని దాని సారాంశం.

ఈ నివేదిక విడుదలకు ముందు ఢిల్లీ హైకోర్టులో ఓఎన్‌జిసి తన వాదనను వినిపిస్తూ ముప్పై వేల కోట్ల విలువైన సహజ వాయువుని రిలయన్స్ దోచుకుందని ఆరోపించింది. పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖకు రిలయన్స్‌కు మధ్య జరిగిన "పంపకాల ఒప్పందాన్ని" అతిక్రమించి, రిలయన్స్ చేస్తున్న అనేకానేక అక్రమాలలో ఇదో అతి పెద్ద కుంభకోణంగా ఆరోపించింది.

మార్చి 3కు ముందు ఓఎన్‌జిసికి చెందిన కెజి బేసిన్‌లో 15 శాతం లేదా 9 బిలియన్ క్యూబిక్ మీటర్ల చమురుని రిలయన్స్ అక్రమంగా తరలించుకుందని, బ్రిటీష్ థర్మల్ యూనిట్ల ప్రకారం,ఈ సహజ వాయువు విలువ 11 వేల కోట్ల రూపాయలని డి అండ్ ఎం సంస్థ తన మధ్యంతర నివేదికలో పేర్కొంది. అంతేగాక భారతీయ ఆయిలు మరియు సహజవాయువు మంత్రిత్వశాఖ సాంకేతిక సలహాదారైన – డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రో కార్బన్ పాత్రను సైతం పేర్కొంది. ఓఎన్‌జిసి, ఆర్ఐఎల్ కృష్ణా గోదావరి బేసిన్ రిజర్వాయర్లలోని బ్లాక్‌లలో విచారణ జరపాలని కోరిన తర్వాత, తుది నివేదిక సమర్పించే ముందు ఇరుపక్షాలు తమ వాదనలను, వ్యాఖ్యాలను తెలుపవలసిందిగా కోరింది.

**నివేదిక సారాంశం – విశేషాలు :**

553 పేజీల తన మధ్యంతర నివేదికలో డి అండ్ ఎం పేర్కొన్న అంశాలు :

కృష్ణా గోదావరి రిజర్వాయర్‌లలోని కెజి డిఎల్ (కెజి–డి5), గోదావరి పిఎంఎల్( ప్రొడ్యూసర్ మైనింగ్ లీజ్) అథారిటీ, రెండూ రిలయన్స్ సంస్థల వ్యవస్థాపకుడు ధీరూభాయ్ అంబానీ పేరున వ్యవహరిస్తున్న డి1, డి3లకు అనుసంధానించబడి ఉన్నాయి.

డి అండ్ ఎం సంస్థ నివేదిక ననుసరించి సముద్రం అడుగున గోదావరి పిఎంఎల్ కెజి–డి5 నుండి కెజి డి8 వరకూ ఒకే ఒక అతిపెద్ద గ్యాస్ రిజర్వాయర్ ఉంది. 2009 ఏప్రియల్ 1 నుండి రిలయన్స్ ఉత్పత్తి చేసిన 58:68 బిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌లో రిలయన్స్ భాగం కేవలం 49.69 బిసిఎం మాత్రమే. మిగిలిన 8.984 బిసిఎం ఓఎన్‌జిసి వారు పొందాల్సిన భాగం. ఆనాటి విదేశీ మారక లెక్కల విలువ ప్రకారం అధికారికంగా ఒక్క ఎంబిటియు గ్యాస్ విలువ 4.2 డాలర్లు. ఆ విధంగా లెక్కిస్తే ఓఎన్‌జిసి నుండీ రిలయన్స్ లిమిటెడ్ తస్కరించిన నిక్షేపాల విలువ 1.7 బిలియన్ డాలర్లు లేదా 11,055 కోట్ల రూపాయలు.

2013 సంవత్సరం జులై మాసంలో కెజి డి6లోకి అనుసంధానమై ఉన్న రిలయన్స్ బ్లాక్‌ను గురించి అనుమానిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రో కార్బన్‌కు ఓఎన్‌జిసి లేఖ రాయడం ఈ అక్రమాల వెల్లడికి ఆరంభం. ఓఎన్‌జిసి బ్లాక్‌లకు అతి దగ్గరగా, ఉద్దేశ్యపూర్వకంగానే రిలయన్స్ తన బావులను తవ్వుకుందని, దీనివల్ల, ఓఎన్‌జిసికి సంబంధించిన సహజ వాయువులు తరలింప బడుతున్నాయని ఆరోపించింది. అయితే రిలయన్స్ ఇండియా లిమిటెడ్ మాత్రం ఉత్పత్తి భాగస్వామ్య కాంట్రాక్ట్ ప్రకారమే కెజి–డి6 బ్లాక్‌లో బావులు తవ్వడం జరిగిందని తమకు అనుమతి లభించిన ప్రాంతాల్లోనే సహజవాయువు తీయబడుతుందని వాదించింది.

డి అండ్ ఎం నివేదిక చాలా స్పష్టంగా చెప్పిన మరో అంశం ఓఎన్‌జిసి నుండీ అన్యాయంగా, అక్రమంగా తరలిపోతున్న నిక్షేపాలు 2017 జనవరి 1 నాటికి 11.89 బిసిఎం, 2019 మే 1 నాటికి మరో 12.71 బిసిఎం ఉంటాయని, దీనివల్ల ఓఎన్‌జిసికి భారీ మొత్తంలో ఆర్థిక నష్టం జరుగుతుందని తేల్చింది.

**నేపథ్యం:–**

ఓఎన్‌జిసి భావిస్తున్న ప్రకారం కెటి–1–డి–1లో లభించిన గ్యాస్, కృష్ణా గోదావరిలోని కెజి–డి5 బ్లాక్‌లోనిదిగానూ, జి–4లో లభించిన ప్లైయోసిన్ గ్యాస్ కెజి–డి6 సరిహద్దుల నుండీ అక్రమంగా దాటిన నిక్షేపాలు. అంతేగాక, వీరి మరో వాదన ప్రకారం, రిలయన్స్ ఇండియా లిమిటెడ్ త్రవ్విన డి–6–ఎ5, డి6–ఎ9, డి6–ఎ13 బావుల సరిహద్దులకు అతి దగ్గరగా ఏర్పాటుచేసి, జి–4లోని గ్యాస్‌ని డి6–బి6 ద్వారా లాగేసి డిడబ్ల్యుఎక్స్–డి1, కెజి–డిడబ్ల్యుఎన్ 98–2 బ్లాక్‌కు పంపుతుంది. రిలయన్స్ లిమిటెడ్ 2009 ఏప్రిల్‌లోనే తమ ఉత్పత్తి ప్రారంభించగా, ఓఎన్‌జిసి పెట్టుబడుల ప్రణాళికను ఇంకా రూపొందించలేదు.

2013లో ఓఎన్‌జిసి రిలయన్స్ లిమిటెడ్‌కి వ్యతిరేకంగా తమ అభ్యంతరాలను పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖకు, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రో కార్బన్స్‌కి తెలియజేసింది. తర్వాత ఇరు కంపెనీల ప్రతినిధులు సమావేశమై తమ కంపెనీల వివరాలను పరస్పరం పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. అదే సంవత్సరం డిసెంబర్‌లో జరగవలసిన

సమావేశం వాతావరణ అననుకూలత వలన జరగలేదు. ఓఎన్‌జిసి ఛానల్ సమావేశాన్ని కోరగా, ఆ ప్రతిపాదనను రిలయన్స్ అంగీకరించలేదు. అయినప్పటికీ ఇరుపక్షాలు తమ వద్ద ఉన్న సమాచారాన్ని పరస్పరం పంచుకోవాలనే నిర్ణయించాయి.

2014లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఓఎన్‌జిసి, ఆర్ఐఎల్, డిజిహెచ్. ముగ్గురూ ఒక స్వతంత్ర సంస్థ ద్వారా తమ వాద ప్రతివాదనలను కొనసాగించాలని, సమస్యను పరిష్కరించుకోవాలని భావించాయి. హఠాత్తుగా ఓఎన్‌జిసి ప్రభుత్వానికీ, ప్రైవేటు సంస్థ అయిన రిలయన్స్‌కి వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది.

**న్యాయస్థానంలో ఓఎన్‌జిసి:-**

2014, మే 15వ తేదీన ఓఎన్‌జిసి దాఖలు చేసిన పిటిషన్ మీడియా దృష్టిని, ప్రజల దృష్టిని పెద్దగా ఆకర్షించలేకపోయింది. మే 16న విడుదలవుతున్న రాజకీయ ఫలితాల వార్తల ప్రాధాన్యత కారణంగా, ఈ వార్త ఏమాత్రం ఆకర్షించలేకపోయింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్‌లను ప్రతివాదులుగా పేర్కొంటూ, ప్రభుత్వ ఆధీనంలోని ఈ రెండు శాఖలు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలోనూ, సరైన నిఘా పద్ధతులు పాటించడంలోనూ విఫలమవ్వడం వలన భారీ మొత్తంలో ధన నష్టం జరిగిందని ఓఎన్‌జిసి తమ వాదనలో పేర్కొంది. తన రిట్ పిటిషన్‌లో ప్రతివాది నెం.03 అయిన ఆర్ఐఎల్, సహజ వాయు నిక్షేపాలను దారిమళ్ళించి, అక్రమంగా తరలించాలన్న దురుద్దేశ్యంతోనే ఓఎన్‌జిసికి అతి దగ్గరగా, ముందుస్తు పథకం ప్రకారం 50 నుండి 350 మీటర్ల పరిధిలో నాలుగు బావులను తవ్వారని" పేర్కొంది.

ఓఎన్‌జిసి వాదన ప్రకారం తమకు కేటాయించబడిన బ్లాక్, గోదావరి పిఎంఎల్ (జి-4), తమచే కనుగొనబడిన బ్లాక్, క్రొత్త లైసెన్సింగ్ పాలసీ ఎన్ఇఎల్‌పి-1 ద్వారా లభించిన కెజి-డి5లకు అత్యంత సమీపంగా ఆర్ఐఎల్ ఉద్దేశ్యపూర్వకంగానే కెజి-డి6ని ఏర్పాటుచేసిందని పేర్కొంది. పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్‌లోని ఓఎన్‌జిసి ఈ వ్యవహారం మొత్తాన్ని ఓ స్వతంత్ర్య సంస్థ ద్వారా పరీక్షింపజేయాలని కోరింది.

ముఖేష్ అంబానీ సారథ్యంలోని ఆర్ఐఎల్ దాదాపు 30 వేల కోట్ల విలువైన ఓఎన్‌జిసి నిక్షేపాలను తస్కరించిందని పేర్కొంది. తమ

“ముఖేష్ అంబానీ సారథ్యంలోని ఆర్ఐఎల్ దాదాపు 30 వేల కోట్ల విలువైన ఓఎన్‌జిసి నిక్షేపాలను తస్కరించిందని పేర్కొంది. తమ ఆరోపణలు రుజువయితే జరిగిన దానికి ప్రతిఫలంగా 25 వేల కోట్ల రూపాయల నష్ట పరిహారాన్ని ఆర్ఐఎల్ ఓఎన్‌జిసికి చెల్లించాలని ఓఎన్‌జిసి సంస్థ తరపున తన వాదనలో దుష్యంత్ దావె పేర్కొన్నారు.”



కేజీ బేసిన్‌లో గ్యాస్ తోడుతున్న రిలయన్స్ రిగ్

ఆరోపణలు రుజువయితే జరిగిన దానికి ప్రతిఫలంగా 25 వేల కోట్ల రూపాయల నష్ట పరిహారాన్ని ఆర్ఐఎల్ ఓఎన్‌జిసికి చెల్లించాలని ఓఎన్‌జిసి సంస్థ తరపున తన వాదనలో దుష్యంత్ దావె పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆధీనంలోనున్న రెండు శాఖలు తమ వద్దనున్న సమాచారం ఆధారంగా ఓఎన్‌జిసి బావుల చమురు నిక్షేపాలను తస్కరించాలన్న ఆర్ఐఎల్ ఆలోచనను ఖండించి ఉండాల్సిందని పేర్కొంది.

అత్యంత సమీపంగా ఉన్న రిజర్వాయర్ల నుండి సహజవాయు నిక్షేపాలను పొందే సమయంలో అంతర్జాతీయంగా పాటిస్తున్న ప్రమాణాలను, పద్ధతులను ఆర్ఐఎల్ అనుసరించలేదని సైతం ఓఎన్‌జిసి తప్పుబట్టింది. 2000 సంవత్సరంలో జరిగిన ఒప్పందం ప్రకారం, పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ, రిలయన్స్ ఇండియా లిమిటెడ్ నిబంధనలు పాటించలేదని పేర్కొంటూ, ప్రక్క ప్రక్కనున్న రెండు సంస్థలు పరస్పర ఆధారంగా సహకారంతో అభివృద్ధి సాధించి ఉండాల్సిందని సైతం వాదించింది.

న్యాయస్థానాన్ని ఆశ్రయించాలన్న నిర్ణయానికి ఓఎన్‌జిసి ఎందుకొచ్చిందన్న ప్రశ్న చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. అంతేగాక మొదటి నుంచి సంస్థపై ఒత్తిడి సైతం అధికంగానే ఉంది. యుపిఎ ప్రభుత్వంలో ఆనాటి కేంద్ర మంత్రి వీరప్ప మొయిలీ, తన మంత్రిత్వ శాఖ కార్యదర్శి 'సౌరభ్‌చంద్ర'కు ఓ నోట్ పంపుతూ, దాదాపు 70 శాతం షేర్లు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సంస్థ, ఏ ధైర్యంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని ముందుకు వెళ్ళిందో విచారణ చేపట్టమన్నారు.

ఇక్కడ ప్రధానంగా గ్రహించవలసిన వాస్తవం ఏమిటంటే 2014 మే 22వ తేదీన మొయిలీ నోట్ పంపారు. ప్రజలు అప్పటికే యుపిఎ ప్రభుత్వాన్ని తిరస్కరించారు. మరో నాలుగు రోజులలో అనగా మే 26న భారతదేశ ప్రధానమంత్రిగా 'నరేంద్ర మోడీ' ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు జరిగిందీ సంఘటన.

మే 15న రిలయన్స్ చేసిన ప్రకటనలో తమ 'అభివృద్ధి ప్రణాళిక', 'తమ సంస్థ కార్యకలాపాలన్నీ పిఎస్‌సి నిబంధనల కనుగుణంగా, వీటో అధికారాలున్న ప్రభుత్వ అధికారుల కమిటీ అంగీకరించిన ప్రకారమే జరుగుతున్నాయని తెలియజేసింది. తమ కంపెనీ బావులున్న ప్రాంతాలను, వాటి వాస్తవ పరిస్థితులను ప్రత్యేక కమిటీ పరీక్షించి, పునఃపరిశీలన చేసి ఆమోదముద్ర వేసిందని పేర్కొంది. మరో ముఖ్యమైన అంశంగా "ఓఎన్‌జిసి, ఆర్ఐఎల్ పరస్పర వివరాలను పంచుకొని స్వతంత్ర అధికారమున్న మూడవ పార్టీని ఏర్పరిచే సమావేశం 2014, మే 9న జరిగిందని వెల్లడించింది.

ఢిల్లీ న్యాయస్థానంలో ఓఎన్‌జిసి వేసిన వ్యాజ్యానికి ఆర్ఐఎల్ మే 28న సమాధానమిస్తూ, "తమకు, ఓఎన్‌జిసికి మే 9న జరిగిన సమావేశంలో రాసుకున్న ముసాయిదా ప్రకారం, తమ వివాదానికి సంబంధించిన విచారణను ఒక స్వతంత్ర సంస్థకు అప్పగించాలని, అందు కోసం నాలుగు సంస్థలను ఎంచుకున్నట్లు మే 23కల్లా వాటిల్లో, ఏ సంస్థకు ఈ వివాదాన్ని

**"డి అండ్ ఎం సంస్థ తన మధ్యంతర నివేదికను 9, అక్టోబర్ 2015లో సమర్పించిన తర్వాత, ఒఎన్‌జిసి, రిలయన్స్‌ల జగడం గూర్చి జాతీయ, అంతర్జాతీయ కథనాలు అనేకం వచ్చాయి. ఒఎన్‌జిసి ఆరోపణలే నిజమని, రిలయన్స్, సహజ వాయువుని తస్కరించిందనే ఈ వార్తల్లో తెలిపాయి."**

అధికారికంగా అప్పగించాలో నిర్ణయించి, వారిచ్చిన నివేదికను నైపుణ్యం ఉన్న ఏజెన్సీలకు పంపి సమాధానం పొందాలని, దానికి ముందు చేస్తున్న వాదనలన్నీ ఊహాజనితాలు, అనధికార ప్రకటనలు, పత్రాలు అవుతాయని" తెలిపింది.

ఇదిలా ఉండగా ఒఎన్‌జిసి మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ కె. సరాఫ్ రిలయన్స్‌కి వ్యతిరేకంగా అసలెందుకు కేసు వేయాలనుకున్నారో ఆ వివరాలన్నింటినీ మొదటిసారిగా 2014 మే 20న ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా వారికి తెలియజేశాడు.

"ఒఎన్‌జిసి బ్లాక్‌ల నుండి రిలయన్స్ తస్కరిస్తున్న సహజవాయు నిక్షేపాల వ్యవహారం మార్చిలో మా బోర్డ్ దృష్టికి వచ్చింది. మా సంస్థ వ్యాపారానికి జరిగే నష్టాన్ని ఎదుర్కోవాలని బోర్డ్ అభిప్రాయపడింది. న్యాయపరంగా ఈ సమస్యను ఎదుర్కోవాలని నిర్ణయించుకుంది" అని తెలిపారు.

అభిజ్ఞవర్గాల అనధికార సమాచారం ప్రకారం ఒఎన్‌జిసి బోర్డ్‌లోని ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లు న్యాయ పోరాటం చేయాలని చాలా బలంగా భావించారు. నిజానికి డైరెక్టర్లుగా వీరి పదవీకాలం ముగిసింది. మేనేజింగ్ డైరెక్టర్ సరాఫ్ మాటల్లో...

"నాటి ఒఎన్‌జిసి ప్రధానాధికారి సుధీర్ వాసుదేవ పదవీకాలం 26 ఫిబ్రవరి 2014లో ముగిసింది. ఆ స్థానంలో నేను నియమించబడ్డాను. వాసుదేవ పదవీకాలం పొగించాలని భావించిన మొయిలీ ప్రతిపాదనను, ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని అపాయింట్‌మెంట్ కమిటీ తిరస్కరించింది. భారతీయ జనతాపార్టీ ఆనాటి అధికార ప్రతినిధి, నేడు కేంద్ర వాణిజ్య వ్యవహారాల శాఖామంత్రి నిర్మలా సీతారామన్, రిలయన్స్ ఇండియా లిమిటెడ్‌కి వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేసిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా పార్లమెంట్ సభ్యుడు 'గురుదాస్ గుప్తా' సైతం వ్యతిరేకించారు.



రిలయన్స్ ఛైర్మన్
ముఖేస్ అంబాని



ఒఎన్‌జిసి ఎండి
దినేష్ కె. షరాఫ్

**పెట్రోలియం మంత్రిత్వశాఖ వ్యతిరేకత:-**

ఆగస్టు 2014లో, పెట్రోలియం మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రో కార్బన్స్ సంయుక్తంగా "ఒఎన్‌జిసి వేసిన వ్యాజ్యం ఆధార రహితమని, 70 శాతం షేర్లున్న తమ శాఖకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఉండకూడదని, రిలయన్స్‌పై దొంగతనం ఆరోపణలు చేసి ఉండకూడదని, సహజ వాయు నిక్షేపాల రిజర్వాయర్లు, ఛానెల్స్ యొక్క మైనింగ్ లీజు జి4 బ్లాక్, 2008కి ముందు అనుమతించబడినదని, అప్పటికి కెజి-డి6 లేదని, రిలయన్స్ వారికి 2009 ఏప్రిల్‌లో అనుమతినివ్వడం జరిగిందని" ప్రతి వ్యాజ్యం వేశారు. "2013 జులై వరకు, ఒఎన్‌జిసి నిద్రపోయిందని, కేజి బేసిన్‌లోని భూగర్భ, భూభౌతిక వివరాలను ప్రభుత్వం అడిగినప్పుడు మేల్కొని, ఈ పిటిషన్ వేసిందని, ఇది స్వతంత్ర సంస్థ ఏర్పాటు చేయడం కోసం పెట్టుకున్న కలహమని, ఈ గొడవ కేవలం డి అండ్ ఎం సంస్థ కోసమేనని" సైతం వాదన చేశారు.

"హిందూ బిజినెస్ లైన్" పత్రిక సమాచారం ప్రకారం ఒఎన్‌జిసి, రిలయన్స్‌ల తగాదా తీర్చడం కోసం డి అండ్ ఎం సంస్థ మొట్టమొదటగా 16 జులై 2014న సూచించబడింది. ఆ తర్వాతనే ప్రభుత్వం, ఒఎన్‌జిసి, రిలయన్స్ మూడు కలిసి సముద్రం అడుగునున్న వాయు నిక్షేపాలను, నిజ నిర్ధారణ చేయడం కోసం డి అండ్ యంను ఎంచుకున్నాయి. 2014 సెప్టెంబర్ 25 తర్వాత ఒఎన్‌జిసి, రిలయన్స్ తమ సంస్థల వివరాలను డి అండ్ ఎంతో పంచుకున్నాయి. పెట్రోలియం, సహజ వాయువుల శాఖ స్టేట్ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 2014 నవంబర్ 26న పార్లమెంట్‌లో మాట్లాడుతూ తమ మంత్రిత్వశాఖ, రిలయన్స్, ఒఎన్‌జిసి మూడూ కలిసి స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేసుకున్నా యని, 'డి అండ్ ఎం' 2015 జులైలో నివేదిక సమర్పిస్తుందని, ఒఎన్‌జిసి ఆరోపిస్తున్న దొంగ తనం జరిగిందో లేదో ఆ నివేదిక నిరూపిస్తుం దని, కేజీ బేసిన్‌లోని బ్లాక్‌ల గురించి ఆ సంస్థ సమగ్ర సమాచారం వెలువరిస్తుందని" ప్రకటించారు.

**ప్రభుత్వానికి ప్రశ్నలు:-**

డి అండ్ ఎం సంస్థ తన మధ్యంతర నివేదికను 9, అక్టోబర్ 2015లో సమర్పించిన తర్వాత, ఒఎన్‌జిసి, రిలయన్స్‌ల జగడం గూర్చి జాతీయ, అంతర్జాతీయ కథనాలు అనేకం వచ్చాయి. ఒఎన్‌జిసి ఆరోపణలే నిజమని, రిలయన్స్, సహజ వాయువుని తస్కరించిందనే ఈ వార్తల్లో తెలిపాయి.

రిలయన్స్‌కి వ్యతిరేకంగా వేయబడిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంలో ఒక వాది, గతంలో భారత ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేసిన ఇఎఎస్ శర్మ అక్టోబర్ 9న పెట్రోలియం శాఖ ప్రస్తుత కార్యదర్శి కె.డి. త్రిపాఠీకి అనేక ప్రశ్నలతో ఓ లేఖను పంపారు. అవేమనగా.

1) సహజ వాయు నిక్షేపాల కోసం కాంట్రాక్ట్ పొంది, లైసెన్స్ తీసుకున్న రిలయన్స్‌కు, తనకు లభించిన ప్రాంతం, ఒఎన్‌జిసి ప్రాంతానికి దగ్గరగా, అనుసంధానమై ఉందని తెలుసా?

2) తెలిసినట్లయితే, పెట్రోలియం మంత్రిత్వశాఖ వారి ఆర్టికల్ నెం.12లో చెప్పిన ప్రకారం ఒఎన్‌జిసితో సంతకం చేసిన విషయాన్ని భారత ప్రభుత్వానికి రిలయన్స్ తెలియజేసిందా?

3) ఒఎన్‌జిసి, ఆర్ఐఎల్‌లపై నియంత్రణాధికారం, వారు చేస్తున్న త్రవ్వకాలపై అజమాయిషీ కలిగిన డిజిహెచ్ ఏ పాత్ర పోషించింది?

4) ప్రపంచవ్యాప్తంగా అమలులో ఉన్న సంయుక్త విధానం తెలిసిన డిజిహెచ్, ఆర్టికల్ 12 ప్రకారం ఎందుకు చర్యలు చేపట్టలేదు?

5) ఓఎన్‌జిసి చేసిన ఫిర్యాదును ప్రభుత్వం కావాలనే సాగదీసిందా?

6) పెట్రోలియం, సహజవాయువు 1959 చట్టంలోని రూల్స్‌లో ఆర్టికల్ 4ను, ఉత్పత్తి భాగస్వామ్య ఒప్పందంలోని ఆర్టికల్ 3ను ఉల్లంఘించి, లైసెన్స్ ఏరియాకు సంబంధించి తప్పుడు సమాచారాన్నిస్తున్న పార్టీ లైసెన్స్ క్యాన్సిలేషన్ కోరుతూ పంపిన షోకాజ్ నోటీసుపై ఆర్టికల్ 30.3 కి సంబంధించి ప్రభుత్వం ఏం చర్యలు చేపట్టింది?


7) ఓఎన్‌జిసిలో 70 శాతం షేర్లున్న ప్రభుత్వం సమస్యకు పరిష్కారం చూపకుండా, మరో మార్గాంతరం లేక న్యాయ వ్యవస్థను ఆశ్రయించే పరిస్థితికి ఓఎన్‌జిసిని ఎందుకు తీసుకు వచ్చింది?

నియంత్రిత ధరల నిర్ణయంలో, రిలయన్స్ పెట్టిన ఖర్చును ఎక్కువ చేసి చూయించటం (గోల్డ్ ప్లేటింగ్), రిలయన్స్ దిగుమతి చేసుకున్న పరికరాల ధరలను ఎక్కువగా చూయించటం తదితరాలలో ప్రభుత్వంలో పని చేస్తున్న కొందరు అధికారులు రిలయన్స్‌తో కుమ్మక్కయ్యారని 2011 సెప్టెంబరులో పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సిఏజి పేర్కొనటాన్ని ఈ మాజీ ప్రభుత్వాధికారి ఉదహరించాడు. ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించటం ఆర్టికల్4కు, ఉత్పత్తి భాగస్వామ్య ఒప్పందానికి భిన్నంగా విస్తారమైన ప్రాంతంలో అన్వేషణ, గ్యాస్ వెలికితీతకు రిలయన్స్‌కు అవకాశమిచ్చిందా అన్న అనుమానాన్ని సైతం శర్మ వ్యక్తం చేశారు.

ఆర్టికల్ 4ని ధిక్కరిస్తూ, విస్తారంగా వాయు నిక్షేపాలను సేకరించడంలో రిలయన్స్ విస్తరించటంతో పాటు, రిలయన్స్ మౌలిక సదుపాయాలలో మిగిలిన భాగాన్ని ఓఎన్‌జిసి వినియోగించుకొనే విధంగా బలవంత పెట్టిందా అని కూడా శర్మ సందేహాన్ని వ్యక్తం చేశాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 12 ప్రకారం ఓఎన్‌జిసి ప్రభుత్వంలోని ఓ ప్రధానాంగం.

ఎలాంటి కారణాలు లేకుండా స్వతంత్ర డైరెక్టర్లను ప్రభుత్వం తొలగించడం అన్నిటికన్నా విషాదకరమైన విషయం. 2011లో ఆయిల్, గ్యాస్ రిజర్వాయర్ల అంచనాలో నిపుణుడైన పి. గోపాలకృష్ణన్ పెట్రోలియం మంత్రిత్వశాఖకు సమర్పించిన నివేదికలో “కేజి బేసిన్ నుండి అధిక మొత్తంలో, అత్యంత వేగంగా గ్యాస్ నిక్షేపాలను పిండడం చాలా భారీ నష్టాన్ని కలిగించడమే గాక భూమి అట్టడుగుకు కుంగిపోతుందని” చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ “ఈ నష్టాన్ని ఎవరు పూడ్చగలరు?” అని శర్మ ప్రశ్నించారు.

> **“కేజి బేసిన్‌లో జరుగుతున్న సహజవాయు నిక్షేపాల తరలింపులో ఓఎన్‌జిసికి అన్యాయం జరగడంలో, రిలయన్స్, చమురు, సహజ వాయువుల మంత్రిత్వశాఖ సమాన భాగస్వాము లన్న అభిప్రాయం ఆయన వ్యక్తం చేశారు.”**



గ్యాస్ దోపిడీపై ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఏఎస్ శర్మ

## ఒప్పందాల అమలు

ఏ రంగమైనా, ఏ ఒప్పందమైనా, సక్రమంగా అమలు పరచడం ప్రభుత్వం యొక్క ప్రధాన బాధ్యత, అది సుపరిపాలన లక్షణమని శర్మ సరిగానే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా భూగర్భం నుండి సేకరించే అత్యధిక విలువ కలిగిన, దేశ ఇంధన భద్రతకు కీలకమైన సహజ వాయువు విషయంలో చాలా అప్రమత్తత అవసరమన్నారు.

కేజి బేసిన్‌లో జరుగుతున్న సహజవాయు నిక్షేపాల తరలింపులో ఓఎన్‌జిసికి అన్యాయం జరగడంలో, రిలయన్స్, చమురు, సహజ వాయువుల మంత్రిత్వశాఖ సమాన భాగస్వాము లన్న అభిప్రాయం ఆయన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని మేనేజిమెంట్ కమిటీ సైతం సహజ వాయువుల తస్కరణలో రిలయన్స్‌కి అనుకూలంగా వ్యవహరించడమేగాక, జరుగుతున్న అక్రమాల పట్ల జాగురూకత వహించ లేదని తెలిపారు. విదేశీ పెట్టుబడులను ఆహ్వానించటం సహజ వాయువుల రంగానికే గాక, ఏ రంగానికీ మంచిది కాదని హెచ్చరించారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండి, ప్రజల భాగస్వామ్యమున్న ఓఎన్‌జిసి లాంటి సంస్థలు స్వతంత్రంగా వ్యవహరిస్తూ ప్రజలకు బాధ్యత వహించాలని, ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాలన్న స్వతంత్ర డైరెక్టర్ల సూచనను మొయిలీ తిరస్కరించడం శోచనీయమని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలోని ఓఎన్‌జిసికి వ్యతిరేకంగా ప్రభుత్వమే వ్యవహరించడం విషాదకరమన్నారు.

ఇక ముందేం జరగబోతోంది? రిలయన్స్, ఓఎన్‌జిసి, డిజిహెచ్‌ల వాదనలు విన్న తర్వాత డి అండ్ ఎం తన తుది నివేదిక ఎంతకాలానికి సమర్పించబోతుంది. అన్న విషయం తెలియదు. డి అండ్ ఎం ఇవ్వవలసిన కాలంకన్నా మూడు నెలల ఆలస్యంగా తన మధ్యంతర నివే దికను అందించింది. బహుశా ఇప్పటి వరకూ అందించిన వివరాలు, నివేదిక ఆధారంగా ఓఎన్‌జిసికి రిలయన్స్ ఇండియా లిమిటెడ్ నష్టపరిహారాన్ని చెల్లించాలని సూచించవచ్చు. మధ్యంతర నివేదికలోని వాస్తవాలే, తుది నివేది కలో సైతం ఉండాలని ఓఎన్‌జిసి ఆకాంక్షిస్తున్నది.

తుది నివేదిక అనంతరం, న్యాయ సంబంధమైన మార్గాలు ఏమున్నాయి? రిలయన్స్, ఓఎన్‌జిసి, డిజిహెచ్ లేదా మంత్రిత్వశాఖ వీరిలో ఎవరైనా తమ సమస్యల పట్ల ఢిల్లీ హైకోర్టుని మరలా ఆశ్రయించవచ్చు. సుప్రీంకోర్టు కూడా కల్పించుకోవచ్చు. లేదా స్వతంత్ర సంస్థల ద్వారా రాజీ పద్ధతిలో తమ వివాదాన్ని పరిష్కరించుకోవచ్చు. వీటన్నింటికీ కాలమే పరిష్కారం చూపాలి. ఏం బహిర్గతమౌతుందో భవిష్యత్తే తెలపాలి. ఏది ఏమైనా భారతీయ గ్యాస్ భారీ దోపిడీకి గురవుతుందన్నది వాస్తవం.

ఈ వ్యాసం నవంబర్ 2015లో రాయబడింది. తదనంతరం 2015 డిసెంబర్ 2న, డి అండ్ ఎం తన తుది నివేదికను సమర్పించినట్లు పత్రికల్లో వార్తలొచ్చాయి. మనం ఇప్పటి వరకకు చర్చించిన మధ్యంతర నివేదికలాగానే తుది నివేదిక సైతం ఉందని వార్తలను బట్టి అర్థమౌతున్నది.

**(డి అండ్ యం నవంబరు 30న తుది నివేదిక ఇవ్వటానికి ముందు ఈ వ్యాసం రాయబడింది)**

అనువాదం : **డాక్టర్ శమంతకమణి**

# కార్యకర్తలు నిరంతరం ఆందోళన, ప్రచారం నిర్వహించాలి

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**ప్రశ్న : కార్యకర్తలు యాజిటేషన్, ప్రాపగాండ మరియు సైద్ధాంతిక పోరాటం ఏకకాలంలో నిర్వహించడం ఎలా? అందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి? వివరించగలరు?**

**- ఆర్. లక్ష్మయ్య,** విజయవాడ

ఆందోళన, ప్రచారం అనే పదాలకు మనం రోజువారీ వాడుక భాషలో వాడే అర్థాలు వేరు. కమ్యూనిస్టు పార్టీలు తమ కార్యకలాపాలను నిర్వహించే సందర్భంలో ఆందోళన, ప్రచారం అన్న పదాలకు ఇచ్చే అర్థాలు వేరు.

నిర్దిష్టమైన, శాస్త్రీయమైన భావంతో ఈ పదాలను వాడతాం. ఈ విషయం గమనంలో లేకపోతే తీవ్రమైన గందరగోళంలో పడుతుంటాం. వాడుక భాషలో ఆందోళన అంటే ఆదుర్దాను, మానసిక అలజడిలను వ్యక్తం చేయడానికి ఎక్కువగా వాడుతుంటాం. అరుదుగా అలజడి సృష్టించడం, ప్రకోపించడం అన్న అర్థంలో ఇంగ్లీషు భాషలో (యాజిటేషన్) వాడుతుంటారు. అలాగే ప్రచారం అన్న పదాన్ని వాడుక భాషలో సమాచారాన్ని వ్యాప్తి చేయడం అన్న అర్థంలో వాడుతుంటాం. ఈ సమాచారం కూడా పాక్షికమైన, ఎక్కువ సందర్భాలలో వాస్తవాన్ని మరుగుపర్చేదిగా ఉంటుంది. ప్రచారం అన్న అర్థం ఈ పదానికి స్థిరపడింది.

కమ్యూనిస్టుపార్టీల సాహిత్యంలోగాని, కార్యకలాపాలలోగాని ఈ రెండు పదాలను పై అర్థంలో వినియోగించడం లేదు.

ఆందోళన, ప్రచారం అన్న పదాలను మార్క్సిస్టులు ఏ విధంగా అర్థం చేసుకోవాలో తెలుసుకోవాలంటే ప్రామాణికమైన వివరణ మనకు లెనిన్ రచించిన 'ఏం చేయాలి' గ్రంథంలో లభిస్తుంది. ప్లెహనోవ్ ఈ రెండు పదాలకు ఇచ్చిన నిర్వచనాలను ఉదహరించి లెనిన్ సవివరంగా విశ్లేషించారు. ఈ విశ్లేషణను చదివితే ఆందోళన, ప్రచారం పదాలకు శాస్త్రీయ అర్థం స్పష్టమవుతుంది.

ఎక్కువ మందికి తక్కువ విషయాలను హత్తుకునేటట్లుగా తెలియజేయడానికి చేసే కృషిని, పనులను 'ఆందోళన'గాను, ఎక్కువ విషయాలను, ఎక్కువ సమయం తీసుకొని తక్కువ మందికైనా సమగ్రంగా అర్థమయ్యేటట్లు చేసే కృషిని, పనులను ప్రచారంగా చెప్పుకోవచ్చు. ప్రజలకు విషయాలను తెలియ చెప్పడానికి మనం చేస్తున్న కార్యకలాపాలను పై రెండు రకాలుగా విభజించవచ్చు. మనం వేసే కరపత్రాలను, సభలను, బుక్‌లెట్లను, పోస్టర్లను, ప్లకార్డులను, గోడ రాతలను, కార్టూన్లను, ఎగ్జిబిషన్లను, పత్రికలను 'ఆందోళన' కృషిగా పరిగణించవచ్చు. కళాబృందాలు పాడే పాటలు ప్రదర్శనలు, ప్రధానంగా ఆందోళన క్రిందకు వస్తాయి. మనం ప్రచురించే పుస్తకాలు రాజకీయ పాఠశాలలు, సెమినార్లు, పరిశోధనా కార్యకలాపాలు 'ప్రచారం' క్రిందకు వస్తాయి. ప్రజల అవగాహనను, చైతన్యాన్ని పెంచడానికి ఈ రెండు రకాల కృషి అవసరం. ఏ పనిలో లోపం జరిగినా ప్రజానీకాన్ని సోషలిజంవైపు ఆకర్షించడం సాధ్యం కాదు.

అనేకమంది 'ఆందోళన' అంటే ఉద్యమాలు నిర్వహించడంగా భావిస్తుంటారు. ఆందోళనను 'పోరాటం'తో గందరగోళపడకూడదు. 'ఆందోళన' కార్యకర్తలు నిర్వహించే పని. పోరాటం ప్రజలు నిర్వహించే పని. ప్రజలు పాల్గొనకుండా కార్యకర్తలు మాత్రమే నిర్వహించే పనులను (ఉదా: రాస్తారోకోలు, దిష్టిబొమ్మ దగ్ధాలు వగైరాలు) ఆందోళనలుగానే పరిగణించాలి. పోరాటాలు అనుకోరాదు. ఇవే రూపాలలో సాధారణ ప్రజలు విరివిగా పాల్గొంటే వాటిని పోరాటాలుగా పరిగణించాల్సి ఉంటుంది.

ఆందోళనా కార్యక్రమం నిర్వహించడానికి ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొనాల్సిన అవసరం లేదు. కార్యకర్త చొరవతో ప్రజలెక్కడుంటే అక్కడ ఆందోళన నిర్వహించవచ్చు. ప్రజలు కార్యాచరణలోకి వచ్చేట్లు ఉంటేనే, కదిలేటట్లుంటేనే ఆందోళన చెయ్యాలన్న పొరపాటు భావన అనేకమంది కార్యకర్తలలో ఉంది.

ఆందోళన కార్యక్రమం కదలని ప్రజలను కదిలించడానికి తోడ్పడుతుంది. సంబంధాలు లేని ప్రజలతో సంబంధాలు పెట్టుకునేందుకు ఉపయోగపడుతుంది. అందువలన సంబంధిత జనంలో మనకు ఎవరూ లేరని, వారు కదలరని చెప్పి ఆందోళన నిర్వహించడానికి సంకోచించడం పొరపాటు ధోరణి. వాస్తవంగా సంబంధాలు లేనిచోట సంబంధాలు తెచ్చుకోవడానికి, కదలని జనాన్ని కదలించడానికి ఆందోళన సరియైన సాధనం.

ప్రచారం అన్న పదాన్ని కూడా ఎక్కువ మంది ప్రజలకు మన అభిప్రాయాలను తెలిసేలా చేయటం అన్న అర్థంలో ఎక్కువగా వినియోగిస్తుంటాం. ఈ దృష్టితోనే మనం నిర్వహించే ఆందోళనా కార్యక్రమాలను ప్రచారం అంటుంటాం. దీనివలన శాస్త్రీయమైన పరిధిలో 'ప్రచారం' అన్న భావనను అర్థం చేసుకోవటం నిర్లక్ష్యం చేయబడుతున్నది. సైద్ధాంతిక పోరాటంలో ప్రచార కృషికున్న ప్రాధాన్యత విస్మరించబడుతున్నది.

ఆందోళన, ప్రచార కృషి ప్రజలను చైతన్యం చేయడానికి తోడ్పడుతున్నందున, అవి సైద్ధాంతిక పోరాటానికి ముఖ్యమైన సాధనాలవుతాయి. ఆందోళన, ప్రచార కార్యక్రమాలు ఎంత ఎక్కువగా నిర్వహిస్తే సైద్ధాంతిక పోరాటం అంత ముమ్మరంగా నిర్వహించినట్లవుతుంది.

'ఆందోళన', 'ప్రచారం' అన్న భావాల గురించి ఇంకా సవివరమైన విశ్లేషణ ప్రత్యేక వ్యాసం ద్వారా భవిష్యత్తులో తెలుసుకుందాం.

❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

**'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

# కామ్రేడ్ డివిఎస్

(2వ పేజీ తరువాయి)

ఇదొక నిదర్శనం. తాను అంతపనిచేస్తూ, ఇతరులు కూడా పనిచేయాలనేదే అతని తాపత్రయం. అలా పనిచేయకపోతే అతను ఏ విభాగంలో బాధ్యత వహించి పనిచేస్తుంటే ఆ విభాగంలో కామ్రేడ్స్‌పట్ల తన అసంతృప్తిని ప్రకటించేవాడు. ఈ వైఖరిని కొంతమంది కామ్రేడ్స్ అర్థం చేసుకోలేకపోయి వుండవచ్చు. కాని కార్యాలయాల్లో హోల్‌టైమర్లు ఎలా పనిచేయాలో అతన్ని చూసి నేర్చుకోవాల్సి వుంది.

పార్టీలో రివిజనిజం పట్ల అతని అసహ్యానికి, కోపానికి అవధులులేవు. అతను పార్టీ సభ్యులందరికీ కామ్రేడ్ కనగాల కుటుంబరావుతో కలసి రాసి పంపిన బహిరంగ లేఖ అందుకో మచ్చుతునక. 1964లో జరిగిన రాష్ట్ర పార్టీ మహాసభలో కామ్రేడ్ డివిఎస్‌ను కార్యవర్గానికి పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకొన్నదంటే, పార్టీ ఆయన ప్రజ్ఞావిశేషాలను గుర్తించిందనేది విదితం.

కామ్రేడ్ డివిఎస్ వజ్రసంకల్పుడు కాబట్టే ఎంతో ప్రధాన పాత్ర వహిస్తున్నాడు కాబట్టే అతనిపై నందా కన్నుపడింది. అతన్ని డిటెయిన్ చేసినా కూడా అతను వేసిన పునాదులు గట్టివి కాబట్టే నేడు కామ్రేడ్స్ జనశక్తి పత్రికను విజయవంతంగా నిర్వహించుకొని పోగలుగుతున్నారు.

**ఇదే మా శపథం**

కామ్రేడ్ డివిఎస్ లేనిలోటు తీర్చటం సులభం కాదు. కాని కామ్రేడ్స్ ఆ పని సాధించగలం. ప్రజాశక్తి ప్రెస్‌ను విజయవంతంగా నిర్వహించిన కామ్రేడ్ నాగులపల్లి కోటేశ్వరరావును కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. ప్రజాశక్తి, విశాలాంధ్ర మరింత బలీయంగా అవతరించాయి. ఆ పరిణామంలో డివిఎస్ నిర్వహించింది ఒక ముఖ్యపాత్ర.

కామ్రేడ్ డివిఎస్ జనశక్తిని విజయవంతంగా నిర్వహిస్తుండగా కన్నుమూశాడు. చరిత్ర పునరావృతమవుతోంది. జనశక్తి నిజమైన ప్రజాశక్తిగా విజృంభిస్తుంది. సందేహం లేదు. ఆ ప్రజాశక్తి విజృంభించినపుడు ప్రజా విద్రోహులు, పార్టీ విద్రోహులు అందులో శలభాల్లాగా మాడిపోతారు. ఆ ప్రజాశక్తి విజృంభించడానికే మనం ఎడతెగని కృషిచేసి దాన్ని సాధించాలి. అలాచేస్తేనే మనం డివిఎస్‌కు నిజమైన జోహార్లు అర్పించగలం. అతని భార్య భిక్షావతికి మిగిలింది పుట్టెడు దుఃఖం. ఈ దుఃఖాన్ని ఎవరూ ఓదార్చి తీర్చలేరు. కాని భిక్షావతి కామ్రేడ్ డివిఎస్‌కు సమమైన ఉజ్జీ. కాబట్టే ఆమె తన దుఃఖాన్ని త్వరలోనే మరచిపోగలుగుతుందని, మా అందరితో చేతులు కలిపి, మనందరి ఉమ్మడి గమ్యంవైపు పయనిస్తుందని మా విశ్వాసం.

1948 మధ్యకాలంలో వేలాది కామ్రేడ్స్ తుపాకీ గుండ్లకు బలయ్యారు. వారి సమాధుల ముందు నిలబడి ఏమి శపథాలు చేశామో, అటుపిమ్మట పార్టీ ఏ ఊబిలో దిగబడిపోయిందో అందరికీ తెలిసిన విషయమే. కామ్రేడ్ డివిఎస్ ఈసారి మళ్లీ ఆ విధంగా జరగబోదు. ఇదే ఈ సమయంలో మనం తీసుకోవాల్సిన ప్రతిజ్ఞ.

ఈ వ్యాసాన్ని నాడు అజ్ఞాతంగా వున్న నండూరు ప్రసాదరావుగారు రాశారు.

***(కా॥ డి.వి.ఎస్. 50వ వర్ధంతి సందర్భంగా ఈ వ్యాసాన్ని పునర్ముద్రిస్తున్నాము)***

❋

---

# రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న సంఘ పరివార్

(9వ పేజీ తరువాయి)

మాటలివి. ఆయన అప్పటికి భారత రాష్ట్రపతి కాలేదు. ఆయన జనవరి 26ననే రాష్ట్రపతి కాగలిగారు. అప్పటి గవర్నర్ జనరల్ శ్రీ రాజగోపాలాచారి బ్రిటీష్‌వారిచే నియమితులై నందువల్ల శ్రీ రాజేంద్రప్రసాద్‌చే ప్రమాణ స్వీకారం చేయించలేకపోయారు. అప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ రాజేంద్ర ప్రసాద్‌చే రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయిం చారు. ఆయన ప్రమాణ స్వీకారం అనంతరం మధ్యంతర ప్రభుత్వానికి నూతన రాజ్యాంగం ఆమోదించబడింది. నూతన రాజ్యాంగం ప్రకా రం, 1952లో తాజా ఎన్నికలు జరిగాయి. కానీ సర్దార్ పటేల్ మొదటి ప్రధానమంత్రిగా తిరస్కరింపబడ్డారని చెప్పటం ఈ రోజుల్లో మనం వింటున్నాము. దురదృష్టవశాత్తూ పటేల్ 1950లో మరణించారు. మొట్టమొదటి ఎన్నికలు 1952లో జరిగాయి.

......... (అభ్యంతరాలు)........... అది మీకు అర్థమైందా? ఏదొక గారడీ లేదా తంత్రంతో చనిపోయిన వినాయకుడినో లేదా ఎవరినన్నా దురదృష్టవశాత్తూ, బ్రతికించి తిరిగి తేగలిగితే, నేను అర్థం చేసుకోగలను. అవే కాకుండా డా॥ రాజేంద్రప్రసాద్ రాజ్యాంగాన్ని ఆమోదించినందుకు ప్రశంసిస్తూ తన ప్రసంగంలో ఇలా అన్నారు. "ఈ రాజ్యాంగం జీవంలేని యంత్రం లాంటిది. ప్రజలు దాన్ని నియంత్రించి, నిర్వహించినప్పుడే దానికి జీవం వస్తుంది. ఈ దేశంపై భక్తీ, ఆసక్తి గల నిజాయితీయపరు లైన వ్యక్తుల బృందం ఈ దేశానికి ఇప్పుడు అత్యంత అవసరం"

నవంబర్ 26, 1949న డా॥ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు, 'మన జీవితంలో అనేక పరిస్థితుల కారణంగా చీలికలు తెచ్చే ధోరణి ఉంటూ ఉంటుంది. మనలో మత, కుల, భాషా, ప్రాంతీయతల పరమైన రకరకాల భిన్నాభిప్రా యాలు ఉన్నాయి. ఈ భిన్నాభిప్రాయాల కారణంగా పెరిగే విద్వేషాలకు అతీతంగా ఉండి, చిన్న బృందాలు, ప్రాంతాల కోసం విస్తృతమైన దేశ ప్రయోజనాలను బలి చేయనివ్వని, దార్శనికత, దృఢశీలత కలిగిన వ్యక్తుల అవసరముంది. అటువంటి వ్యక్తుల్ని సమృద్ధిగా ఈ దేశం అంది స్తుందని ఆశిద్దాం" మనం ఈ రోజు పరిస్థితుల్ని చూసుకుంటే అటువంటి వ్యక్తుల్ని సమృద్ధిగా మనం తయారు చేసుకోగలమా? మీరు నిజంగా రాజ్యాంగంపై మీ విశ్వాసాన్ని పునరుద్ధాటించాలనుకున్నా, ఆ భావాన్ని సరిచేసుకోవటానికి ఇది తగిన సమయం. డా॥ అంబేద్కర్‌కు నివాళులర్పించాలనుకున్నా... (అభ్యంతరాలు)

సమయం ఇచ్చినందుకు ధన్యవాదాలు...

స్వేచ్ఛానువాదం : **కొండముది లక్ష్మీప్రసాద్**

---


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ-2

# కార్మికవర్గ సంస్కృతి ఫ్యూడల్, సామ్రాజ్యవాద వ్యతిరేకమైనది



**చై**నాలో సాంస్కృతిక, సైద్ధాంతిక రంగంలో పరిణామాలు మే 4కు ముందు జరిగినవి, ఆ తర్వాత జరిగినవి చారిత్రకంగా రెండు భిన్నమైన కాలాలకు చెందినవిగా ఉన్నాయి.

మే 4 ఉద్యమానికి ముందు చైనా సాంస్కృతిక రంగంలో ఫ్యూడల్ వర్గానికి చెందిన పాత సంస్కృతికి, బూర్జువా వర్గానికి చెందిన నూతన సంస్కృతికి మధ్య పోరాటం జరిగింది. ఆధునిక పాఠశాల విధానానికి, సామ్రాజ్యవాద పరీక్షా విధానానికి మధ్య, నూతన అధ్యయన విధానం, పాత అధ్యయన విధానాలకు మధ్య, పశ్చిమ దేశాల అధ్యయన విధానానికి, చైనా అధ్యయన విధానానికి మధ్య జరిగిన పోరాటం అంతా ఈ తరహాకు చెందినదే. ఆధునిక విధానంగా లేక నూతన అధ్యయన విధానంగా లేక పశ్చిమ దేశాల అధ్యయన విధానంగా చెప్పబడినవన్నీ పెట్టుబడిదారులకు ప్రధానంగా ( ప్రధానంగా అని ఎందుకు చెబుతున్నామంటే కొన్నింటిలో చైనాలోని ఫ్యూడలిజం యొక్క హానికరమైన అవశేషాలు ఇంకా ఉన్నాయి) అవసరమైన ప్రకృతి శాస్త్రాలపైనా, సామాజిక, రాజకీయ సిద్ధాంతాలపైనా కేంద్రీకరించాయి. ఆ సమయంలో నూతన అధ్యయన పద్ధతులు, సిద్ధాంతం చైనాలోని ఫ్యూడల్ సిద్ధాంతంతో పోరాడటంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాయి. పాతకాలపు బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని నెరవేర్చటానికి తోడ్పడ్డాయి. చైనాలో పెట్టుబడిదారులు శక్తిహీనులుగా ఉండటం, ప్రపంచం అప్పటికే సామ్రాజ్యవాద దశలో ప్రవేశించటం వలన ఈ పెట్టుబడిదారీ సిద్ధాంతాలు కొద్దికాలం మాత్రమే మనగలిగాయి. ఆ తర్వాత 'పురాతన కాలానికి తిరిగివెళ్ళే' చైనా ఫ్యూడల్ సిద్ధాంతం, ప్రజలను బానిసలుగా చేసే విదేశీ సామ్రాజ్యవాదం యొక్క అభివృద్ధి నిరోధక సిద్ధాంతాల ప్రతీఘాతుక మిత్రుత్వంతో దీనిని వెనక్కు కొట్టారు. ఈ అభివృద్ధి నిరోధక సంఘటన కొద్దిస్థాయిలో ప్రతీఘాతుక దాడి ప్రారంభించగానే నూతన భావాల ప్రతినిధులు వారి బ్యానర్లను కిందికి దించారు. వారి ప్రచారాన్ని విరమించి వెనక్కుతగ్గటంతో దాని బాహ్యరూపం కనిపిస్తున్నా, సారం హరించుకుపోయింది. సామ్రాజ్యవాద యుగంలో పాత పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య సంస్కృతికి కాలంతీరి క్షీణించిపోయింది. అది విఫలం కావటం అనివార్యం.

కాని మే 4 ఉద్యమం తర్వాత పరిస్థితులు మారాయి. చైనా కమ్యూనిస్టులు నాయకత్వం వహిస్తున్న ఒక నూతన సిద్ధాంతం, కమ్యూనిస్టు సంస్కృతి, కమ్యూనిస్టుల ప్రపంచ దృక్పథం, సామాజిక విప్లవ సిద్ధాంతం ఉనికిలోకి వచ్చాయి. 1919లో మే 4 ఉద్యమం జరిగింది. 1921లో చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. చైనాలో నిజమైన కార్మికోద్యమం ప్రారంభమైంది. ఇవి మొదటి ప్రపంచయుద్ధం, అక్టోబరు విప్లవం తర్వాత జరిగాయి. కార్మికవర్గపు నూతన రాజకీయశక్తిగా కమ్యూనిస్టు పార్టీ చైనా రాజకీయ రంగంలోకి ప్రవేశించింది. ఫలితంగా నూతన సాంస్కృతిక శక్తిగా నూతన ఆయుధాలతో, సాధ్యమైన మేరకు మిత్రులను కూడగట్టుకొని, తన శ్రేణులను యుద్ధరంగంలోకి దింపి, సామ్రాజ్యవాద, ఫ్యూడల్ సంస్కృతులకు వ్యతిరేకంగా వీరోచితమైన పోరాటాన్ని ప్రారంభించింది. సామాజిక శాస్త్రాలు, కళలు, సాహిత్యం, తత్వశాస్త్రం, ఆర్థికశాస్త్రం, రాజకీయ శాస్త్రం, మిలిటరి, చరిత్ర( నాటకాలు, సినిమా, సంగీతం, శిల్పం, చిత్రలేఖనం) తదితర రంగాలలో ఈ నూతన శక్తి గొప్ప ముందడుగు వేసింది. గత 20 సంవత్సరాలలో ఈ నూతన శక్తి ఎక్కడ తనదాడి ప్రారంభించినా, సైద్ధాంతికంగానూ, ఆచరణలోనూ ఆ రంగంలో గొప్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఏ రంగంలోకి ప్రవేశించినా అజేయమైన శక్తిగా దాని ప్రభావం, పలుకుబడి పెరిగాయి. చైనా చరిత్రలో మరేశక్తీ సమీకరించలేనంత పెద్ద సంఖ్యలో ప్రజలను తన వెనుక సమీకరించింది.

నూతన ప్రజాస్వామిక సంస్కృతి విస్తార ప్రజానీకం యొక్క సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక సంస్కృతి. అది ఈ రోజు జపాన్ వ్యతిరేక ఐక్యసంఘటన సంస్కృతి. కమ్యూనిస్టు పార్టీ, కార్మికవర్గ సిద్ధాంతం, సాంస్కృతిక రంగం నాయకత్వంలో మాత్రమే ఇటువంటి సంస్కృతి సాధ్యమౌతుంది. ఇతర ఏ వర్గాల సిద్ధాంతం, సంస్కృతి ద్వారానూ ఇటువంటి సంస్కృతికాభివృద్ధి సాధ్యం కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే నూతన ప్రజాస్వామిక సంస్కృతి విస్తార ప్రజానీకానికి చెందిన సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక సంస్కృతి.

**(1940 జనవరిలో మావో రాసిన 'నూతన ప్రజాస్వామ్యం' వ్యాసం నుండి ఈ భాగం తీసుకొనబడినది)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.10, No.8. Published on January 1, 2016